




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 21 సోమవారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 217


Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# విభేదాలకు స్వస్తి పలకండి

- ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశ్మానవాటిక అనే సూత్రానికి అందరూ కట్టుబడాలి
- దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలి
- జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగను సామూహికంగా నిర్వహించాలి
- కుల భేదాలకు స్వస్తి పలకాలని మోహన్ భగవత్ పిలుపు
- అలీగఢ్‌లో 5 రోజుల పర్యటనలో ఉన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

2



న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి

కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ హిందూ సమాజానికి పిలుపునిచ్చారు. అలీగఢ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న ఆయన అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశ్మాన వాటిక అనే సూత్రానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని మోహన్ భగవత్ కోరారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి సాధించడానికి ముందుగా భారత్ సామాజిక ఐక్యత సాధించడం కీలకమని మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. హిందూ సమాజానికి పునాదిగా భావించే విలువలు, సంప్రదాయం, సాంస్కృతిక విలువలు, నైతిక సూత్రాల పేరుతో ఆ చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలన్నారు. కుల భేదాలకు స్వస్తి పలకాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. నైతిక విలువలు పాటిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకుని పోవాలన్నారు. ఎలాంటి భేదాలు చూపకుండా అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలన్నారు. అట్టడుగు స్థాయిలో సామరస్యం, ఐక్యతను వ్యాప్తి చేయాలన్నారు. సంస్కారం అనే పునాదిపై నుంచి కుటుంబం, దాని విలువలు రూపు దిద్దుకున్నాయని మోహన్ భగవత్ తెలిపారు. ఇది సమాజంలో ప్రాథమిక యూనిట్‌గా ఉంటోందన్నారు. జాతీయవాదం, సామాజిక

# మెగా డీఎస్సీ వచ్చేసింది..!

- మొత్తం 478 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- మే 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ
- మే 20 నుంచి అందుబాటులో ఆన్‌లైన్ మాక్ టెస్టు
- జూన్, జూలైలో రాత పరీక్షలు.. వెంటనే ఫలితాలు

2



**చిత్తూరు-నవభూమిబ్యూరో:** ఎట్టకేలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేసింది. అధికారంలోకి వస్తే తాము మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిలబెట్టుకుంది. ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాదిలోనే నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం భావించినా, ఎస్సీ వర్గీకరణ అడ్డురావడంతో కొంత సమయం పట్టింది. అయినా, గత ఏడాది టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) నిర్వహించి.. నవంబరులోనే ఫలితాలు విడుదల చేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు జైకొట్టిన ప్రభుత్వం డీఎస్సీకీ సై చెప్పింది. ఉమ్మడి చిత్తూరు

## కిటాక్యూషు స్ఫూర్తితో క్లీన్ అండ్ గ్రీన్

- హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు
- కిటాక్యూషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దేలా ఒప్పందాలు
- పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం
- ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అధికారుల బృందం
- కిటాక్యూషు సిటీ మేయర్ కజుహిసా టకేయుచితో సమావేశం

2



కిటాక్యూషు-నవభూమి ప్రతినిధి

జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యావరణహిత కిటాక్యూషు నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో

## ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

- ఇంద్రవెల్లి స్థూపం వద్ద నిర్వహించిన సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క
- ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తాం

2



**ఇంద్రవెల్లి-నవభూమి:** ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి స్థూపం వద్ద నిర్వహించిన సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరవీరులకు నివాళి అర్పించి, సంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. 44 ఏళ్ల క్రితం జరిగిన ఘటనలో ఎందరో ఆదివాసీ బిడ్డలు అమరులవడం దురదృష్టకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తామని చెప్పారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై తీరని అనుమానాలు

2

- హైకోర్టులో పిటిషన్లు..!
- దర్యాప్తు పూర్తయిందని ప్రకటించిన పోలీసులు
- బయటపెట్టని పోస్టుమార్టం నివేదిక
- క్రైస్తవ వర్గాల్లో ఇంకా అనుమానాలు



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఏపీలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై పోలీసుల దర్యాప్తు పూర్తయి రోడ్డు ప్రమాదంగా ప్రకటించిన తర్వాత కూడా ఇంకా క్రైస్తవ వర్గాల్లో ఇంకా అనుమానాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా పోలీసులు ప్రవీణ్ పోస్టుమార్టం నివేదిక బయటపెట్టకపోవడం, సీసీ కెమెరా ఫుటేజ్ ల విడుదల ద్వారా రోడ్డు ప్రమాదంగా నిరూపించేందుకు జరిగిన ప్రయత్నాల నేపథ్యంలో అనుమానాలు ఇంకా అలాగే ఉండిపోయాయి. దీంతో పాస్టర్ ప్రవీణ్ మృతిపై తిరిగి దర్యాప్తు కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలవుతున్నాయి. పాస్టర్ ప్రవీణ్ హైదరాబాద్ లోని తిరుమలగిరిలో బుల్లెట్ బైక్ పై బయలుదేరి విజయవాడ హైవే మీదుగా రాజమండ్రి వరకూ వచ్చాక అక్కడ రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసుల దర్యాప్తు వెల్లడించింది. అయితే ఈ ఘటన జరిగినప్పటి నుంచి

## టీజీఎస్ఆర్టీసీలో 3 వేలకుపైగా ఉద్యోగాలు

- త్వరలో ఆర్టీసీలో ఉద్యోగాలకు నోటిఫికేషన్
- 3,038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి
- త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తాం
- ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నాం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

2




హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో భారీగా ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 3,038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని.. త్వరలోనే నోటిఫికేషన్ వేయడంతోపాటు సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నామని మంత్రి పొన్నం ఈ సందర్భంగా గుర్తు చేశారు. తద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని, ఇప్పటి వరకు ఆర్టీసీలో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని మంత్రి పొన్నం తెలిపారు. అంతేగాక, మహాలక్ష్మి కోసం కొత్త బస్సులు కొనుగోలు చేశామన్నారు. ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సన్నద్ధమైందని మంత్రి పొన్నం తెలిపారు. మొత్తం 3,038 ఉద్యోగాల్లో 2,000 డ్రైవర్ పోస్టులు,

## అక్రమ కాస్మెటిక్ సర్జరీతో మహిళ మృతి

- మహిళకు ఇద్దరు పిల్లలు..న్యూయార్క్‌లో ఘటన
- లైసెన్స్ లేని వ్యక్తి ఫెలిపే హెూయోస్ సర్జరీ చేసిన వైనం
- లిడోకైన్ అధిక మోతాదు వల్లే మహిళ మృతి
- పరారీకి యత్నించి, నిందితుడు ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్

2



న్యూయార్క్-నవభూమి ప్రతినిధి

అమెరికాలోని న్యూయార్క్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. లైసెన్స్ లేని ఓ వ్యక్తి చేసిన కాస్మెటిక్ సర్జరీ వికటించడంతో ఇద్దరు పిల్లల తల్లి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే, కొలంబియాకు చెందిన 31 ఏళ్ల మరియా పెనలోజా కబ్రేరా, మార్చి 28న క్వీన్స్‌లోని ఓ ఇంట్లో బట్ లిఫ్ట్ ఇంప్లాంట్ తొలగింపు కోసం శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే, ఈ సర్జరీని నిర్వహించిన 38 ఏళ్ల ఫెలిపే హెూయోస్-ఫారోండాకు వైద్యుడిగా

## 40 ఏళ్లలో టీడీపీకి ఒక్కసారే ఛాన్స్!

- టీడీపీ ఆవిర్భావించిన నాలుగేళ్ల తర్వాత కార్పొరేషన్‌కు ఎన్నిక
- ఈ ఎన్నికల్లో టీడీపీ నేత డీవీ సుబ్బారావు మేయర్‌గా ఎన్నిక
- 40 ఏళ్ల తర్వాత గ్రేటర్ మేయర్‌గా కూటమి నేత పీలా శ్రీనివాసరావు ఎన్నిక?
- వైసీపీ మేయర్ హరివెంకట కుమారిపై నెగ్గిన అవిశ్వాసం

2



విశాఖపట్నం-నవభూమిబ్యూరో

రాష్ట్రంలోనే అతి పెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ విశాఖ రాజకీయం ఆసక్తి రేపుతోంది. మేయర్ హరివెంకట కుమారిపై అవిశ్వాసం నెగ్గడంతో త్వరలో టీడీపీ నేత

## ఉపఎన్నికలకు రెడీగా ఉండండి!

2



- కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరం
- రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉంది
- పదేండ్ల పాటు సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెద్దుల్లాగా కేసీఆర్ పరుగులు పెట్టించారు
- వరంగల్ రజతోత్సవ సభను భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి

హైదరాబాద్-నవభూమి ప్రతినిధి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉందన్నారు. అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ నేత వనం శ్రీరామ్ రెడ్డి, పలు పార్టీల నేతలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉంది. కచ్చితంగా ఏప్రిల్ 27వ తేదీ నాడు.. వరంగల్‌కు తరలిరావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో రాజేంద్ర నగర్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీలో అత్తాపూర్ డివిజన్ నుండి శ్రీరామ్ రెడ్డి, పలు పార్టీల నేతలు చేరారు. వారందరికి కేటీఆర్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పదేండ్ల పాటు సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెద్దుల్లాగా కేసీఆర్ పరుగులు పెట్టించారు. మొన్నటి ఎన్నికల్లో మనం ఓడిపోవడంతో మనకు జరిగిన నష్టం తక్కువ.. కానీ మన ఓటమితో తెలంగాణ సమాజానికి ఎక్కువ నష్టం జరిగింది. ఇది అక్షర సత్యం, వాస్తవం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వడంతో తినే కంచంలో మన్ను పోసుకున్నట్లయిందని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి మాటన్నీ బోగస్ అని.. 6 గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి చేయలేదన్నారు. బస్సుల్లో ఆడవాళ్లు కొట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా క్షీణించిందని వ్యాఖ్యానించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలున్న కాంగ్రెస్ నేతలను హైడ్రా ముట్టుకోదని కేటీఆర్ ఆరోపించారు. గత ఎన్నికల్లో ఓటమి బీఆర్ఎస్ కంటే ప్రజలకే ఎక్కువ నష్టమని అన్నారు. కేసీఆర్ మరోసారి సీఎం కావడం చారిత్రక అవసరమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని ఎవరన్న అనుకుంటే అది వారి అజ్ఞానం. రేవంత్ రెడ్డి మీద నోరుపారేసుకుని మన నోరును కరాబ్ చేసుకోవాల్సిన అవసరం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.


## పెన్షన్ పునరుద్ధరణ?

2

## అశోక గజపతికి గవర్నర్ పదవి?

- ప్రధాని మోదీ మెచ్చిన అశోక గజపతికి గవర్నర్ ఛాన్స్
- చంద్రబాబుతోనే రాజకీయాల్లోకి వచ్చిన రాజవంశీకుడు
- 1983లో టీడీపీలో చేరి అందులోనే కొనసాగిన గజపతి
- అధిష్టానానికి నమ్మకస్తుడిగా, పార్టీకి పూర్తి విధేయుతతో పనిచేయడం అశోక్ గజపతి రాజు నైజం
- వేల కోట్ల ఆస్తులను ప్రజలకు దానం చేసి
- రాజవంశీయుడిగా అశోక్‌కు ప్రత్యేక గుర్తింపు

2



విశాఖపట్నం-నవభూమిబ్యూరో


కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజుకు కీలక పదవి దక్కబోతోందని ప్రచారం జరుగుతోంది. టీడీపీ అధిష్టానం కూడా ఆయనకు సముచిత స్థానం కల్పించాలని భావిస్తోంది. పార్టీలో చంద్రబాబు సహచరుడిగా సుదీర్ఘ కాలం కొనసాగిన అశోక్ గజపతిరాజు ప్రస్తుతం రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా వైదొలగిన ఆయనకు సమున్నత స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైందని, త్వరలోనే అశోక్ గజపతికి అత్యున్నత స్థానం దక్కబోతోందని ప్రచారం జరుగుతోంది. విజయనగరం జిల్లాకు చెందిన అశోక్ గజపతిరాజు ముఖ్యమంత్రి చంద్రబాబు తోపాటే 1978లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తొలి నుంచి కాంగ్రెస్ వ్యతిరేక భావజాలం ఉన్న ఈ విజయనగరం మహా రాజు.. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాం నుంచి అశోక్ పార్టీకి నమ్మకమైన నేతగా కొనసాగుతున్నారు. 1983 నుంచి 2009 వరకు మధ్యలో ఒకసారి తప్ప మిగిలిన అన్ని ఎన్నికల్లో విజయనగరం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అశోక్ గజపతిరాజు టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారి మంత్రిగా పనిచేశారు. టీడీపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు తర్వాత నెంబర్ టు స్థానంలో కొనసాగినా, అధిష్టానానికి నమ్మకస్తుడిగా, పార్టీకి పూర్తి విధేయుతతో పనిచేయడం అశోక్ గజపతి రాజు నైజం. అంతేకాకుండా వేల కోట్ల ఆస్తులను ప్రజలకు దానం చేసి రాజవంశీయుడిగా అశోక్ కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అవినీతి మరక అంటని ఏకైక నాయకుడిగా అశోక్ స్థానం సుస్థిరమంటారు. అదేసమయంలో 2014-18 మధ్య కేంద్ర పౌర విమానయాన మంత్రిగా పనిచేసి ప్రధాని మోదీ వద్ద మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రాజ్యాంగంపై లోతైన అవగాహన, నిబద్ధత, నిజాయితీ వంటి అదనపు అర్హతలతో అశోక్ ను ప్రధాని మోదీ గౌరవిస్తారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ నుంచి అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. %ూశ్రీంశీ =ముం% - అవంతికి రూట్ క్లియర్ కావడం

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2
హైదరాబాద్
సోమవారం
21 । ఏప్రిల్ । 2025



# తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు .. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ రాష్ట్రం లో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదివారం ఉమ్మడి వరంగల్ ఖమ్మం, నల్లగొండ జిల్లాలతోపాటు సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి.పొద్దంతా తీవ్రమైన ఎండలు దంచికొడుతున్నాయి. సాయంత్రానికి వానలు పడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40-44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. సాయంత్రం వానలు కురుస్తుండటంతో వాతావరణం కాస్త చల్లబడుతోంది. ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 43.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో 43.4, సిరిసిల్ల జిల్లా కోనరావుపేట, ఇల్లంతకుంట, నిజామాబాద్ జిల్లాలో 42.3 డిగ్రీలు నమోదైంది.జనగామ జిల్లా నర్మెట మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆగపేట, గండిరామవరం, వెల్దండ, అమ్మాపురం, మచ్చుపహడ్, హన్మంతాపూర్, బొమ్మకూరు తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. విద్యుత్తు తీగలు, స్తంభాలపై చెట్లు విరిగిపడి కొన్నిచోట్ల కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చాలాచోట్ల కోతకు వచ్చిన వరిపంట నేలవాలి ధాన్యం రాలిపోయింది.వెల్దండలోని ఓ కొనుగోలు కేంద్రంలో క్వింటాళ్ల కొద్ది ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వానలు పడుతున్నాయి.




## వీకెండ్ ఎఫెక్ట్.. యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు, దర్శనానికి ఎంత సమయమంటే..?



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో ఉదయం నుంచే భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అధిక రద్దీ కారణంగా ఉచిత దర్శనానికి దాదాపు 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి గంటకు పైగా సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేసవి వేడిని తట్టుకునేందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.

ఇక ఇటీవల ఎండోమెంట్స్ సవరణ బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లు యాదగిరిగుట్ట ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం చేసింది. ప్రతిపాదిత యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డులో చైర్మన్‌తో సహా 18 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఎస్సీ, బీసీ వర్గాల ప్రతినిధులు, ఒక మహిళా ప్రతినిధి మరియు ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ ఉంటారు. ఒక ఐఏఎస్ అధికారిని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తారు. బోర్డు సభ్యుల పదవీ కాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. స్వయంప్రతిపత్తి కలిగిన టీటీడీ బోర్డు మాదిరిగా కాకుండా, యాదగిరిగుట్ట బోర్డు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుంది. బోర్డుకు అవసరమైన బడ్జెట్‌ను కూడా ప్రభుత్వమే కేటాయిస్తుంది.పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని యాదగిరిగుట్ట ఆలయ నిర్వహణ, పరిపాలన, అభివృద్ధిని సమర్థవంతంగా చూసుకోవడం ఈ బోర్డు ఏర్పాటు యొక్క ప్రధాన లక్ష్యం. ఆలయం పరిధిలోని విద్యా సంస్థలు, వేద పాఠశాలలు, గోశాల నిర్వహణను కూడా ఈ బోర్డు పర్యవేక్షిస్తుంది. యాదగిరిగుట్ట ఆలయం చుట్టూ ఉన్న 1,241 ఎకరాలను మూడు మున్సిపాలిటీలు, ఆరు గ్రామాలను కలుపుకొని "టెంపుల్ సిటీ"గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. వైటీడీ బోర్డు ఆధ్వర్యంలో వేద విద్యా సంస్థలను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

## 20 దేశాలకు నల్గొండ తాటిముంజలు.. యువకుడి బిజినెస్ ఐడియా అదుర్స్..!



**నల్గొండ-నవభూమి:**వేసవి రాగానే తాటి ముంజల రుచి చూడాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. లేతగా, తియ్యగా ఉండే వీటిని 'ఐస్ ఆపిల్' అని కూడా అంటారు. ఇది శరీరానికి చల్లదనాన్నివ్వడమే కాకుండా, ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఈ ప్రత్యేకమైన రుచిని విదేశీయులు కూడా అమితంగా ఇష్టపడుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ముువ్వా రమేశ్ అనే పారిశ్రామికవేత్త ఈ డిమాండ్‌ను ఒక వ్యాపార అవకాశంగా మార్చుకున్నారు.

వేసవి కాలం వచ్చిందంటే చాలు.. తాటి ముంజలపై మనసు లాగేస్తుంది. వాటిని చూడగానే తినాలని అనిపించకుండా ఉండదు. వాటి లేతదనం, తియ్యటి రుచి, శరీరానికి చల్లదనాన్నిచ్చే గుణంతో చాలా మంది వాటిని ఇష్టంగా తింటుంటారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి ఇవి ఒక అద్భుతమైన ఔషదంగా పని చేస్తాయి. ఇంగ్లిష్‌లో 'ఐస్ ఆపిల్'గా పిలిచే వీటిని విదేశీయులు సైతం లొట్టలేస్తూ ఆరగిస్తున్నారు. దీన్నే వ్యాపార అవకాశంగా మలుచుకున్నాడు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ముువ్వా రమేశ్ అనే పారిశ్రామికవేత్త. తాటి ముంజలకు విదేశాలకు ఎగుమతి చేస్తూ ఆదాయాన్ని గడిస్తున్నాడు.గుడిమాల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్కులోని తేజస్ ఫుడ్ ఇండస్ట్రీస్ ద్వారా 'శ్వేత తెలుగు ఫుడ్స్' పేరుతో ఆయన అమెరికా, రష్యా, మలేసియా, ఆస్ట్రేలియాతో పాటు ఐరోపాలోని పలు దేశాలకు తాటి ముంజలను ఎగుమతి చేస్తున్నారు. ఆయన ప్రతి రెండు రోజులకోసారి 100 నుంచి 300 గ్రాముల ప్యాకెట్లలో దాదాపు 1,500 కిలోల ముంజలను 20 విదేశాలకు సరఫరా చేస్తున్నారు. మునుగోడు, దండుమల్కాపురం ప్రాంతాలలోని గీత కార్మికుల నుండి సేకరించిన తాటి ముంజలను అత్యాధునిక పద్ధతిలో ప్యాకింగ్ చేసి విదేశాలకు పంపిస్తున్నారు. ఈ విధంగా దాదాపు 350 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు.తాటి ముంజలు కేవలం రుచికరమైనవే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు. వేసవిలో వీటిని తీసుకోవడం చాలా మంచిదని అంటున్నారు. తాటి ముంజల్లో విటమిన్లు (ముఖ్యంగా బి కాంప్లెక్స్), ఖనిజాలు (పొటాషియం, సోడియం, కాల్షియం, ఫాస్పరస్), కొద్ది మొత్తంలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు ఉంటాయన్నారు. శరీరాన్ని డీహైడ్రేషన్ నుండి కాపాడుతాయని.. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయని అంటున్నారు. మలబద్ధకం నివారణకు సహాయపడతాయని.. శరీరానికి చలువ చేస్తాయన్నారు. కాలేయానికి మంచిదని.. రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయని అంటున్నారు. తాటి ముంజల పైనున్న పీచు లాంటి పొరను తీసివేసి లోపలి తెల్లని గుజ్జును నేరుగా తినవచ్చునని చెబుతున్నారు. ఇవి సాధారణంగా మార్చి నుంచి జూన్ వరకు వేసవి కాలంలో మాత్రమే ఎక్కువగా లభిస్తాయని తప్పకుండా తినాలని అంటున్నారు.

# ఈ చిన్నారులకు బడికి సెలవంటేనే భయం..
## కారణం ఇదే, కన్నీరు పెట్టించే దీనగాథ..!



**మెదక్-నవభూమి:**బడి పిల్లలు స్కూలుకు సెలవులు అంటే ఎంగిరిగంతేస్తారు. హమ్మయ్య అనుకుంటూ ఆటల్లో మునిగిపోతారు. కానీ ఆ ముగ్గురు చిన్నారుల పరిస్థితి వేరు. బడికి సెలవులు వస్తే ఆ చిన్నారులకు అంతులేని భయం. ఎటు వెళ్లాలో తెలియక తల్లడిల్లి పోతారు. తండ్రిని కోల్పోయి, తల్లి కూడా దూరమైన ఆ చిన్నారులు నిలువ నీడ లేకుండా కన్నీళ్లతో కాలం వెళ్లదీస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామంలోని దళితవాడకు చెందిన చిన్నారులు లావణ్య, అనురాధ, నవీన్‌ల జీవితం దుర్భరంగా మారింది. వీరి తల్లి సంపూర్ణ ఏడేళ్ల క్రితం ఇంటిని వదిలి వెళ్ళగా.. తండ్రి రవి గత ఏడాది బతుకమ్మ పండుగ రోజున కాళ్లకల్ వద్ద ప్రమాదవశాత్తు చనిపోయాడు. దీంతో హైదరాబాద్ నగరంలో నాలుగిళ్లలో పాచి పని చేసి జీవనం సాగించే మేనత్త లక్ష్మి వీరిని చేరదీసి ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించింది.

లావణ్య టేక్మాల్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి, అనురాధ అదే పాఠశాలలో 7వ తరగతి, నవీన్ కొత్తపల్లి బీసీ హాస్టల్‌లో 3వ తరగతి చదువుతున్నారు. సెలవుల్లో మేనత్త లక్ష్మి హైదరాబాద్ నుంచి వస్తేనే వీరు ఇంటికి వెళతారు. లేదంటే చిన్నారుల పరిస్తితి దారుణం. స్వగ్రామంలో ఇల్లు కూడా లేకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి. ఈ ఏడాదితో లావణ్య చదువు ముగియనుండగా.. 9వ తరగతి ఎక్కడ చదవాలో తెలియక ఆందోళన చెందుతోంది. లావణ్య టీచర్ కావాలని, అనురాధ నర్స్ కావాలని, నవీన్ పోలీస్ కావాలని కలలు కంటున్నారు. ఎవరైనా సాయం చేస్తే చదువుకొని తమ లక్ష్యాలను సాధిస్తామని ఆశిస్తున్నారు.కాగా, చిన్నారుల హృదయ విదారకమైన ఈ పరిస్థితి నిజంగా చాలా బాధాకరమని పలువురు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రభుత్వ లేదా స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని కోరుతున్నారు. చదువుకునే వయస్సులో ఉన్నందున వారి విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని.. ఇలాంటి విషాదకరమైన పరిస్థితుల్లో సమాజం కూడా స్పందించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. మానవత్వం దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించడానికి ముందుకు రావాలని.. ఆ చిన్నారులకు ఒక మంచి భవిష్యత్తును అందించడానికి చేయూత ఇవ్వాలని పోస్టులు పెడుతున్నారు.

# రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్.. వారికి పెన్షన్ పునరుద్ధరణ?



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో పెన్షన్ రద్దయిన వారికి రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో గత ఐదేళ్లలో 2.24లక్షల మంది పెన్షన్‌దారులు సొంతూళ్ల నుంచి వలస వెళ్లినట్లు సెర్ప్ గుర్తించింది. ప్రస్తుతం వరుసగా 3 నెలలు పింఛన్ తీసుకోకపోతే అధికారులు జాబితా నుంచి వారి పేరు తొలగిస్తున్నారు. అలాంటి వారు సొంతూరుకు తిరిగి వస్తే వారి పెన్షన్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది. ఆ తర్వాత పెన్షన్ రద్దయిన వారందరికీ తిరిగి పెన్షన్ ఇవ్వనున్నారు.

ఒకాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పేరుతో పెన్షన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పేరుతో పెన్షన్లు ఇస్తోంది. 2025 తాజాగా లెక్కల ప్రకారం.. తెలంగాణలో పెన్షన్ పథకాల ద్వారా సుమారు 42.7 లక్షల మంది లబ్ధిదారులు నెలవారీ పెన్షన్ అందుకుంటున్నారు . వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులు, చేతి వృత్తుల్లో ఉన్నవారికి నెలవారీ ఆర్థిక సహాయం అందిస్తోంది. వృద్ధులతో పాటు ఇతరులకు నెలకు రూ.2,016, వికలాంగులకు నెలకు రూ.4,016 చొప్పున పెన్షన్ అందిస్తున్నారు.తాము అధికారంలోకి వస్తే చేయూత పథకం కింద లబ్ధిదారులకు నెలవారీగా రూ. 4,000 దివ్యాంగులకు రూ. 6,000 వరకు పెన్షన్ అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకం పెంపు కోసం లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తాజాగా వలస వెళ్లినవారి పెన్షన్ పునరుద్ధరణ, పెన్షన్ పెంపుదల వంటి చర్యలు లబ్ధిదారులకు ఆర్థిక భరోసాను కల్పించనున్నాయి.

# అక్రమ కాస్మెటిక్ సర్జరీతో మహిళ మృతి

**(1వపేజీ తరువాయి)**ప్రాక్టీస్ చేయడానికి ఎలాంటి అనుమతి లేదని అధికారులు తెలిపారు. సర్జరీ సమయంలో ఫెలిపే, మరియాకు సిరంజి ద్వారా లిడోకైన్ అనే మందును ఇచ్చాడు. కొద్దిసేపటికే ఆమె గుండె పనిచేయడం ఆగిపోయింది.

వెంటనే మరియాను హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సుమారు రెండున్నర గంటల పాటు ఆమెను బతికించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ, ఆమె మెదడు పనిచేయడం పూర్తిగా నిలిచిపోయిందని (బ్రెయిన్ డెడ్) వైద్యులు నిర్ధారించారు. ఏప్రిల్ 11వ తేదీన కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమెకు అమర్చిన లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌ను తొలగించడంతో మరియా మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. "ఒక స్నేహితురాలు అతని దగ్గర సర్జరీ చేయించుకుని అంతా బాగానే ఉందని చెప్పడంతోనే మరియా అక్కడికి వెళ్లింది. చివరికి ఇలా జరుగుతుందని మేమెవరూ ఊహించలేదు" అని మరియా సోదరి లిస్సీ పెనలోజా కబ్రేరా కన్నీటిపర్యంతమయ్యారు.

మరోవైపు, ఘటన జరిగిన మార్చి 28వ తేదీనే నిందితుడు ఫెలిపే హుయోస్-ఫొరోండా దేశం విడిచి కొలంబియా పారిపోయేందుకు ప్రయత్నించాడు. అయితే, జాన్ ఎఫ్ కెన్నడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అతడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతని కారు లైసెన్స్ ప్లేట్ నంబర్ ఆధారంగా పోలీసులు అతన్ని గుర్తించి పట్టుకున్నారు. ప్రస్తుతం అతనిపై సెకండ్-డిగ్రీ దాడి, అనుమతి లేకుండా వృత్తిని నిర్వహించడం వంటి అభియోగాలను నమోదు చేశారు. కేసులో పరిస్థితులు మారినందున, అభియోగాలను పునఃపరిశీలిస్తామని క్వీన్స్ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రాసిక్యూటర్ల ప్రాథమిక అంచనా ప్రకారం, లిడోకైన్‌ను అధిక మోతాదులో లేదా తప్పుగా ఇవ్వడం వల్లే మరియా మరణించి ఉండవచ్చు. లిడోకైన్ సాధారణంగా సురక్షితమైన మందే అయినా, సరైన పద్ధతిలో, వైద్యుల పర్యవేక్షణలో వాడాలి. మోతాదు మించినా లేదా తప్పుగా ఇంజెక్ట్ చేసినా ప్రాణాంతకం కాగలదు. నిందితుడు హుయోస్-ఫొరోండా క్వీన్స్‌లోని తన ఇంట్లోనే అక్రమంగా లిపోసక్షన్ వంటి కాస్మెటిక్ సర్జరీలు చేసేవాడని, టిక్‌టాక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా బొటాక్స్ వంటి చికిత్సల గురించి ప్రచారం చేసుకునేవాడని తెలిసింది.

## మెగా డీఎస్సీ వచ్చేసింది..!

**(1వపేజీ తరువాయి)**జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లోని మొత్తం ఖాళీలు.. 1478 భర్తీ చేయనున్నారు. వీటిల్లో.. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ, వ్యాయామ) 1,473 పోస్టులుండగా, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలల్లో మరో ఐదు పోస్టులు (మ్యాథ్స్ 1, ఫిజిక్స్ 1, బయాలజీ 1, ఎస్జీటీ 2) ఉన్నాయి.

షెడ్యూల్ ఇలా..: ఆదివారం నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ, ఫీజు చెల్లింపు ఉంటుంది. మే 20 నుంచి ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులో ఉంటుంది. మే 30వ తేదీనుంచి ఆన్‌లైన్‌లో డీఎస్సీ అభ్యర్థులు పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి పరీక్ష అనంతరం రెండ్రోజుల్లో 'కీ'ని విడుదల చేస్తారు. ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుదలవుతుంది. ఆ తర్వాత ఏడు రోజులకు డీఎస్సీ మెరిట్ (మార్క్ మెమో)విడుదల చేయనున్నారు.

రోస్టర్ వారీగా పోస్టుల వివరాలిలా..

| కేటగిరీ | ప్రభుత్వ, స్థానిక యాజమాన్యం | మున్సిపల్ | మున్సిపల్ కార్పొరేషన్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఓసీ | 511 | 26 | 41 | 578 |
| బీసీ-ఏ | 94 | 6 | 11 | 111 |
| బీసీ-బీ | 127 | 5 | 7 | 139 |
| బీసీ-సీ | 18 | 1 | 0 | 19 |
| బీసీ-డీ | 91 | 5 | 6 | 102 |
| బీసీ-ఈ | 48 | 2 | 3 | 53 |
| ఎస్సీ-గ్రేడ్ 1 | 16 | 1 | 4 | 21 |
| ఎస్సీ-గ్రేడ్ 2 | 84 | 4 | 6 | 94 |
| ఎస్సీ-గ్రేడ్ 3 | 102 | 4 | 6 | 112 |
| ఎస్టీ | 85 | 5 | 5 | 95 |
| ఈడబ్ల్యూఎస్ | 125 | 5 | 8 | 138 |
| పీహెచ్-విజువల్ | 1 | 0 | 0 | 1 |
| పీహెచ్-హియర్ | 10 | 0 | 0 | 10 |
| ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) | 5 | 0 | 0 | 5 |
| | 1317 | 64 | 97 | 1478 |

## 40 ఏళ్లలో టీడీపీకి ఒక్కసారే చాన్స్!

**(1వపేజీ తరువాయి)**మేయర్ కానున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ విశాఖ రాజకీయం ఆసక్తి రేపుతోంది. మేయర్ హరివెంకట కుమారిపై అవిశ్వాసం నెగ్గడంతో త్వరలో టీడీపీ నేత మేయర్ కానున్నారు. నాలుగు దశాబ్దాల విశాఖ కార్పొరేషన్‌లో టీడీపీకి ఎప్పుడూ నిరాశే ఎదురవుతోంది. దాదాపు 40 ఏళ్ల తర్వాత గ్రేటర్ మేయర్‌గా సీనియర్ నేత పీలా శ్రీనివాసరావు ఎన్నికకానున్నారని అంటున్నారు. టీడీపీకి పెట్టని కోటగా చెప్పే విశాఖలో మేయర్ పీఠం మాత్రం ఆ పార్టీకి అందని ద్రాక్షగా మారడానికి కారణం ఏంటన్నది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. బ్రిటిష్ పాలన కాలంలోనే మున్సిపాలిటీగా ఆవిర్భవించిన విశాఖ.. 1979లో కార్పొరేషన్ గా ఏర్పాటు చేశారు. కానీ, కార్పొరేషన్ కు తొలి ఎన్నిక 1981లో జరిగింది. అప్పటికి టీడీపీ ఆవిర్భవించలేదు. ఆ ఎన్నికల్లో జనతా పార్టీ నేత ఎన్ఎస్ఎన్ రెడ్డి తొలి మేయర్ గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత టీడీపీ ఆవిర్భావించిన నాలుగేళ్ల తర్వాత కార్పొరేషన్ కు ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో టీడీపీ నేత డీవీ సుబ్బారావు మేయర్ గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇప్పటివరకు విశాఖ పీఠం టీడీపీకి అందని ద్రాక్షగానే ఊరిస్తూ వస్తోంది. విశాఖ నగరంలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలను 2019లో గెలిచిన టీడీపీ.. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో మాత్రం గెలవలేకపోయింది. ఇక అంతకుముందు కూడా మూడు సార్లు కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే ఆ మూడు సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. 1995, 2000 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నా, విశాఖ పీఠం మాత్రం దక్కించుకోలేకపోయింది. దీంతో ప్రస్తుతం మేయర్ గా పదవీబాధ్యతలు స్వీకరించడానికి టీడీపీ ఉవ్విళ్లూరుతోంది. విశాఖ నగరంపై టీడీపీది ప్రత్యేక ముద్ర. రాష్ట్రంలో ఏకపక్షంగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రత్యర్థులు గెలిచినా, విశాఖ వాసులు మాత్రం పసుపు జెండాను వదల్లేదు. దీనికి 2019 ఎన్నికలే నిదర్శనం. ఆ ఎన్నికల్లో జగన్ హవాను తట్టుకుని విశాఖ నగరంలో నాలుగు సీట్లు దక్కించుకోవడం ఓ రికార్డు. అయితే నగరంలో ఎంత పట్టున్నా, కార్పొరేషనులో ఇన్నాళ్లు పైచేయి సాధించలేకపోయిన టీడీపీకి.. ఇప్పుడు ఆ వెలితి తీరే అవకాశం ఏర్పడింది. మరో ఏడాది జరిగే స్థానిక ఎన్నికల్లో ఫలితం ఎలా ఉంటుందో కానీ, ప్రస్తుతం టీడీపీ కార్పొరేటర్లు, వైసీపీ నుంచి వచ్చిన నేతలతో కార్పొరేషన్ లో పూర్తి ఆధిక్యత కనబరుస్తోంది. దీంతో కూటమి పెద్దలు ఎవరిని డిసైడ్ చేస్తే వారే మేయర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విజయం ద్వారా నాలుగు దశాబ్దాల గెలుపు దాహం తీర్చుకోబోతున్నామని టీడీపీ నేతలు చెబుతున్నారు.

## విభేదాలకు స్వస్తి పలకండి

**(1వపేజీ తరువాయి)**ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగను సామూహికంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. కాగా, ఈ సంవత్సరం విజయదశమి నుంచి ప్రారంభమయ్యే ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సన్నాహాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ భగవత్ శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాల సందర్శన పూర్తయ్యాయి. ఇందులో బ్రజ్ ప్రాంతంలోని ఆర్ఎస్ఎస్ ప్రచారకులతో ఆయన క్రమం తప్పకుండా సమావేశాలు కూడా ఉన్నాయి. సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో జరగబోయే కార్యక్రమాల రూపురేఖలపైనా ఆయన చర్చించారు. మోహన్ భగవత్ ప్రస్తుతం అలీఘర్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా, ఆయన వివిధ శాఖలలోని స్వచ్ఛంద సేవకులను ఉద్దేశించి ప్రసంగించారు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్.

## కిటాక్యూషు స్ఫూర్తితో క్లీన్ అండ్ గ్రీన్

**(1వపేజీ తరువాయి)**ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకుంటుంది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అధికారులతో కూడిన బృందం కిటాక్యూషు సిటీ మేయర్ కజుహిసా టకేయుచితో సమావేశమైంది. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర మోడల్స్, నదుల పునరుజ్జీవన విధానాలపై చర్చలు జరిపారు. "తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు, 2 కంపెనీలతో డీల్" ఈ సందర్భంగా ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్పీ , నిప్పాన్ స్టీల్ ఇంజినీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ పై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యూషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ప్రపంచంలోని క్లీన్ సిటీలలో ఒకటి ఒకప్పుడు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ కిటాక్యూషు నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ కజుహిసా టెక్యూచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు.

## టీజీఎస్ఆర్టీసీలో 3వేలకుపైగా ఉద్యోగాలు

**(1వపేజీ తరువాయి)** 743 శ్రామిక్ పోస్టులు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) పోస్టులు, 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్) పోస్టులు, 25 డిపో మేనేజర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టులు, 18 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్) పోస్టులు, 11 సెక్షన్ ఆఫీసర్ ( సివిల్) పోస్టులు, 6 అకౌంట్ ఆఫీసర్స్ పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్స్ జనరల్ పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ పోస్టులు ఉన్నాయని వివరించారు. ఈ పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయనున్నట్లు మంత్రి పొన్నం పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వంలో దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లను క్యాలెండర్ ప్రకారం విడుదల చేయనున్నామని తెలిపారు. ఈ అవకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

**(1వపేజీ తరువాయి)**ఇందులో భాగంగానే అమరవీరుల సంస్మరణ దినోత్సవం రోజున అమరుల కుటుంబాలకు ట్రైకార్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను అందించామని తెలిపారు. ఇంద్రవెల్లిలో రూ.కోటితో స్మృతివనం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇంద్రవెల్లి పోరాటంలో 15 మంది అమరులయ్యారని ఆనాటి ప్రభుత్వాలు నిర్ధారించాయని, వాస్తవంగా ఆ సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. వారి వివరాలను ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో గుర్తించి, ఆ కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## మెగా డీఎస్సీ వచ్చేసింది..!

**(1వపేజీ తరువాయి)**పోలీసు వ్యవహారశైలిపై క్రైస్తవ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతూనే వచ్చాయి. అయితే పది రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు ఎలాంటి క్లూ లభించకపోవడంతో దీన్ని రోడ్డు ప్రమాదంగానే నిర్ధారిస్తూ ప్రకటన చేశారు. దీంతో దర్యాప్తు ముగిసింది. 3 లక్షల మందికి లబ్ధి!" అయితే పోలీసుల వ్యవహారశైలితో పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు మాత్రం అలాగే ఉండిపోయాయి. దీంతో క్రైస్తవ వర్గాల నుంచి తిరిగి దర్యాప్తు చేయించాలనే ఒత్తిడి ప్రభుత్వంపై పెరుగుతోంది. దీన్ని మరింత పెంచేలా హైకోర్టులో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ తో పాటు పలువురు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో అన్న టెన్షన్ నెలకొంది. తనకు ఎన్నో పోస్టు మార్టం రిపోర్టులు చూసిన అనుభవం ఉందని, మద్యం సేవించడం వల్లే పాస్టర్ ప్రవీణ్ చనిపోయాడని పోస్టుమార్టంలో కావాలని రాసినట్లుందని లిబరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు. ప్రవీణ్ మృతిపై మాట్లాడిన వారిపై కేసులు నమోదు చేయడాన్ని బట్టి చూస్తే అనుమానాలు కలుగుతున్నాయని ఆయన వెల్లడించారు.కాంగ్రెస్ మాజీ ఎంపీ హర్షకుమార్ ను ఇదే కేసులో అరెస్టు చేయడాన్ని విజయకుమార్ ఖండించారు.

## అశోక గజపతికి గవర్నర్ పదవి?

**(1వపేజీ తరువాయి)**లేదా ? తన చిరకాల సహచరుడి రాజకీయ విరామానికి ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉండేలా రాజ్ భవన్ లో కూర్చోబెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని అంటున్నారు. దీంతో త్వరలో జరిగే గవర్నర్ల నియామకాల్లో అశోక్ గజపతి రాజు పేరు కచ్చితంగా ఉంటుందని చెబుతున్నారు. వచ్చే నెల తొలి వారంలో దేశంలో నాలుగైదు రాష్ట్రాలకు గవర్నర్లను నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ లిస్టులో అశోక్ పేరుంటుందని, ఆయనను పక్కనే ఉన్న తమిళనాడు గవర్నర్ గా నియమిస్తారని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా ఏపీకి చెందిన పలువురు నేతలు తమిళనాడు గవర్నరుగా పనిచేశారు. దీంతో అశోక్ గజపతికి రాజ్ భవన్ రూటు క్లియర్ అయిందని అంటున్నారు.



## మీ పెద్దబిడ్డ వద్దు, చిన్నబిడ్డనే పెళ్లి చేసుకుంటా..

**న్యూఢిల్లీ-నవభూమి:**అతడు పెళ్లిచూపులకు వెళ్లాడు. అమ్మాయిని నచ్చాడు. దాంతో పెళ్లికి ముహూర్తం కూడా పెట్టుకున్నారు. పెళ్లికి ముందు నిర్వహించే తిలకోత్సవ్ కూడా ఘనంగా జరుపుకున్నారు. కానీ తీరా పెళ్లి రేపనగా వరుడు బాంబు పేల్చాడు. ఏకంగా వధువు తండ్రికి ఫోన్ చేసి 'నాకు మీ పెద్దమ్మాయి వద్దు, చిన్నమ్మాయిని పెళ్లి చేసుకుంటా' అని చెప్పాడు. దాంతో వధువు ఆత్మహత్యాయత్నం చేసింది. వధువు తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లా మన్‌గవా ఠాణా పరిధిలో.. స్థానిక యువతికి పెళ్లి నిశ్చయమైంది. ఈనెల 18న వివాహం జరిగేలా పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు.



పెళ్లి తంతులో భాగంగా 16న వధువుకు బొట్టుపెట్టే 'తిలకోత్సవ్' కార్యక్రమం కూడా ఘనంగా జరిగింది. పెళ్లికి సరిగ్గా ఒకరోజు ముందు అంటే ఏప్రిల్ 17న వధువు తండ్రికి వరుడు ఫోన్ చేశాడు. 'మీ పెద్దమ్మాయి వద్దు.. చిన్నకుమార్తెను పెళ్లాడతా' అని బాంబు పేల్చాడు. దాంతో వధువు తండ్రి బిత్తరపోయాడు.తండ్రి ద్వారా విషయం తెలుసుకున్న వధువు ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే ప్రాణాపాయం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఆమె రేవాలోని సంజయ్‌గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా వధువుకు ఇదివరకే వివాహమై విడాకులు తీసుకుంది. అంతా తెలిసే వరుడు ఆమెను పెళ్లి చేసుకునేందుకు అంగీకరించాడు. తీరా పెళ్లి రేపనగా వరుడు చేసిన పనితో తీవ్ర మనస్తాపానికి గురైంది. అందుకే ఆత్మహత్యాయత్నం చేసింది. వ్యవహారం పోలీసుల దాకా వెళ్లింది.

## విమానాన్ని ఢీకొట్టిన టెంపో ట్రావెలర్.. ఆ తర్వాత ఏం జరిగిందంటే?



**బెంగళూరు - నవభూమి:** బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆగిఉన్న ఇండిగో విమానాన్ని ట్రావెలర్ టెంపో ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో టెంపోలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడని, ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదని అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన టెంపోను ఆకాశ ఎయిర్ సిబ్బందిని వారి కార్యాలయం నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ బే వద్దకు తీసుకురావడానికి వినియోగిస్తున్నారని తెలిపారు.డ్రైవర్ నిద్రమత్తులో ఉన్న కారణంగా ప్రమాదం జరిగిందని, ఈ విషయం ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని అధికారులు చెప్పారు. ప్రమాదం వల్ల పలు విమాన సర్వీసుల్లో స్వల్ప అంతరాయం కలిగిందని, తర్వాత వాటిని పునరుద్ధరించామని అన్నారు. ఈ ఘటనపై ఇండిగో స్పందిస్తూ.. బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆగి ఉన్న విమానాన్ని టెంపో ఢీకొట్టడంపై తమకు సమాచారం అందిందని, ఈ విషయంపై జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు సమాచారం వెల్లడించామని తెలిపింది. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు తాము అధిక ప్రాధాన్యం ఇస్తామని, ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని చెప్పింది.

## నా ప్రేమ మీ చేతిలో ఉంది.. మీరు పాస్ చేయకపోతే అంతేసంగతి..

### పదో తరగతి విద్యార్థి పాట్లు



**బెంగళూరు - నవభూమి:** పరీక్షల్లో పాసయ్యేందుకు విద్యార్థులు నానా తంటాలు పడుతుంటారు. కొందరు శ్రద్ధగా చదివి ఉత్తీర్ణులవుతారు. మరికొందరు ఏమీ చదవకుండానే పరీక్ష హాల్‌కు వెళ్లి.. సినిమా స్టోరీలు, ప్రేమ కథలు, తోచిందేదో రాసి ఆన్సర్ షీట్లను నింపేస్తారు. బరువు చూసైనా పాస్ మార్కులు వేస్తారేమోనని!. ఇక మరికొందరైతే తమది ఖాళీ బుర్ర.. ఎలాగైనా ఈ గండం నుంచి బయట పడేయాలని, మీకు ఎప్పుడూ రుణపడి ఉంటానని పరీక్ష పేపర్లు దిద్దేవారిని వేడుకుంటారు. ఇంకొందరైతే ఆన్సర్ షీట్లలో డబ్బులు పెట్టి.. తమను పాస్ చేయాలని బతిమిలాడుతూ ఉంటారు. అయితే ఇక్కడ ఓ విద్యార్థి మాత్రం.. తన ప్రేమ భవితవ్యం మీ చేతిలోనే ఉంది.. పరీక్షలో పాస్ చేసి నా లవ్‌ను గెలిపించండి అంటూ పరీక్ష పేపర్‌లో రాసి బతిలాడుకున్నాడు. ఈ ఘటన కర్ణాటకలోని బెళగావి జిల్లా చిక్కోడిలో జరిగింది.

కర్ణాటకలో ఇటీవలే సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ అదేనండి పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఉపాధ్యాయులు పేపర్లు దిద్దుతున్నారు. ఈ క్రమంలో ఓ ఆన్సర్ షీట్ దిద్దుతుండగా.. రూ.500 నోటు కనిపించింది. అందులో దయచేసి నన్ను పాస్ చేయండి. నా ప్రేమ ఇప్పుడు మీ చేతుల్లో ఉంది. నేను పరీక్షలో పాస్ అయితేనే.. ప్రేమలో కూడా పాస్ అవుతాను. మీరు నన్ను పాస్ చేస్తే డబ్బులు ఇస్తాను. నన్ను పాస్ చేయకపోతే.. మా అమ్మానాన్న నన్ను కాలేజీకి పంపించరు అని విద్యార్థి అని రాసుకొచ్చాడు. అది చూసిన టీచర్ ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై స్పందిస్తున్న నెటిజన్లు ' పిల్లాడికి ఎంత కష్టం వచ్చింది'..' పాస్ చేసేయండి సార్.. పాస్ చేసేయండి'.. ' ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఆ విద్యార్థితో పాటు చాలా మంది కూడా ఆన్సర్ షీటులో డబ్బులు పెట్టి.. పాస్ చేయమంటూ బతిమలాడటం గమనార్హం.

## విమానాన్ని మించిన వేగంగా చైనా సరికొత్త మాగ్లేవ్ రైలు

**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ రవాణా రంగంలో చైనా మరోసారి తన సాంకేతిక శక్తిని చాటుతోంది. కమర్షియల్ ప్యాసింజర్ విమానాల వేగాన్ని సైతం మించిపోయే అత్యాధునికమైన "తేలియాడే" రైలును అభివృద్ధి చేస్తోంది. చైనా రైల్వే సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా, మాగ్నెటిక్ లెవిటేషన్ (మాగ్లేవ్) సాంకేతికతతో గంటకు 1000 కిలోమీటర్ల అద్భుతమైన వేగంతో ప్రయాణించే రైలు త్వరలో అందుబాటులోకి రానుంది. ఇది ప్రస్తుతం చైనాలో ఉన్న అత్యంత వేగవంతమైన రైళ్ల గరిష్ట వేగం కంటే ఎన్నో రెట్లు అధికం. అంతేకాదు లాంగ్-హాల్ ప్యాసింజర్ విమానాల సగటు ప్రయాణ వేగం కంటే కూడా ఈ రైలు వేగంగా దూసుకుపోనుంది.మాగ్లేవ్ టెక్నాలజీ అద్భుతం ఈ అత్యాధునిక మాగ్లేవ్ వ్యవస్థలో రైలులోని సూపర్ కండక్టింగ్ అయస్కాంతాలు ఒక ప్రత్యేకమైన ట్యూబ్ లోపలి గోడలపై ఉండే లోహంతో శక్తివంతంగా ఈ పరస్పర చర్య ఫలితంగా రైలు ట్రాక్ నుండి పైకి లేస్తుంది, ఒక గాలి దిండు వంటిది ఏర్పడుతుంది. దీనితో రైలు ఎటువంటి ఘర్షణ లేకుండా అత్యంత వేగంగా ప్రయాణిస్తుంది. ఈ ఘర్షణ లేని డిజైన్ కేవలం వేగాన్ని పెంచడమే కాకుండా శక్తి సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. ప్రస్తుతం ఉన్న 11.5 మైళ్ల మాగ్లేవ్ ఎక్స్‌ప్రెస్ లైన్ S ₹2 నుండి ఈ కొత్త హై-స్పీడ్ లైన్ విస్తరించనుంది. ఈ లైన్ చాంగ్ షాలోని హునాన్ ప్రావిన్స్ రాజధానిలోని విమానాశ్రయం సమీపంలోని చాంగ్‌షా నాన్ స్టేషన్‌ను కలుపుతుంది. ఇప్పటికే షాంఘైలో విమానాశ్రయం నుండి నగర కేంద్రాన్ని కేవలం ఏడు నిమిషాల్లో చేర్చే మాగ్లేవ్ రైలును చైనా విజయవంతంగా నడుపుతోంది. ఇది అధునాతన రైలు సాంకేతిక పరిజ్ఞానంలో దేశం యొక్క తిరుగులేని ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తోంది. అతుకులు లేని కనెక్టివిటీ: ప్రయాణికులకు నిరంతరాయ సేవలు ఈ రైలులో ప్రయాణించేటప్పుడు విశ్వసనీయమైన ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించడానికి పరిశోధకులు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. రైలు సొరంగం యొక్క లోపలి గోడల వెంట రెండు సమాంతర కేబుళ్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఈ కేబుళ్లు వేగవంతమైన మార్పుల వల్ల వచ్చే ఫ్రీక్వెన్సీ షిఫ్ట్‌లకు అనుగుణంగా రూపొందించబడిన విద్యుదయస్కాంత సంకేతాలను విడుదల చేస్తాయి. దీని ద్వారా ప్రయాణికులకు కనీస అంతరాయంతో నిరంతరాయంగా ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంటాయి. 3 నెలల్లో రెండోసారి వీధుల్లోకి ప్రజలు - స్మార్ట్, గ్రీన్ రవాణాకు చైనా బాట చైనా రైల్వే కేవలం వేగవంతమైన రైళ్లను నిర్మించడంపైనే దృష్టి సారించలేదని.. అవి మరింత స్మార్ట్, పర్యావరణ అనుకూలమైనవి. శక్తి-సమర్థవంతమైనవిగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుతో, హై-స్పీడ్ రైలు ప్రయాణంలో ఒక నూతన ప్రపంచ ప్రమాణాన్ని నెలకొల్పాలని.. భవిష్యత్తు రవాణా వ్యవస్థను పూర్తిగా మార్చివేయాలని చైనా దృఢంగా సంకల్పించింది.

# వధువు స్థానంలో పెళ్లిపీటలపై అమ్మాయి తల్లి



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇటీవల ఓ మహిళ.. తనకు కాబోయే అల్లుడితో ఇంటి నుంచి పరారైన ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అయితే, తాజాగా, వధువుకు బదులుగా అమ్మాయి తల్లి పెళ్లిపీటలపై కూర్చున్న ఘటన జరిగింది. పెళ్లికి కొన్ని సెకెన్ల ముందు ఆమెను చూసి వరుడు షాకయ్యాడు. విస్మయానికి గురిచేసే ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లోని మీరట్‌లో చోటుచేసుకుంది. బ్రహ్మపురికి చెందిన మొహమ్మద్ అజీం (22) అనే యువకుడికి.. షామిలీ జిల్లా ఫజల్‌పూర్- కంకర్‌ఖేరాకు చెందిన మంతాషా (21) అనే యువతితో పెళ్లి కుదిరింది. దీంతో ఏప్రిల్ 17న నిఖా జరిపించడానికి ఇరు కుటుంబాలు నిర్ణయించాయి. ఈ పెళ్లికి పెద్దలుగా అజీం అన్నా వదినలు వ్యవహరించారు. ఈ క్రమంలో గురువారం రోజున కంకర్‌ఖేరాకు అజీం తన కుటుంబంతో కలిసి చేరుకున్నాడు. పీటలపై కూర్చున్న వధువు పేరు 'తాహిరా' అని పెళ్లి జరిపిస్తోన్న మౌల్వీ పలకడంతో వరుడికి అనుమానం వచ్చింది. ఆమె ముసుగు తొలగించి చూడగా.. యువతికి బదులుగా ఆమె తల్లి వధువుగా కూర్చుంది.

భర్త చనిపోయిన ఆమె (45)ను వధువు స్థానంలో చూసి అతడు షాకయ్యాడు. పెద్దలుగా వ్యవహరించిన అన్నావదినలు ఆ కుటుంబంతో కుమ్మక్కయ్యారని ఆలస్యంగా గుర్తించాడు. గొడవ చేస్తే అత్యాచారం చేసినట్టు తప్పుడు కేసులో ఇరికిస్తామని వారిద్దరూ అజీంను బెదిరించారు. దీంతో తాను పూర్తిగా మోసపోయానని గ్రహించిన యువకుడు.. వెంటనే తన స్వగ్రామానికి వచ్చేశాడు. అనంతరం అతడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ పెళ్లి కోసం తాను రూ.5 లక్షలు ఖర్చు చేసినట్టు అజీం ఆరోపించాడు.

మార్చి 31న తన అన్న నదీమ్, వదిన షైదా తనకు పెళ్లి కుదిరిందని చెప్పారని ఫిర్యాదులు తెలిపాడు. షైదా మేనకోడలు మంతాషా వధువని నమ్మించారని వాపోయాడు. కానీ నిఖా సమయంలో మౌల్వీ వధువు పేరును తాహిరాగా ప్రకటించడంతో అనుమానం వచ్చి చూడటంతో అసలు విషయం తెలిసిందన్నాడు. మంతాషా స్థానంలో ఆమె తల్లి తాహిరా వధువుగా కూర్చుందని పోలీసులకు వివరించాడు.

**9 రోజుల్లో పెళ్లి.. కాబోయే అల్లుడితో అత్త పరారీ**

పెళ్లికి అంగీకరించకుంటే అత్యాచార కేసు పెట్టిస్తామంటూ అన్నావదినలు బెదిరించారని చెప్పాడు. మోసపోయిన తాను చట్టపరంగా ఇబ్బందులు ఎదురవుతాయన్న భయంతో ఒంటరిగా ఇంటికి చేరుకుని.. గురువారం మీరట్‌లోని కార్యాలయాన్ని సంప్రదించి ఫిర్యాదు చేశాడు.మీరట్ డాక్టర్ విపిన్ తాడా స్పందిస్తూ.. 'ఈ ఘటనపై మాకు ఫిర్యాదు అందింది. పూర్తి స్థాయి దర్యాప్తు చేయిస్తాం.. నిజాలు ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటాం'అని తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలో ఉందని పేర్కొన్నారు.

## కశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్‌తో ఆకస్మిక వరదలు



**జమ్మూ కశ్మీర్-నవభూమి:**జమ్మూ కశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్‌తో ఆకస్మికి వరదలు సంభవించాయి. ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడి జనజీవనం అస్తవ్యస్తమైంది. రాంబన్‌లో ఆకస్మిక వరదలకు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కొండచరి జయలు విరిగిపడటంతో శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిని మూసివేశారు. దీంతో వాహనాలు ఎక్కడవక్కడ నిలిచిపోయాయి. వరద నీటిలో పలు వాహనాలు మునిగిపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ప్రకృతి విపత్తుకు అత్యంత తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల్లో రాంబన్ ఒకటి. అనేక చెట్లు నేలకూలిపోయి... రవాణా వ్యవస్థ స్తంభించింది. విద్యుత్ సరఫరా కూడా అంతరాయం ఏర్పడింది.

గురువారం హఠాత్తుగా వచ్చిన గాలులు.. కురిసిన భారీవర్షానికి ఆకస్మిక వరదలు వచ్చినట్టు తెలుస్తోంది. ఉధంపూర్‌లోని సతేని పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ పురుషోత్తమ్ గుప్తా మాట్లాడుతూ.. 'మా పంచాయతీ పరిధిలో అనేక చెట్లు కూలిపోయాయి. రవాణా, విద్యుత్ వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 4-5 సంవత్సరాల తర్వాత ఇలాంటి గాలులు వీయడం ఇదే తొలిసారి' అని %ూచీ×%కి చెప్పారు.క్యుములోనింబస్ మేఘాలకు తోడు ద్రోణి ప్రభావంతో కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించినట్టు భారత వాతావరణ విభాగం పేర్కొంది. రాంబన్ జిల్లా ధరం కుంద్ గ్రామంలో సుమారు 40 ఇళ్లు దెబ్బతిన్నాయి. అక్కడ 100 మందికి పైగా ప్రజలను పోలీసులు రక్షించి, సురక్షిత ప్రాంతానికి తరలించారు.శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిలోని నష్రీ- బానీహాల్ మధ్య దాదాపు పదికిపైగా ప్రాంతాల్లో కొండచరియలు, మట్టిపెల్లలు విరిగిపడి రవాణా పూర్తిగా నిలిచిపోయింది. కొండచరియలు, మట్టిపెల్లలు విరిగిపడిన కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. వాతావరణం మెరుగయి.. రహదారి పూర్తిగా క్లియర్ అయ్యే వరకు ప్రయాణికులు ఈ మార్గంలో ప్రయాణించవద్దని సూచించారు.కాగా, పర్వత ప్రాంతాలు మిగతా ప్రాంతాల కంటే ఎత్తులో ఉంటాయి. ఇలాంటి ప్రదేశాలకు నీటిని మోసుకుపోయిన మేఘాలు.. సంతృప్త స్థాయికి చేరడం వల్ల వర్షించడానికి సిద్ధంగా ఉంటాయి. కానీ అక్కడి వేడి వాతావరణ పరిస్థితుల వల్ల వర్షించడం వాటికి సాధ్యం కాదు. దీంతో అక్కడ వర్షం కురవడానికి బదులు ముందు కదులుతాయి. ఈ క్రమంలో అక్కడ ఉన్న నీటి బిందువులు కూడా మేఘాల్లోకి చేరి.. మోయలేని స్థితికి మేఘాలు చేరుకున్నప్పుడే క్లౌడ్ బరస్ట్ వంటివి సంభవిస్తాయి.

### బ్లడీ షిలిలిలిషో.. ఇంతకంటే మర్యాదగా మాట్లాడలేను..

## ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌పై సీఎం ఆగ్రహం



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ విమానాశ్రయంపై జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనగర్ నుంచి ఢిల్లీకి ఆయన ప్రయాణిస్తోన్న విమానాన్ని జైపూర్‌కు దారి మళ్లించడంపై మండిపడ్డారు. విమానం బయలుదేరిన మూడు గంటల అనంతరం దారి మళ్లించారని, ఢిల్లీ విమానాశ్రయం తీరు దారుణంగా ఉందని ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. జైపూర్ నుంచి తిరిగి ఎప్పుడు బయల్దేరుతామో కూడా తెలియదని, దీని గురించి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. ప్రయాణికుల విషయంలో వారి బాధ్యతారా హిత్యం చూస్తుంటే.. సహనం నశించి పోతోం దని, తాను మర్యాదగా మాట్లాడే పరిస్థితుల్లో కూడా లేనని విరుచుకుపడ్డారు ప్రతికూల వాతావరణం కారణంగా విమానాలు ఆలస్యం అవుతున్నాయని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. జమ్మూ విమానాశ్రయంలో కూడా వాతావరణం సరిగా లేకపోవడంతో చాలా విమానాలు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎక్స్ (ట్విట్టర్)లో తన అసహనాన్ని వ్యక్తం చేసిన సీఎం ఒమర్ అబ్దుల్లా 'జమ్మూ నుంచి బయలుదేరిన విమానం మూడు గంటల పాటు గాల్లోనే ఉంది.. ఢిల్లీ విమానాశ్రయంలో రద్దీగా ఉండటం లేదా అంతరాయం వల్లనో జైపూర్‌కి దారి మళ్లించారు.. రాత్రి 1 గంటకు విమానం మెట్లపై నిలబడి గాలి పీల్చుకుంటున్నాను.. ఇక్కడి నుంచి ఎప్పుడు బయలుదేరుతామో నాకు తెలియదు' అని ఆయన అన్నారు.దీని తర్వాత మరో పోస్ట్ పెట్టిన ఆయన తాను ఆదివారం ఉదయం 3:00 గంటల తర్వాత ఢిల్లీకి చేరుకున్నానని తెలిపారు. గత వారం రోజులుగా ఢిల్లీలో ఈదురు గాలులు, అకాల వర్షాలతో విమానాలు ఆలస్యం అవుతున్నాయి. దీనిపై విమానాశ్రయ అధికారులు ఆదివారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేశారు. గాలి దిశ మారడం వల్ల విమానాలు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. 'విమానాల రాకపోకలను నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం... ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం... విమాన సర్వీసుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి మీ విమానయాన సంస్థతో టచ్‌లో ఉండండి.. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం... మీ సహకారానికి ధన్యవాదాలు' అని అందులో పేర్కొన్నారు.జమ్మూ విమానాశ్రయంలో కూడా ప్రతికూల వాతావరణంతో చాలా విమానాలు రద్దు చేశారు. దీనివల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. రద్దీగా ఉన్న టెర్మినల్ వీడియోలను పలువురు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రాత్రికి ఉండటానికి వసతి దొరుకుతుందో లేదో అని కొందరు ఆందోళన చెందారు. దీనిపై ఇండిగో, స్పైస్‌జెట్ వంటి సంస్థలు ప్రకటన విడుదల చేసి.. ప్రయాణికులకు ఎదురైన అంతరాయంపై విచారం వ్యక్తం చేశాయి.

## అయోధ్యలో రామయ్య దర్శనానికి 80 మీటర్ల సొరంగం



**అయోధ్య -నవభూమి:**ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని రాముడి జన్మస్థలంలో ఆలయ నిర్మాణం ఐదు శతాబ్దాల తర్వాత జరిగిన విషయం తెలిసిందే. దీంతో భక్తులు అయోధ్యకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నరు. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సమయంలో అయోధ్య కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో అయోధ్య రామమందిరంలో భక్తుల రద్దీని తగ్గించేందుకు కొత్తగా సొరంగ మార్గం నిర్మించారు. 80 మీటర్ల పొడవు ఉండే ఈ సొరంగం గుండా ఒకేసారి 1.5 లక్షల మంది భక్తులు ప్రదక్షిణలు చేయవచ్చు. దేశంలోని ఆలయాల్లో ఇదే అతిపెద్ద సొరంగమని ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ మేనేజర్ వినోద్ మెహతా తెలిపారు. ఆలయానికి తూర్పు భాగంలో.. నేలమట్టానికి 15 అడుగుల దిగువన ఈ సొరంగం ఉంది. దీని పొడవు 80 మీటర్లు. ప్రదక్షిణ చేసే భక్తులు, ఆలయానికి వచ్చే భక్తులు ఒకే చోట ఉండటం వల్ల రద్దీ ఏర్పడుతుంది. ఈ రద్దీని నివారించడానికి ఈ సొరంగం ఉపయోగపడుతుంది.


ఈ సొరంగం ద్వారా ఒకేసారి లక్ష మందికిపైగా భక్తులు ప్రదక్షిణలు చేయడానికి అవకాశం ఉంటుంది. సుమారు 1.5 లక్షల మంది భక్తులు ఒకేసారి ప్రదక్షిణలు చేయవచ్చని, దేశంలో ఆలయ ప్రదక్షిణ కోసం ఇంత పెద్ద సొరంగం ఎక్కడా లేదని అధికారులు అంటున్నారు. భక్తుల రద్దీని తగ్గించేలా ఈ సొరంగాన్ని ప్రాజెక్ట్ మేనేజర్ వినోద్ మెహతా చెప్పారు. ఈ సొరంగం ఆలయంలో ప్రవేశించేవారికి, ప్రదక్షిణ చేసేవారికి మధ్య రద్దీని తగ్గిస్తుందని ఆయన తెలిపారు.ప్రదక్షిణ కోసం 800 మీటర్ల పొడవైన గోడను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో ఈ సొరంగం కూడా ఒక భాగం. అక్టోబరు నాటికి సొరంగం పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. రాముడి జన్మస్థలంలో భవ్యమైన మందిర నిర్మాణం 500 ఏళ్ల హిందువుల చిరకాల స్వప్నం గతేడాది సాకారమైంది. సుదీర్ఘ న్యాయవివాదం అనంతరం 2019 నవంబరులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అయోధ్యలో మందిర నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. ఆగస్టు 2020లో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగ్గా.. పనులను శరవేగంగా పూర్తిచేసి 2024 జనవరిలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి బాలరాముడి దర్శనానికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు.ఇటీవల జరిగిన ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా సమయంలో అయోధ్యకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. నాలుగు రోజుల్లోనే 65 లక్షల మంది దర్శించుకున్నారంటే రద్దీ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక, శ్రీరామ నవమి రోజున కూడా దాదాపు 20 లక్షల మంది వచ్చారని అంచనా. ఆ రోజున గర్భగుడిలోని బాలరాముడి విగ్రహంపై సూర్యకిరణాలు ప్రసరించనున్నాయి. రామయ్యకు సూర్యతిలకం దిద్దే ఈ అద్భుత ఘట్టాన్ని కనురాలా తిలకించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఈ నేపథ్యంలో రద్దీని నియంత్రించేందుకు యూపీ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

## జులైలో జపాన్ లో అంత దారుణం జరగనుందా? చెప్పిందెవరంటే?



**జపాన్-నవభూమి:**భవిష్యత్తును ముందే అంచనా వేసి హెచ్చరించే వారు కొందరు ఉంటారు. తెలుగు నేల మీద పోతులూరి వీరబ్రహ్మంగారు. ఆ మాటకు వస్తే ప్రపంచ వ్యాప్తంగా చాలా మందే ఉంటారు. కంటి చూపు లేని బాబా వంగా రాసిన పలు అంచనాలు నిజం కావటం తెలిసిందే. ఆమెను పోలిన రీతిలోనే జపాన్‌కు చెందిన ప్రఖ్యాత మాంగా ఆర్టిస్టు ర్యో తత్సుకీ చెప్పిన జోస్యం ఇప్పుడు సంచలనంగా మారింది. అది కూడా ఈ జులైలోనే జరుగుతుందన్న అంచనా పలువురిని భయాందోళనలకు గురి చేస్తోంది. 2011లోని భారీ సునామీతో జపాన్ చిగురుటాకులా వణికిపోవటమే కాదు.. సదరు సునామీ కారణంగా వేలాది మంది (సుమారు 20 వేలకు మరణించటం తెలిసిందే. 2011నాటి సునామీకి మించిన మూడు నాలుగు రెట్ల తీవ్రతతో విరుచుకుపడే సునామీ ఈ జులైలో జరుగుతుందన్నది ర్యో తత్సుకీ చెప్పిన జోస్యం. గతంలో ఆమె చెప్పిన ఎన్నో అంచనాలు నిజం కావటంతో.. మరో మూడు నెలల తర్వాత జరుగుతుందన్న అంచనా ఇప్పుడు వణుకుపుట్టేలా చేస్తోంది. ఈ సునామీ తీవ్రత జపాన్ చరిత్రలోనే దారుణమైన విపత్తు విరుచుకుపడుతుందని హెచ్చరిస్తున్నారు. 1980 నుంచి ఆమె భవిష్యత్తు చెప్పటం ఒక ఎత్తు అయితే.. అలా ఆమె చెప్పిన అంచనాలు ఎన్నో నిజం అయ్యాయి. అదే ఇప్పుడు ఆందోళనకు మూల కారణంగా చెప్పాలి. గతంలో ఆమె ప్రిన్సెస్ డయానా మరణాన్ని ముందే చెప్పటం.. 2020లో విరుచుకుపడిన కరోనా గురించి హెచ్చరించటం లాంటివి చేశారు. "ద ఫ్యూచర్ దట్ ఐ సా" పేరుతో ఆమె ఒక పుస్తకాన్ని రాశారు. అంతేకాదు.. 1999లో ఆమె రాసిన మాంగా సైతం పెను దుమారానికి కారణమైంది. 3 నెలల్లో రెండోసారి వీధుల్లోకి ప్రజలు రాకాసి బుడగలు పడగలెత్తుతాయని.. దక్షిణ జపాన సముద్రం మరిగిపోతుందని సునామీ తీవ్రతను ఆమె చెప్పుకుచ్చారు. ఈ సునామీ ధాటికి జపాన్.. తైవాన్.. ఇండొనేషియా.. ఉత్తర మారియానా దీవులు ఈ రాకాసి సునామీకి అతలాకుతలం అవుతాయని చెబుతున్నారు. దీంతో.. ఇదో హాట్ టాపిక్‌గా మారింది. విపత్తుల అంశంలో శాస్త్రసాంకేతిక సాయం తీసుకోవాలే తప్పించి.. ఇలాంటి అంశాలలో మూఢనమ్మకాల మీద ఎక్కువ ఫోకస్ పెట్టటం మంచిదికాదన్న హెచ్చరిక చేస్తున్నారు. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. తానుచెప్పిన జోస్యం మీద ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన చర్చ జరుగుతున్నా.. ఆమె తన మౌనాన్ని వీడటం లేదు. జులైలో చోటు చేసుకునే సునామీ తీవ్రత ఎంతన్నది ఒక ఎత్తుఅయిత.. మరో ఐదేళ్లకు అంటే 2030లో కరోనాకు మించిన మరో విపత్తు విరుచుకుపడుతుందని హెచ్చరిస్తున్నారు. అయితే.. దీనికి ముందు జులైలో విరుచుకుపడే సునామీ తర్వాత.. మిగిలిన అంశాల గురించి ఆలోచించొచ్చన్న మాట వినిపిస్తోంది.


## ఆవును కాపాడబోయి యాక్సిడెంట్.. ఎయిర్ హొస్టెస్ మృతి..




**న్యూఢిల్లీ-నవభూమి:**( మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో షికారుకు వెళ్లిన 21 ఏళ్ల ఎయిర్ హొస్టెస్ అనుకోని ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకుంది. కారు కాలువలో పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై మరణించింది. ఆమె స్నేహితుడు జై అతి వేగంతో కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు దర్యాప్తులో తేలింది.గురువారం రాత్రి కోలార్ సిక్స్ లేన్‌లోని హోలీ క్రాస్ స్కూల్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఎయిర్ హొస్టెస్ హర్షిత ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా ఒక ఆవు అడ్డొచ్చింది. ఆ సమయంలో ఆమె స్నేహితుడు జై కారు డ్రైవ్ చేస్తున్నాడు. అప్పటికే కారు స్పీడ్ గా వెళ్తుండటంతో కారును నడుపుతున్న జై ఆవును ఢీకొట్టకుండా ఉండేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో క్షణాల్లోనే హర్షిత, జై, ఆమె మరొక స్నేహితుడు సుజల్ ప్రయాణిస్తున్న కారు సమీపంలోని కాలువలో పడిపోయినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదంలో జై, సుజల్ గాయాలు లేకుండా తప్పించుకోగలిగారు కానీ హర్షిత తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేసినా ప్రాణాలు కాపాడలేకపోయారు. ఆసుపత్రిలో మరణించినట్లు ఆమె కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. బ్రెయిన్ డెడ్ కావడం వల్లే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. శుక్రవారం హర్షిత మృతదేహానికి హమీడియా ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన తర్వాత నిర్లక్ష్యంగా కారు నడిపినందుకు ఆమె స్నేహితుడు జైపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.హర్షిత జూలై 2023లో భోపాల్‌లోని ఒక సంస్థ నుంచి ఎయిర్ హొస్టెస్ శిక్షణను పూర్తి చేసి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ద్వారా ఎంపికైంది. ఆమె తరచుగా ఉద్యోగ బాధ్యతల వల్ల మధ్యప్రదేశ్ వెలుపలి ప్రాంతాల్లో ప్రయాణిస్తూ ఉండేది. అలాగే గురువారం బెంగళూరు నుంచి భోపాల్‌కు చేరుకుంది. సోదరుడి పుట్టినరోజు కోసం శుక్రవారం భోపాల్ వస్తానని బుధవారమే తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసింది. కానీ, కుటుంబసభ్యులకు చెప్పకుండా ఒకరోజు ముందుగానే వచ్చి హోటల్‌లో రూం బుక్ చేసుకుని అక్కడే బస చేసింది. తర్వాత జై, సుజల్ కారులో ఆమెను హోటల్ నుంచి తీసుకెళ్లారు. ఆ సమయంలోనే ఈ ప్రమాదం జరిగింది.

## పెళ్లికి ముందే టార్చర్.. కాబోయే భార్య వేధింపులు తట్టుకోలేక సూసైడ్..

**న్యూఢిల్లీ-నవభూమి:** కాబోయే భార్య వేధింపులు భరించలేక మహారాష్ట్ర నాసిక్‌లో పనిచేస్తున్న 36 ఏళ్ల ఆదాయపు పన్ను అధికారి హరేరామ్ సత్యప్రకాష్ పాండే ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవలే ఆయనకు వారణాసికి చెందిన మోహిని పాండేతో నిశ్చితార్థం జరిగింది. ఫియాన్సీ ప్రేమ వ్యవహారం ఎంగేజ్‌మెంట్ నాడే గమనించిన హరేరామ్.. అతడ్ని వదిలేస్తే పెళ్లి చేసుకుంటానని చెప్పడమే పాపమైంది. పెళ్లికి నిరాకరిస్తే తప్పుడు కట్నం కేసు పెడతామని కాబోయే వధువును బెదిరించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 35 ఏళ్ల నిరీక్షణ ఫలించి ఎట్టకేలకు ఓ మంచి అమ్మాయితో నిశ్చితార్థం జరుగుతోందని.. తనకో అద్భుత భాగస్వామి దొరికిందని మురిసిపోయినంతలోనే



హరేరామ్ సత్యప్రకాష్ పాండేకు ఆ రోజునే ఊహించని షాక్ తగిలింది. ఎంగేజ్‌మెంట్ రోజే తన ప్రియుడు సురేష్ పాండేను అందరి ముందు కాబోయే భార్య కౌగిలించుకోవడం చూసి నోట మాట రాలేదు. విషయం బట్టబయలు అయినా.. అతడితో సంబంధం తెంచుకుంటే పెళ్లి చేసుకునేందుకు అభ్యంతరం లేదని.. ఏదొకటి తేల్చుకోమని మోహినితో చెప్పాడు. కానీ, ఆమె అందుకు నిరాకరించడమే కాకుండా బెదిరింపులకు దిగింది. రోజురోజుకీ టార్చర్ పెరిగిపోవడంతో ఏం చేయాలో పాలుపోక ఉరితాడే శరణ్యమనుకున్నాడు ఆ అభాగ్యుడు.



## సూడాన్ సంక్షోభం

అరబ్ రాచరిక ప్రభుత్వాల స్వార్థం, అగ్రరాజ్య అధినేత నిర్దయ, దేశీయుల మధ్య కత్తి వైరం కారణంగా ఎడతెగని సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఆఫ్రికా దేశం సూడాన్. గాజా, ఉక్రెయిన్ యుద్ధాలతో తల్లడిల్లుతున్న అంతర్జాతీయ సమాజం ఈ ఆఫ్రికన్ అభాగ్యుల దుస్థితిని పూర్తిగా ఉపేక్షించడం నేటి ప్రపంచ విస్మయకర, విషాద పోకడకు ఒక తార్కాణం. 19వ శతాబ్దంలో ఒట్టోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఆవిర్భవించి, ఇరవయో శతాబ్ది ప్రథమార్ధంలో ఆంగ్లో-ఈజిప్షియన్ ఉమ్మడి పాలనలో ఉండి, 1956లో వలసపాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన సూడాన్ తన 69 ఏళ్ల అస్తిత్వంలో, మరే ఆఫ్రికన్ దేశం కంటే ఎక్కువసార్లు తిరుగుబాట్లను చవిచూసింది. 2019లో సంభవించిన తిరుగుబాటులో 1989 నుంచి నిరంకుశ పాలన చేసిన ఒమర్ అల్ బషీర్ పదవీ భ్రష్టుడయ్యాడు. ఆయన స్థానంలో అధికారంలోకి వచ్చిన పౌర సైనిక ప్రభుత్వం సుస్థిర ప్రజాస్వామిక పాలననందిస్తామని హామీ ఇచ్చింది. అయితే జనరల్ అబ్దేల్ ఫత్తా బుర్హాన్ తన సహచర పౌర పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి అధికారాన్ని కైవసం చేసుకున్నాడు. ఇందుకు అతడికి సహకరించిన వ్యక్తి హెమెడ్తీగా ప్రసిద్ధుడైన పారామిలిటరీ దళం ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అధిపతి మొహమద్ హమ్దాన్ డగాలో. అయితే ఆ తరువాత ఇరువురి మధ్య అధికారం కోసం ప్రారంభమైన పెనుగులాట ఫలితమే 2023 నుంచి కొనసాగుతున్న అంతర్యుద్ధం, తత్పర్యవసాన మానవతా సంక్షోభం. ఆఫ్రికాలో చమురు ఉత్పత్తి దేశాలలో సూడాన్ అగ్రగామిగా ఉండేది. చమురు విక్రయాలతో అపారంగా సమకూరిన ధన రాశులతో కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు బషీర్ పూనుకున్నాడు.


అందులో భాగంగా పదివేల కోట్ల డాలర్ల వ్యయంతో నైలునదిపై డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపట్టాడు. ఆ కార్యక్రమం పూర్తయ్యేలోపే దక్షిణ సూడాన్ ప్రజలు తిరుగుబాటు చేసి స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చమురు నిక్షేపాలు ఉన్న ప్రాంతాలన్నీ దక్షిణ సూడాన్‌వే కావడంతో కొత్త ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణ ప్రయత్నాలకు తీరని విఘాతం కలిగింది. చమురు ఆదాయం లేకపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయింది. ఆఫ్రికాలో మరే దేశంలో కంటే అధికంగా ఉన్న బంగారు గనులకు నెలవు అయిన పశ్చిమ సూడాన్‌లో తనతో విభేదించిన తెగలను అణచివేసేందుకు ప్రైవేట్ మిలీషియాలను బషీర్ సృష్టించాడు. అటువంటి ఒక ప్రైవేట్ సైన్యం నుంచి ప్రభవించిందే ప్రస్తుతం హెమెడ్తీ నాయకత్వంలోని ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్. బంగారు గనులు ఉన్న పశ్చిమ సూడాన్‌లో హెమెడ్తీదే రాజ్యం. తన పారా మిలిటరీ దళాన్ని జనరల్ బుర్హాన్ నేతృత్వంలోని సైన్యంలో విలీనం చేసేందుకు తిరస్కరిస్తూ వచ్చిన హెమెడ్తీ గత మంగళవారం నాడు తన నియంత్రణలో ఉన్న ప్రాంతాలలో 'గవర్నమెంట్ ఆఫ్ పీస్ అండ్ యూనిటీ'ని ఏర్పాటు చేశాడు. పక్షం రోజుల క్రితం తన పారా మిలిటరీ అధీనంలో ఉన్న దేశ రాజధాని ఖార్టూమ్‌ను జనరల్ బుర్హాన్ సైన్యానికి కోల్పోయాడు. అయినప్పటికీ తమ ప్రభుత్వమే సూడాన్ ప్రజల నిజమైన ప్రతినిధి అంటున్న హమెడ్తీ బుర్హాన్‌తో రాజీకి ససేమిరా అంటున్నాడు. రెండు సంవత్సరాలుగా ఈ ఇరువురి సైన్యాల మధ్య సూడాన్ కకావికలమై పోయింది.

తమ వ్యూహాత్మక ప్రయోజనాలకు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాచరిక ప్రభువులు ఈ ప్రత్యర్థులలో చెరొకరి కొమ్ముకాస్తూ అంతర్యుద్ధ పరిస్థితిని మరింత విషమింపచేస్తున్నారు. అంతర్యుద్ధంతో నెలకొన్న విపత్కర పరిస్థితులు 'ప్రపంచంలోని అత్యంత భయంకరమైన ఆకలి సంక్షోభం' అని ఐక్యరాజ్యసమితి అభివర్ణించింది. మూడు కోట్ల మందికి పైగా సూడానీలు మానవతా పూర్వక సహాయంపై ఆధారపడి ఉన్నారు. లక్షలాది కుటుంబాలు సర్వం కోల్పోయాయి. అనేక లక్షల మంది ఇరుగు పొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్లారు. హెమెడ్తీ నేతృత్వంలోని పారామిలిటరీ దళాలు పాల్పడిన అకృత్యాలు యుద్ధనేరాలే అని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రపంచ ప్రజలకు మానవతాపూరిత సహాయాన్ని సమకూర్చే 'యుఎస్ ఎయిడ్' కార్యకలాపాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పూర్తిగా నిలిపివేయడంతో సూడాన్‌లో సహాయ చర్యలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో సూడాన్ ప్రజల అవస్థలు మాటల్లో చెప్పలేని విధంగా మిక్కుటమయ్యాయి. అమెరికా నిర్దాక్షిణ్య నిర్ణయం సూడాన్ ప్రజలను వారి కర్మకు వదిలివేయడమే అయింది. అభివృద్ధికి తోడ్పడే కీలక సహజ వనరులు ఉన్నప్పటికీ సూడాన్ రాజకీయంగా, ఆర్థికంగా పథభ్రష్టమవడం ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య పద్ధతులు, సమాజంలో ప్రజాస్వామిక నైతికత అవసరమనే సత్యాన్ని ఎత్తి చూపుతోంది. కడుపు తరుక్కుపోయే కన్నీళ్ల విషాద గాథలు కళ్ల ముందుకు వచ్చినప్పుడు ఆ అభాగ్యగతులకు కనీస సానుభూతి, సహానుభూతి చూపడం విశాల ప్రపంచ విధ్యుక్త ధర్మం.

# భారత నేలపై విశ్వ పర్యావరణ స్పృహ



ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ ధరిత్రి దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు. ఇది మన భూమాత పట్ల మనకున్న బాధ్యతను గుర్తుచేసే ఒక మహత్తరమైన సందర్భం. మన దేశం తన విశాలమైన భౌగోళిక వైవిధ్యంతో అనేక సంస్కృతులతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థతో ఈ రోజు యొక్క ప్రాముఖ్యతను మరింతగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది ప్రపంచ ధరిత్రి దినోత్సవ ఇతివృత్తం "మన శక్తి, మన గ్రహం". ఈ థీమ్ పునరుత్పాదక శక్తి ప్రాముఖ్యతను, స్వచ్ఛమైన శక్తి ఉత్పత్తిని పెంచవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. భారతదేశం పునరుత్పాదక శక్తి వనరుల విషయంలో గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. దేశ భౌగోళిక పరిస్థితులు, సహజ వనరులు వివిధ రకాల పునరుత్పాదక శక్తి ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నాయి. ప్రధానంగా మనదేశంలో అందుబాటులో ఉన్న పునరుత్పాదక శక్తి వనరులు, వాటి ప్రస్తుత స్థితి గురించి చూద్దాం.




**సౌర శక్తి:**
మన దేశం ఏడాదిలో దాదాపు 300-330 రోజులు పాటు పుష్కలమైన సూర్యకాంతిని పొందుతుంది. ఇది సౌర శక్తి ఉత్పత్తికి ఆదర్శమైన దేశంగా నిలిచింది. జనవరి 2025 నాటికి, 100 గిగా వాట్స్ స్థాపిత సౌర విద్యుత్ సామర్థ్యాన్ని అధిగమించింది. మరో 84.10 గిగా వాట్స్ ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. దేశ మొత్తం పునరుత్పాదక శక్తిలో సౌర శక్తి దాదాపు 47% వాటాను కలిగి ఉంది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సౌర విద్యుత్ ఉత్పత్తిలో ముందున్న రాష్ట్రాలు. ప్రభుత్వం సౌర పార్కులు, రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలను ప్రోత్సహిస్తోంది.

**పవన శక్తి:**
మన దేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద స్థాపిత పవన విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. మార్చి 2025 నాటికి మనదేశ మొత్తం స్థాపిత పవన విద్యుత్ సామర్థ్యం 50 గిగావాట్స్ కి చేరుకుంది. పవన విద్యుత్ సామర్థ్యం ప్రధానంగా దక్షిణ, పశ్చిమ, వాయువ్య రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉంది. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర పవన విద్యుత్ ఉత్పత్తిలో ముఖ్యమైన రాష్ట్రాలు. దేశ తీర ప్రాంతాలు, కొన్ని పర్వత ప్రాంతాలు పవన శక్తికి గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

**జల విద్యుత్ :**
భారతదేశం జల విద్యుత్ ఉత్పత్తికి కూడా గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. దేశంలో 197 పెద్ద జల విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. మొత్తం స్థాపిత జల విద్యుత్ సామర్థ్యం సుమారు 46.85 గిగావాట్స్. మన దేశం ప్రపంచంలో విద్యుత్ సామర్థ్యంలో 5వ స్థానంలో ఉంది. పెద్ద డ్యామ్‌లు, చిన్న జల విద్యుత్ ప్రాజెక్టులు దేశ శక్తి రంగంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి.

**బయోమాస్ శక్తి:**
దేశంలో వ్యవసాయ వ్యర్థాలు, అటవీ ఉత్పత్తులు, ఇతర సేంద్రియ పదార్థాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి బయోమాస్ శక్తి ఉత్పత్తికి ఉపయోగపడతాయి. దేశంలో ఏటా సుమారు 308 మిలియన్ టన్నుల బయోమాస్ అందుబాటులో ఉంది. బయోమాస్ నుండి విద్యుత్, ఇతర ఇంధనాలను ఉత్పత్తి చేసే సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్నాయి. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి బయో-ఇంధనం, బయో-గ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు.

ఇతర పునరుత్పాదక శక్తి వనరులు:
దేశంలో భూఉష్ణ శక్తి, అలల శక్తి వంటి ఇతర పునరుత్పాదక శక్తి వనరుల యొక్క సామర్థ్యం కూడా అన్వేషించబడుతోంది. అయితే వాటి వాణిజ్య స్థాయి వినియోగం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. భారతదేశం 2030 నాటికి 500 గిగా వాట్స్ శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి పునరుత్పాదక శక్తి వనరుల అభివృద్ధి వినియోగం కీలకమైనది. ప్రభుత్వం ఈ రంగానికి ప్రోత్సాహకాలు మరియు మద్దతును అందిస్తోంది.

**సవాళ్లు:**
మనదేశం వాతావరణ మార్పుల దుష్ప్రభావాలకు అత్యంత హాని కలిగిన దేశాలలో ఒకటి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మారుతున్న వర్షపాతం నమూనాలు, తరచుగా వచ్చే కరువులు, వరదలు, సముద్ర మట్టం పెరగడం వంటివి, వ్యవసాయం, నీటి వనరులు, ప్రజారోగ్యం, మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దేశంలో నీటి కొరత ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ అవసరాలు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ కారణంగా నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. భూగర్భ జలాలు క్షీణిస్తున్నాయి. అనేక ప్రాంతాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి.

గాలి, నీరు, నేల కాలుష్యం భారతదేశంలో ప్రధాన పర్యావరణ సమస్యలు. పారిశ్రామిక వ్యర్థాలు, వాహనాల ఉద్గారాలు, మురుగునీరు, వ్యవసాయ రసాయనాల వల్ల కాలుష్యం పెరుగుతోంది. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సహజ పర్యావరణ వ్యవస్థలను దెబ్బతీస్తోంది. వ్యవసాయ విస్తరణ కోసం అడవులను నరకడం వల్ల అటవీ ప్రాంతం తగ్గిపోతోంది. ఇది వన్యప్రాణుల ఆవాసాలను నాశనం చేస్తుంది. జీవవైవిధ్యం కోల్పోవడానికి దారితీస్తుంది. అనేక జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. సరైన వ్యర్థాల సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ లేకపోవడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది. ప్రజారోగ్యానికి హాని కలుగుతోంది. దేశం తన శక్తి అవసరాల కోసం ఇప్పటికీ ఎక్కువగా శిలాజ ఇంధనాలపై ఆధారపడి ఉంది. ఇది వాతావరణ మార్పులకు దోహదం చేస్తుంది. శక్తి భద్రతకు ప్రమాదం కలిగిస్తుంది.

అధిక సాగు, అటవీ నిర్మూలన, నీటి నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల భూమి తన ఉత్పాదకతను కోల్పోతోంది. ఎడారీకరణకు గురవుతోంది. ఇది వ్యవసాయం ఆహార భద్రతపై ప్రభావం చూపుతుంది.

**పరిష్కారాలు:**
భారతదేశం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించడానికి సమగ్రమైన బహుముఖ విధానం అవసరం. వివిధ స్థాయిల్లో, వ్యక్తిగత, సామాజిక, ప్రభుత్వ, అంతర్జాతీయచర్యలు తీసుకోవడం ద్వారా ఈ సవాళ్లను అధిగమించవచ్చు. కొన్ని ముఖ్యమైన పరిష్కార మార్గాలును పరిశీలిద్దాం. సౌర, పవన, జల, బయోమాస్ వంటి స్వచ్ఛమైన శక్తి వనరుల ఉత్పత్తిని వినియోగాన్ని గణనీయంగా పెంచాలి. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించాలి. గృహాలు, పరిశ్రమలు, రవాణా రంగంలో శక్తిని సమర్థవంతంగా ఉపయోగించడానికి చర్యలు తీసుకోవాలి. ఎలక్ట్రిక్ వాహనాలు, ప్రజా రవాణా సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించాలి. ఉన్న అడవులను రక్షించాలి. కొత్తగా మొక్కలు నాటాలి. ఇది కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించడానికి సహాయపడుతుంది.

వాతావరణ మార్పులను తట్టుకునే పంటలను పండించడం, నీటిని సమర్థవంతంగా ఉపయోగించే పద్ధతులను అవలంబించాలి. నీటిని వృథా చేయకుండా సమర్థవంతంగా ఉపయోగించడంపై ప్రజల్లో అవగాహన పెంచాలి. నీటి సరఫరా వ్యవస్థల్లో లీకేజీలను తగ్గించి నీటిని తిరిగి ఉపయోగించడం (రీసైక్లింగ్) వంటి చర్యలు తీసుకోవాలి. చెరువులు, కుంటలు, ఇతర జలవనరులను అభివృద్ధి చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయాలి. స్థానిక అవసరాలకు అనుగుణంగా చిన్న నీటిపారుదల ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలి. తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ప్రోత్సహించాలి. పరిశ్రమల నుండి వచ్చే ఉద్గారాలను నియంత్రించాలి. వాహనాల కాలుష్యాన్ని తగ్గించడానికి కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. పారిశ్రామిక వ్యర్థాలను, మురుగునీటిని శుద్ధి చేయకుండా నదులుఇతర జలవనరుల్లోకి వదలకూడదు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేయాలి. అటవీ నిర్మూలన, జీవవైవిధ్యం కోల్పోవడాన్ని నివారించాలి. అటవీ సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి అక్రమ అటవీ నరికివేతను అరికట్టాలి. సామాజిక అటవీకరణను ప్రోత్సహించాలి ప్రజలను భాగస్వాములను చేసి మొక్కలు నాటడం అడవులను సంరక్షించాలి. వన్యప్రాణుల ఆవాసాలను రక్షించాలి. వేటను అరికట్టాలి. పర్యావరణ సున్నిత ప్రాంతాలను గుర్తించి వాటిని పరిరక్షించాలి. వ్యర్థాలను ఉత్పత్తి చేయడాన్ని తగ్గించాలి. వీలైనంత వరకు వాటిని తిరిగి ఉపయోగించాలి. మూలం వద్దనే తడి,పొడి వ్యర్థాలను వేరు చేయడం ద్వారా వాటిని సమర్థవంతంగా ప్రాసెస్ చేయవచ్చు. వ్యర్థాలను ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసే సాంకేతికతలను అభివృద్ధిచేయాలి. వ్యర్థాలను శాస్త్రీయంగా డంప్ చేయడానికి ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణను పర్యవేక్షించాలి. పాఠశాల స్థాయి నుండి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయాలి. పర్యావరణ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి మీడియా మరియు ఇతర వేదికలను ఉపయోగించాలి. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు కఠినమైన పర్యావరణ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలి. పర్యావరణ పరిరక్షణకు నిధులు కేటాయించి పరిశోధనను ప్రోత్సహించాలి. ఇతర దేశాలతో కలిసి పర్యావరణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రజల్లో అవగాహన పెంచడం చాలా అవసరం. ధరిత్రీ దినోత్సవం ఈ దిశగా మరింత కృషి చేయడానికి ఒక ముఖ్యమైన ప్రేరణగా నిలుస్తుంది.

**అందరి బాధ్యత:**
ప్రపంచ ధరిత్రి దినోత్సవం కేవలం ఒక రోజుకు పరిమితం కాకూడదు. పర్యావరణ పరిరక్షణ అనేది నిరంతర ప్రక్రియ. మనం ప్రతిరోజూ మన భూమిని గౌరవించాలి. దానిని సంరక్షించడానికి కృషి చేయాలి. మన భవిష్యత్తు తరాల కోసం మనం ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనపై ఉంది.

**ఏప్రిల్ 22 ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా...**

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

# పొత్తుపై నీలినీడలు

క్రమలంతో స్నేహం ఎన్నికల వరకేనని అన్నాడీఎంకె అధినేత పళనిస్వామి బుధవారం చేసిన వ్యాఖ్యను ఎవరికి తోచినరీతిలో వారు విశ్లేషించుకోవచ్చు. అధికారపక్షం డీఎంకెను ఓడించగలశక్తి తమకు ఉన్నదని పళనిపార్టీలో ఎంతమంది నమ్ముతున్నారో తెలియదు కానీ, బీజేపీతో గతవారం మొలిచిన పొత్తు కారణంగా తాము మరింత దెబ్బతినిపోతామన్న భయం మాత్రం అత్యధికుల్లో ఉంది. మరీ ముఖ్యంగా కార్యకర్తల్లో ఉన్న ఈ ఆందోళనను పటాపంచలు చేయడానికీ, వారిలో ఉత్సాహాన్ని నింపడానికి పళని ఈ వ్యాఖ్యలు చేసినట్టు కనిపిస్తోంది. బీజేపీని కాదు పొమ్మనగలిగే స్థితి పళని పార్టీకి లేదు. డీఎంకెను బలంగా ఢీకొట్టడానికి సమస్త సంపత్తీ ఉన్న బీజేపీ దానికి అవసరం. పొత్తును పునరుద్ధరించుకోవాలా వద్దా అని మల్లగుల్లాలు పడి, చివరకు కుదర్చుకున్నప్పటికీ, డీఎంకె నుంచి వస్తున్న విమర్శలు, ప్రశ్నలు పళని పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే, ఎన్నికలవరకే పొత్తు అనడం ద్వారా, ఆ తరువాత ప్రభుత్వం ఏర్పాటులో కానీ, పాలనలోనే కానీ బీజేపీకి వీసమెత్తు చోటు ఉండదని పళని ముందే సందేశం ఇవ్వదల్చుకున్నట్టు కనిపిస్తోంది.

ప్రధాని మోదీ, అమిత్ షా ఇత్యాది బీజేపీ నాయకులు ఈ పొత్తును ఘనంగా ప్రశంసిస్తూ ప్రకటనలు చేశారు. నిజానికి, బీజేపీ నాయకులకంటే ఎక్కువగా ఈ పొత్తును ఆకాశానికి ఎత్తేస్తూ తమిళనాడు అభివృద్ధి, ఇరుపక్షాల ముందుచూపు, రాష్ట్రానికి మోదీ ఆశీస్సులు ఇత్యాది మాటలు వాడింది పళనిస్వామే. పొత్తుకు ఏ కండిషన్లు, డిమాండ్లు లేవని, అన్నాడీఎంకె వ్యవహారాల్లో, నిర్ణయాల్లో బీజేపీ ఏ మాత్రం జోక్యం చేసుకోబోదని, కలిసికట్టుగా పనిచేస్తామని అమిత్ షా మొన్న శుక్రవారం పొత్తు ప్రకటన నాడు వివరించారు. రెండుపార్టీలను సహజభాగస్వాములని కీర్తించారు. ఈ పొత్తు పునరుద్ధరణ కోసం బీజేపీ అన్నామలై వంటి పోరాటవీరుడిని వదులుకుంది. ఆయన డీఎంకెమీద అస్త్రాలు సంధిస్తున్నంతవరకూ అన్నాడీఎంకె బాగా ఆనందపడింది. ఆయన కారణంగానే రాష్ట్రంలో నాలుగుఓట్లు పడుతున్నాయనీ, పార్టీ పెరుగుతోందని, సిద్ధాంత వ్యాప్తి జరుగుతోందని బీజేపీ నాయకులు కూడా సంతోషించారు. కానీ, ఆ తరువాత అన్నాదురై, జయలలిత సహా అన్నాడీఎంకె నాయకులమీద ఈ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఘాటైన విమర్శలు చేయడంతో సార్వత్రక ఎన్నికలకు ముందే పళనిపార్టీ ఆ పొత్తు తెంపేసుకుంది. బీజేపీతోనూ, ఎన్డీయేతోనూ తెగదెంపులు తమకు అత్యంత సంతోషకరమైన ఘట్టం అని ఈ నాయకులంతా అన్నారు. బీజేపీతో పొత్తు కారణంగా మైనారిటీ ఓట్లు తమకు దక్కకుండా పోతున్నాయని, ముప్పైతొమ్మిది ఎంపీ సీట్లూ తామే గెలుస్తామని చెప్పుకున్నారు. కానీ, ఈ తెగదెంపుల ఎత్తుగడ తర్వాత కూడా సార్వత్రక ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకూ ఒక్కసీటు కూడా గిట్టుబాటు కాలేదు.

ఈ విడాకుల సందర్భంలోనే, చాలామందికి జయలలిత మరణానంతరం ఆమె పార్టీ రెండుగా చీలిన ఘట్టం గుర్తుకువచ్చింది. కన్నీరు మున్నీరవుతున్న శశికళ తలనిమిరి ప్రధాని మోదీ ఓదార్చడం, అనూహ్యంగా న్యాయస్థానం ఆదేశాలతో శశికళ జైలుకు పోవడం, పళని%-%పన్నీరు వైరాలు, న్యాయపోరాటాలు, తరువాత కరచాలనాలు, వెన్నుపోట్లు ఇత్యాది పరిణామాలు అన్నాడీఎంకెను ఎంతగా బలహీనపరిచాయో తెలియందేమీ కాదు. తెరవెనుక బీజేపీ ఉన్నదనీ, తమిళనాడులో ప్రత్యక్షంగా కాలూనడానికి వీలుగా అమ్మ పార్టీని అదే బలహీనపరచిందని చాలామంది నమ్మకం. అదేతరహాలో అన్నాడీఎంకెను మళ్ళీ చీల్చడానికి అన్నామలై పావులు కదుపుతున్నారన్న అనుమానాల నేపథ్యంలో వేరుపడిన ఈ రెండుపార్టీలు, ఇప్పుడు మళ్ళీ చేయిచేయీ కలిపి పోరాడాలని నిర్ణయించుకున్నాయి. అన్నామలై స్థానంలోకి అన్నాడీఎంకె మాజీ నాయకుడైన నయనార్ నాగేంద్రన్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా వచ్చి మార్గాన్ని సుగమం చేశారు. అత్యంత బలంగా ఉన్న డీఎంకెను ఓడించడానికి ఉభయపక్షాలకు ఈ పొత్తు ముఖ్యం. మరీముఖ్యంగా, తమిళనాడులో కాలూనడం అంత సులభం కాదని ఈ పదేళ్ళకాలంలో తత్వం బోధపడిన బీజేపీకి అన్నాడీఎంకె ఊతం మరీ అవసరం. గత మూడు ఎన్నికల్లోనూ అంతగా లబ్ధిపొందని ఈ కూటమి కేవలం ఏడాదిలో ప్రజలను తనవైపు ఏమేరకు తిప్పుకోగలదో చూడాలి.

## ఈ ఆచారాలు పాటిస్తే చాలు.. లక్ష్మీదేవి ఆశీస్సులు మీతోనే..



ఇంట్లో ఆనందం, శ్రేయస్సు, సంపదను కాపాడుకోవడానికి కొన్ని శుభప్రదమైన ఆచారాలను పాటించడం అవసరం. పురాణాల ప్రకారం, కొన్ని అలవాట్లు లక్ష్మీ దేవిని ఆకర్షిస్తే, కొన్ని తప్పులు ఆమెను కృప నుండి దూరం చేస్తాయి. ముఖ్యంగా మహిళలు పూర్ణిమ, అమావాస్య నాడు ఇంట్లో పరిశుభ్రతను పాటిస్తే, పూజలు చేసి, ఉపవాసాలు పాటిస్తే, వారికి శుభ ఫలితాలు లభిస్తాయి. మహిళలు లక్ష్మీదేవి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం..

ఇంటిని శుభ్రంగా ఉంచండి
మంచి శక్తిని ఆకర్షించడంలో ఇంటి పరిశుభ్రత ఒక ముఖ్యమైన అంశం. ముఖ్యంగా ఉదయం ఇంటిని శుభ్రం చేయడం వల్ల సంపద నిలుపుకోవడంలో సహాయపడుతుందని నమ్ముతారు. ప్రతిరోజూ తులసి మొక్కను పూజించి, దాని దగ్గర దీపం వెలిగించడం కూడా శుభప్రదం.

**సూర్యభగవానుడికి నీటిని సమర్పించండి**
ఉదయం సూర్య భగవానుడికి నీరు నైవేద్యం పెట్టడం వల్ల ఇంటికి శుభం కలుగుతుందని నమ్ముతారు. పూర్ణిమ, అమావాస్య నాడు ఇంటి తలుపు దగ్గర స్వస్తిక గుర్తును ఉంచి, దీపం వెలిగించడం ద్వారా ఇంట్లో సంపద, శ్రేయస్సు పెరుగుతుందని చెబుతారు.

ప్రతిరోజూ దేవుడిని పూజించడం
ప్రతిరోజూ దేవుడిని పూజించడం, దీపం వెలిగించడం వల్ల ఇంటికి శాంతి లభిస్తుంది. ప్రతికూల ఆలోచనలను దూరంగా ఉంచడం ద్వారా, ఆధ్యాత్మికంగా సానుకూల శక్తిని పెంచడం ద్వారా ఇంట్లో ఆనందం, శ్రేయస్సు పెరుగుతాయి.

విప్పిన జుట్టుతో తిరగడం శుభం కాదు
సాయంత్రం వేళల్లో జుట్టు విప్పుకుని ఇంట్లో తిరగడం శుభం కాదని పెద్దలు చెబుతారు. ఇది ప్రతికూల శక్తిని ఆకర్షిస్తుందని, ఇంట్లోని శుభ వాతావరణాన్ని తగ్గిస్తుందని నమ్ముతారు. కాబట్టి, సాయంత్రం వేళల్లో విప్పిన జుట్టుతో ఇంట్లో తిరగకూడదు.

**తలుపు దగ్గర కూర్చోవద్దు**
ఇంటి ప్రధాన ద్వారం మంచి శక్తులు ప్రవేశించే మార్గం. అక్కడ కూర్చోవడం వల్ల అదృష్టానికి ఆటంకం కలుగుతుందని అంటారు. ముఖ్యంగా ప్రధాన ద్వారం దగ్గర కూర్చుని ఎక్కువ సమయం తినే మహిళలు తమ ఇంట్లో ఆర్థిక సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని వాస్తు నిపుణులు అంటున్నారు.

**ఆలస్యంగా నిద్ర లేవడం**
ఉదయం త్వరగా నిద్ర లేవడం శరీరానికి మాత్రమే కాదు, మనసుకు కూడా ప్రశాంతతను ఇస్తుంది. తెల్లవారుజామున నిద్రలేవడం శుభప్రదమని పురాతన కాలం నుండి పెద్దలు చెబుతూ వస్తున్నారు. మీరు ఆలస్యంగా మేల్కొంటే, మీరు రోజంతా అలసిపోయినట్లు అనిపించడమే కాకుండా, సమయానికి మీ పనిపై దృష్టి పెట్టలేరు. ముఖ్యంగా సూర్యోదయంలో మేల్కొనడం ఆరోగ్యానికి, ఆధ్యాత్మికతకు మంచిదని చెబుతారు. దీన్ని మనం అలవాటు చేసుకుంటే, రోజంతా సంతోషంగా ఉంటాం.



## జుట్టుకు చేటు..

వేసవిలో చెమట ఎక్కువగా పడుతుంది. దాంతో రోజుకు రెండుసార్లయినా స్నానం చేయాల్సి వస్తుంది. కొందరికి ఎండల్లో ప్రతిరోజూ తలస్నానం చేయడం అలవాటు ఉంటుంది. అయితే, ఇలా రోజూ తలస్నానం చేయడం.. జుట్టుకు చేటు చేస్తుంది. అలాకాకుండా ఉండాలంటే.. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. తలస్నానానికి ముందే జుట్టును చిక్కులు లేకుండా బాగా దువ్వుకోవాలి. దీనివల్ల జుట్టు రాలడం తగ్గుతుంది. బిరుసుగా ఉండే వెంట్రుకలు తెగిపోకుండా ఉంటాయి.

చాలామందికి తలస్నానం అంటే.. ఏదో ఒక షాంపూతో జుట్టును కడిగేసుకోవడమే! కానీ, తలస్నానం చేశాక జుట్టుకు కండిషనర్ రాసుకోవడం అన్నిటికన్నా ముఖ్యం. కండిషనర్‌తో వెంట్రుకల చివర్లు



చిట్లకుండా కాపాడుకోవచ్చు. కురులు తేమను కోల్పోకుండా, మృదువుగా ఉంచడంలోనూ కండిషనర్ ముందుంటుంది.

ఇక తలస్నానం కాగానే.. జుట్టును దువ్వడం చేయకూడదు. తలస్నానం తర్వాత కుదుళ్లు మెత్తబడి ఉంటాయి. ఇలాంటప్పుడు తల దువ్వితే.. వెంట్రుకలు ఎక్కువగా రాలిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే.. జుట్టు బాగా ఆరిన తర్వాతే దువ్వెనకు పనిచెప్పాలి.

జుట్టును ఆరబెట్టుకోవడానికి డ్రయర్స్, బ్లోయర్స్ వంటివి వాడటం కూడా మంచిదికాదు. వీటివల్ల జుట్టు

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ | సోమవారం | 21 । ఏప్రిల్ । 2025

# ఆయిల్ ఫుడ్ తిన్నాక కొన్ని పనులు తప్పనిసరిగా చేయాలి లేదంటే కొలెస్ట్రాల్ అమాంతం పెరిగిపోతుంది



కొందరికి ఆయిల్ ఫుడ్ లేనిదే ముద్ద దిగదు. ఏదో రకంగా ఫ్రైలు, ఎక్కువ నూనెతో తయారు చేసిన స్నాక్స్ రోజూ తింటారు. పిజ్జా, బర్గర్, ఫ్రెంచ్ ఫ్రైస్, స్వీట్స్ ఇలాంటివన్నీ లాగించేస్తారు. ఇవి తినడం వల్ల రోజంతా అన్ ఈజీగా ఉంటుంది. తొందరగా జీర్ణం కాక ఇబ్బంది పడతారు. అందుకు కారణం..ఈ ఆహార పదార్థాల్లో కేలరీలు అధికంగా ఉండడమే. ఒకేసారి అంత మొత్తంలో కేలరీలున్న ఫుడ్ తింటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. అయితే ఈ ఎఫెక్ట్ పడకుండా ఉండాలంటే ఆయిల్ ఫుడ్ తిన్నాక కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

దీన్ని ఒక్కసారి తినండి మీ పురుష బలం 10 రెట్లు పెరుగుతుంది.

ఆయిల్ ఫుడ్ టేస్టీగానే ఉంటుంది. కానీ అదే పనిగా తింటూ పోతే అనారోగ్యాలు వస్తాయి. అందులో ఉండే అధిక కొవ్వు, ప్రొటీన్ ని జీర్ణ వ్యవస్థ త్వరగా జీర్ణం చేసుకోలేదు. ఫలితంగా కడుపు ఉబ్బరం, గ్యాస్ లాంటి సమస్యలు తలెత్తుతాయి. అయితే..ఈ సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా ఉండాలంటే ఆయిల్ ఫుడ్ తిన్న తరవాత కొన్ని పనులు చేయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే పొట్ట టైట్ గా కాకుండా లైట్ గా ఉంటుంది.

సరదాగా ఫ్రెండ్స్ తో అలా కాసేపు బయటకు వెళ్తాం. రోడ్డుపైన నడుస్తుంటే పక్కనే మిర్చిబజ్జీ బండి కనబడుతుంది. ఎంత వద్దనుకున్నా మనసు లాగేస్తుంది. వద్దు వద్దు అనుకుంటూనే తినేస్తాం. ఆ తరవాత ఇబ్బంది పడతాం. ఏ నిపుణులైనా, వైద్యులైనా మొట్టమొదట చెప్పే ఆరోగ్య సూత్రం..ఆయిల్ ఫుడ్ తగ్గించడం. నూనెలో వేయించిన ఫుడ్స్ ని తినడం తగ్గిస్తే సగం రోగాలు తగ్గిపోతాయని అంటారు. ముఖ్యంగా బయట చిరుతిండ్లు తిన్నప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలి. కేవలం రుచి కోసమే చూసుకుంటే ఆ తరవాత అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుంది. అయితే.. కొందరికి ఆయిల్ ఫుడ్ లేనిదే ముద్ద దిగదు. ఏదో రకంగా ఫ్రైలు, ఎక్కువ నూనెతో తయారు చేసిన స్నాక్స్ రోజూ తింటారు. పిజ్జా, బర్గర్, ఫ్రెంచ్ ఫ్రైస్, స్వీట్స్ ఇలాంటివన్నీ లాగించేస్తారు. ఇవి తినడం వల్ల రోజంతా అన్ ఈజీగా ఉంటుంది. తొందరగా జీర్ణం కాక ఇబ్బంది పడతారు. అందుకు కారణం..ఈ ఆహార పదార్థాల్లో కేలరీలు అధికంగా ఉండడమే. ఒకేసారి అంత మొత్తంలో కేలరీలున్న ఫుడ్ తింటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. అయితే ఈ ఎఫెక్ట్ పడకుండా ఉండాలంటే ఆయిల్ ఫుడ్ తిన్నాక కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

**గోరు వెచ్చని నీళ్లు**

విపరీతంగా ఆయిల్ ఫుడ్ తిన్న తరవాత పొట్టంతా టైట్ అయిపోతుంది. ఏదో భారంగా అనిపిస్తుంది. కొన్ని సార్లు కడుపు ఉబ్బరంతో ఇబ్బంది



పడతారు. అలాంటప్పుడు గోరువెచ్చని నీళ్లు తాగడం మంచిది. ఆయిల్ ఫుడ్ తీసుకున్నప్పుడు అందులో ఉండే ప్రొటీన్ ఎక్కువగా ఉండడం వల్ల తొందరగా జీర్ణం అవదు. ఎప్పుడైతే గోరు వెచ్చని నీళ్లు తీసుకున్నామో అవి ప్రొటీన్ ని కాస్త పల్చబారేలా చేస్తాయి. వాటిని ముక్కలుగా చేసి సులువుగా జీర్ణమయ్యేందుకు తోడ్పడతాయి. ఆయిల్ ఫుడ్ తినగానే కొంత మంది దాహం తీరక చల్లని నీళ్లు తాగుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. వాటికి బదులుగా ఇలా గోరు వెచ్చని నీళ్లు తీసుకుంటే ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.

**కాసేపు వాకింగ్**

విపరీతంగా ఆయిల్ ఫుడ్ తీసుకున్నప్పుడు జీర్ణ వ్యవస్థపై ఒత్తిడి పడుతుంది. అది యాక్టివ్ అవ్వాలంటే కచ్చితంగా వాకింగ్ చేయాలి. ఆయిల్ ఫుడ్ తీసుకున్నాక కనీసం అరగంట పాటు నడిస్తే చాలా వరకూ ప్రభావం తగ్గుతుంది. అంతే కాదు. కడుపు నిండా భోజనం చేసిన తరవాత బాడీ ఎంత యాక్టివ్ గా ఉంటే అంత మంచిది. బరువు తగ్గాలనుకున్న వాళ్లు తిన్న వెంటనే అరగంట పాటు వాకింగ్ చేస్తే మంచి ఫలితాలుంటాయని వరల్డ్ జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వెల్లడించింది. అందుకే..ఆయిల్ ఫుడ్ తిన్నాక తప్పనిసరిగా వాకింగ్ చేయాలి. డయాబెటిస్ ఉన్న వాళ్లకీ ఇదే సలహా ఇస్తున్నారు వైద్యులు. తిన్నాక ఏ కదలికా లేకుండా కూర్చుంటే బ్లడ్ లో షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదముంటుంది. ఇలా పెరగకుండా ఉండాలంటే కనీసం ఓ పావుగంట అయినా నెమ్మదిగా నడవాలని సూచిస్తున్నారు.

**ఓ పూట తినడం మానేయాలి**

ఉదయం హెవీగా ఆయిల్ ఫుడ్ తీసుకుంటే రోజంతా అలా భారంగానే ఉంటుంది. ఇంకేమీ తినబుద్ధి కాదు. ఒకవేళ తినాలనిపించినా ఓ పూట ఉపవాసం ఉండడమే మంచిది. అంత ఆయిల్ ఫుడ్ తిన్నాక బాడీ రీసెట్ అవడానికి టైమ్ పడుతుంది. అలా రీసెట్ అయ్యే టైమ్ లో మళ్లీ తింటే జీర్ణ వ్యవస్థ పూర్తిగా పని చేయకుండా పోతుంది. అందుకే ఉదయం ఆయిల్ ఫుడ్ తింటే మధ్యాహ్నం భోజనం మానేయాలి. రాత్రికి కూడా సలాడ్స్ లేదా లైట్ ఫుడ్ తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆహారం జీర్ణమైపోతుంది.

**పండ్లు తినడం బెటర్**

ఆయిల్ ఫుడ్ లో ఫైబర్, పోషకాలు ఉండవు. అయితే..ఈ రెండే జీర్ణ వ్యవస్థకు ముఖ్యం. మరి ఆయిల్ ఫుడ్ తినక తప్పదు అనుకుంటే ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం ముందుగా తీసుకోవాలి. అంటే..ఉదయం కచ్చితంగా సలాడ్ లేదా పండ్ల ముక్కలు తినాలి. ఉడకబెట్టిన కూరగాయ ముక్కలు తిన్నా మంచిదే. ఇలా చేయడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందడంతో పాటు ఫైబర్ కూడా అందుతుంది. తద్వారా జీర్ణ వ్యవస్థ యాక్టివ్ గా ఉంటుంది. ఆ తరవాత ఆయిల్ ఫుడ్ తిన్నా మరీ అంత భారంగా అనిపించదు.

**పెరుగు తినాలి**

కొన్ని సార్లు తప్పనిసరి పరిస్థితుల్లో వరుసగా ఆయిల్ ఫుడ్ తినాల్సి వస్తుంది. అలాంటప్పుడు పొట్ట పాడు కాకుండా ఉండాలంటే పెరుగు తినాలి. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ పొట్టలో ఎంజైమ్స్ ని యాక్టివ్ చేస్తాయి. ఇవి ఆహారం జీర్ణం అయ్యేందుకు సహకరిస్తాయి. అందుకే ఆయిల్ ఫుడ్ తినాల్సి వచ్చినప్పుడు కచ్చితంగా పెరుగు తినాలి. ఆయిల్ ఫుడ్ తిన్న వెంటనే మత్తుగా అనిపిస్తుంది. చాలా మంది అలా అనిపించగానే కునుకు తీస్తారు. కానీ దీని వల్ల అనారోగ్యాలు వస్తాయి. ఇలా నిద్రపోవడం వల్ల ఆహారంలోని కొవ్వు ఎలా పడితే అలా పేరుకుపోతుంది. ఫలితంగా గ్యాస్, రిఫ్లక్స్ లాంటి సమస్యలు వస్తాయి. ఇది క్రమంగా గుండె జబ్బులకూ దారి తీస్తుంది. కొలెస్ట్రాల్ విపరీతంగా పెరిగిపోతుంది.

# మూడంటే మూడు ఫాలో అయితే అధిక బరువు వంటి ఎన్నో సమస్యలు దూరం



మన చర్మాన్ని ఎప్పటికప్పుడు రోజు క్లీన్ చేస్తుంటాం. దీంతో చర్మ సమస్యలు ఎలాంటివి రావు. హాయిగా ఉంటుంది. అదే విధంగా, బాడీని కూడా లోపల్నుంచి కచ్చితంగా క్లీన్ చేయాలి. దీని వల్ల కూడా బాడీలో వ్యాధికారక క్రిములు, బ్యాక్టీరియా, టాక్సిన్స్ అన్నీ కూడా దూరమవుతాయి. అందుకోసమే రెగ్యులర్‌గా బాడీని డీటాక్స్ చేయడం మంచిది.

నిజానికీ ప్రతిరోజూ బాడీలో ఎన్నో రకాల పనులు జరుగుతాయి. ఇవి జరిగినప్పుడు బాడీలో కొన్ని విషపదార్థాలు ఏర్పడతాయి. అదే విధంగా మనం పొల్యూషన్‌లో తిరగడం, పొగాకు, మద్యం తీసుకోవడం, జంక్ ఫుడ్‌ని జంకులేకుండా తినడం వంటివి చేస్తుంటాం. దీంతో బాడీలో మరిన్నీ టాక్సిన్స్ పెరిగిపోతాయి. వీటన్నింటిని మనం సరిగా క్లీన్ చేయాలి. దీనికోసం అమెరికన్ డాక్టర్ జోష్ యాక్సే 3 బెస్ట్ డ్రింక్స్ సూచించాడు. పైగా ఇవన్నీ కూడా ఇంట్లోనే హ్యాపీగా చేసేసుకుని తాగొచ్చు. వాటి కారణంగా బాడీ డీటాక్స్ అయి వ్యాధికారకాలు బాడీ నుంచి బయటికెళ్లిపోతాయి.

**నిమ్మనీరు**

ఇది మనకి తెలిసిన రెగ్యులర్ డ్రింక్. చాలా మంది ఉదయం లేవగానే ఈ డ్రింక్‌ని తాగుతుంటారు కూడా. దీనికోసం లేవగానే కాస్తా గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగండి. దీంతో బాడీ డీటాక్స్ అవుతుంది. బాడీ అవ్వడమే కాదు. స్కిన్ కూడా డీటాక్స్ అయి మెరుస్తుంది.

**తిన్న తర్వాత**

మనం తీసుకున్న ఆహారం జీర్ణమైన తర్వాత ఎన్నో విషపదార్థాలు ఏర్పడతాయి వాటిని తొలగించడం కూడా చాలా ముఖ్యం. తిన్న 30 నిమిషాల తర్వాత 1 గ్లాసు నీటిలో 1 టీ స్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి తీసుకోండి. దీని వల్ల కూడా బాడీ డీటాక్స్ అవుతుంది.

**ఫర్మెంటెడ్ ఫుడ్స్**

మన డైట్‌లో ఎక్కువగా పులియబెట్టిన ఫుడ్స్ తీసుకోండి. పులియబెట్టిన ఆహారాలనేవి మన దగ్గర, అమెరికాలో డిఫరెంట్‌గా ఉంటాయి. మీరు మీకు అందుబాటులో ఉండేవి తీసుకోండి. డాక్టర్ చెప్పేది మాత్రం సౌర్ క్రాట్, కిమ్చి, మిసో, కొకనట్ యోగర్ట్ వంటివి తీసుకోవచ్చు. అదే విధంగా, మనకి రెగ్యులర్ దొరికే పెరుగు కూడా తీసుకోవచ్చు. దీని వల్ల కూడా చాలా వరకూ బాడీలోని టాక్సిన్స్ దూరమవుతాయి.

**వీటితో పాటు**

అదే విధంగా, నీరు ఎక్కువగా తాగాలి. వీటి వల్ల కూడా బాడీలోని టాక్సిన్స్ అన్నీ కూడా బయటికి చెమట, మూత్ర రూపంలో వెళ్లిపోతాయి.

యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు, నట్స్, గింజలు ఎక్కువగా తీసుకోవాలి.

హెర్బల్ టీలు కూడా మనకి హెల్ప్ చేస్తాయి. ఇందుకోసం డాండలెన్, గ్రీన్ టీ వంటివి తీసుకోవచ్చు.

అల్లంలో కూడా డీటాక్సీఫైయింగ్ ఏజెంట్ ఉంటుంది. కాబట్టి, దీనిని కూడా తీసుకోవచ్చు. దీని వల్ల కూడా బాడీ డీటాక్స్ అవుతుంది.

బీట్‌రూట్ తీసుకోవడం వల్ల కూడా బ్లడ్ ప్యూరిఫై అవుతుంది. ఈ కారణంగా లివర్ డీటాక్స్ అవుతుంది.





## బుజ్జాయికి బొజ్జనిండుగా!

పసిపిల్లలకు ఏం పెట్టవచ్చు.. ఏం పెట్టకూడదు అనే విషయంలో బోలెడు సందేహాలు. పెట్టే ఆహారం సరైంది కాకపోతే చిన్నారి ఆరోగ్యానికే ఇబ్బంది. అందుకే వారికి ఏడాది నిండేవరకు ఎప్పుడు ఎలాంటి ఆహారం అందివ్వాలో తెలుసుకోవడం మంచిది. లిపసిపిల్లలకు తల్లిపాలు ఎంత అవసరం. అవి అందనప్పుడు ప్రత్యామ్నాయం ఏంటి? పసిపిల్లలు తల్లిపాలు ఎంత తాగితే అంత తాగించడం మంచిది. ఒకవేళ తల్లిపాలు అందకపోతే వారికి పాల పొడులు ఉత్తమం. గేదె, ఆవు పాలలో ప్రొటీన్, ఫ్యాట్.. ఎక్కువగా ఉంటాయి. నిజానికి వీరికి ప్రొటీన్ మరీ అంత అవసరం ఉండదు. పైగా కొందరు శిశువులకి ప్రొటీన్ అలర్జీ ఉండొచ్చు. జీర్ణవ్యవస్థ సమస్యలు రావచ్చు. అందుకే ఏడాది నిండాకే గేదె, ఆవు పాలు పట్టాలి. ఎన్నో నెల నుంచి ఇతర ఆహార పదార్థాలను పెట్టొచ్చు?

ఆరు నెలల తరవాత ఘన పదార్థాలను ఇవ్వడం మొదలుపెట్టాలి. బియ్యం జావ మొదట అలవాటు చేయాలి. అది తేలిగ్గా అరుగుతుంది. దాన్ని ఎలా తయారు చేయాలంటే... ముందుగా బియ్యాన్ని ఓ ఆరు గంటలు నానబెట్టి... తరువాత నీడలో ఆరబెట్టి పొడి చేయాలి. బియ్యం నానడం వల్ల త్వరగా అరుగుతుంది. ఈ పొడిలో నీళ్లు కలిపి జావలా కాయాలి. ఇది ఎంత పల్చగా ఉంటే అంత మంచిది. ఉగ్గు అనేది ఎనిమిది నెలల తరువాత పెట్టాలి. దీనికోసం మూడు కప్పుల బియ్యానికి కప్పు పప్పు తీసుకోవాలి. వీటిని రాత్రంతా నానబెట్టి ఆతరువాత ఆరబెట్టి పొడి చేసుకోవాలి. దీన్ని ఉడికించి పెట్టొచ్చు. దీంతోపాటు పసిపిల్లలకు రాగులు చాలా మంచివి. వీటిని మొలకలు కట్టించి... కాస్త వేయించి పొడి చేసి జల్లించాలి. దీన్ని జావలా చేసి అందివ్వాలి. ఇలా ఇవ్వడం వల్ల ఆకలి పెంచే ఏఆర్ఎస్ అనే ఎంజైము జీర్ణాశయంలో విడుదలవుతుంది. అలానే చిన్నారులకు ఏ చిరుధాన్యాలు పెట్టినా ఇలానే మొలకలు కట్టించి ఇవ్వాలి. అన్నీ ఒకేసారి కాకుండా ఒకదాని తరువాత మరొకటి పెంచుకుంటే మంచిది. అలానే ఎనిమిదో నెల నుంచీ పొట్టుతీసి సన్నగా తురిమిన బంగాళాదుంప, క్యారెట్ వంటివీ ఈ జావలో కలపొచ్చు. బాగా పండిన అరటి, సపోట, బొప్పాయి మంచివి. ఏడో నెల నుంచి ఈ పండ్లు అలవాటు చేయొచ్చు. తొమ్మిదో నెల రాగానే ఉడికించిన గుడ్డులోని పసుపు సొన పెట్టాలి. తొలిసారి రెండు చెంచాలు తినిపించాలి. వారికి పడుతుందో లేదో ఓ రెండుమూడు రోజులు గమనించాలి. పన్నెండు నెలలు నిండాక పూర్తిగా గుడ్డును పెట్టొచ్చు. అలానే చేపలు కూడా ఏడాది నిండాకే అలవాటు చేయాలి. డీహైడ్రేషన్ రాకుండా నీళ్లు తాగించమంటారు ఎప్పట్నుంచీ అలవాటు చేయాలి? ..తల్లిపాలు తాగే పిల్లలకు ఆరు నెలల వరకూ నీళ్లేమీ తాగించాల్సిన అవసరం లేదు. పోత పాల పిల్లలకు కాచి చల్లార్చిన నీళ్లు మధ్య మధ్యలో ఇస్తూనే ఉండాలి. ఏడో నెల నుంచైతే ఏ చిన్నారులకైనా పప్పులు, కూరగాయలు ఉడికించిన నీళ్లు తాగించడం అలవాటు చేయాలి. వాటిలో ఎన్నో పోషకాలు ఉంటాయి.


వీటిని అంత త్వరగా ఇష్టపడరు కానీ.. తప్పనిసరిగా తాగించాలి.

అన్నం ఎప్పుడెప్పుడు తినిపిస్తే మంచిది? ఎంత తినిపించాలి?

మొదట్లో పావు కప్పు పెడితే సరిపోతుంది. పప్పు కూడా కలిపి పెట్టినా ఫర్వాలేదు. ఉదయం సాయంత్రం పెట్టొచ్చు. ఆరుగంటలకోసారి అన్నంతో చేసిన ఏ పదార్థం తినిపించినా ఫర్వాలేదు. సాయంత్రం ఏడు గంటలు దాటాక మాత్రం చిన్నారులకు అన్నం పెట్టకూడదు. అంత త్వరగా అరగకపోవచ్చు.

# జాపత్రి

## ఉపయోగాలేంటో తెలుసా..!



జాపత్రి అని పిలిచే ఇది జాజికాయ విత్తనం. మిరిస్టికా ఫ్రాగ్రాన్స్ ఈ కాయం ఎర్రటి బయటి పొరను తీసి సుగంధ ద్రవ్యాలలో వాడతారు. చాలా రకాల వంటకాల్లో మసాలాగా వినియోగిస్తారు. దీనితో ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం.

**జీర్ణక్రియలో సహాయపడుతుంది..**

జాపత్రి జీర్ణ లక్షణాలున్నాయి. కొన్ని సార్లు అజీర్ణం, అపాన వాయువు వంటి జీర్ణ సమస్యలను తగ్గించేందుకు దీనిని ఉపయోగిస్తారు. అలాగే జీర్ణ క్రియను ఉత్తేజ పరచడంలో కూడా జాపత్రి సహకరిస్తుంది. ఇది కడుపు నొప్పి, అసౌకర్యాన్ని కూడా తగ్గిస్తుంది. జాపత్రి ప్రేగులలో మంటను తగ్గిస్తుంది. జీర్ణ సమస్యలలో సహాయపడుతుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది..**

జపత్రిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇవి వ్యాధులు, ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతే కాదు, ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ కాలం యవ్వనంగా ఉండే విధంగా సహకరిస్తాయి.

**ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు...**

కొన్ని సాంప్రదాయ పద్దతుల్లో జాపత్రిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలలో ముఖ్యంగా వాపు తగ్గించే లక్షణాలున్నాయి. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే జావిత్రి వంటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల, శరీరానికి ఆరోగ్యంగా బలంగా ఉండటానికి అవసరమైన అదనపు రక్షణను ఇస్తాయి.


**రక్త ప్రసరణ మెరుగు...**

రక్త ప్రసరణను మెరుగుపరచడంలో జాపత్రి కూడా అద్భుతమైనది. ఈ మసాలాను తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన చర్మ నిగారింపుకు ఇది చాలా ముఖ్యం. సరైన గుండె పనితీరుకు మంచి రక్త ప్రసరణకు కూడా చాలా ముఖ్యమైనది. బలమైన రక్త ప్రసరణను అందించడంలో ఆరోగ్యకరమైన గుండెకు జపత్రి సహాయం చేస్తుంది. జపత్రిలో రక్తనాళాలను విస్తరించేందుకు, రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడానికి సహాయపడే సమ్మేళనాలు ఉన్నాయని పరిశోధనలో తేలింది, ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

**దంత ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది..**

జాపత్రి దంతాలకు మంచిది. ఇది చిగుళ్ళ నొప్పి, పంటి నొప్పులు,నోటి దుర్వాసనతో సహాయపడుతుంది. ఇది నోటి దుర్వాసనతో పోరాడుతుంది. అంతే కాదు జపత్రిలో బ్యాక్టీరియాను చంపి, నోటిలో మంటను తగ్గించే సమ్మేళనాలు ఉన్నాయి.

జలుబు, దగ్గుకు చికిత్స..రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో జావిత్రి ఎంతో శక్తివంతమైనది. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, వైరస్‌ల వల్ల వచ్చే ఇతర అనారోగ్యాల నుండి కాపాడుతుంది. శరీరం, సహజ రక్షణను బలోపేతం చేయడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి పని చేస్తుంది.



## విలక్షణ నక్షి

తరాలు మారినా మహిళలకు, ఆభరణాలకు ఉండే అనుబంధం ఎప్పటికీ ప్రత్యేకమే. నాగరికత ఎంత పెరిగినా సంస్కృతి, సంప్రదాయాల ఆభరణాలకే మొగ్గు చూపుతారు అతివలు. అందుకే ప్రాచీన సంప్రదాయ ఆభరణాలకు ఆధునికతను జోడిస్తూ కొత్త డిజైన్లతో మహిళలను ఆకట్టుకుంటున్నారు తయారీదారులు. నయా నగిషీలు అద్దుకున్న నక్షి నగలు ఈ తరాన్ని తెగ ఆకర్షిస్తున్నాయి. రాయల కాలం నాడు ప్రత్యేకత చాటుకున్న ఈ నగలు మళ్లీ ఇప్పుడు మగువల మేనిపై రాయల్‌గా మెరిసిపోతున్నాయి.

నక్షి ఆభరణాల మూలాలు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో కనిపిస్తాయి. ఈ నగల రూపకల్పన చాలా సంక్లిష్టంగా ఉంటుంది. 'నక్షి' అనే పదం 'నక్ష' నుంచి వచ్చింది. నక్ష అంటే నమూనా, డిజైన్ అని అర్థం. దక్కన్ సాంస్కృతిక వారసత్వంలో లోతుగా పాతుకుపోయిన 'నక్షి' నగలు కాలానికి తగ్గట్టుగా నయా రూపాలు సంతరించుకున్నాయి. ఈ ఆభరణాల తయారీకి వాడే ప్రధాన లోహం బంగారం. సూక్ష్మంగా చెక్కే

నగిషీలు నగలకు మరింత వన్నె తెస్తాయి.

ప్రస్తుతం బంగారంతోపాటు పోతపోసినవీ అందుబాటులో ఉన్నాయి. పైగా వీటి తయారీలో ప్రకృతి అందాలకు ప్రాముఖ్యం ఎక్కువగా కనిపిస్తుంది. పూలు, పండ్లు, పక్షులు, ఏనుగులతోపాటు వివిధ జ్యామితీయ ఆకారాలనూ ఈ నగల్లో నిగనిగలాడిస్తున్నారు డిజైనర్లు. ముత్యాలు, నవరత్నాలు పొదిగిన వెరైటీలు కూడా అందుబాటులో ఉన్నాయి. పెండ్లిళ్లు, పండగల వంటి సంప్రదాయ వేడుకల్లో ధరించే దుస్తులపైకి నక్షి నగలు చక్కని ఎంపిక. వన్‌గ్రామ్ గోల్డ్‌లోనూ ఇవి అందుబాటులో ఉన్నాయి. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ ఓసారి ట్రై చేసి చూడండి!





# దూసుకెళ్తున్న బంగారం ధరలు.. 4 నెలల్లోనే బంపర్ జంప్..



**న్యూఢిల్లీ–నవభూమి:**బంగారం ధరలు ఈ ఏడాదిలో ఇప్పటివరకు అద్భుతమైన ప్రదర్శనను కనబర్చాయి. ఈ క్రమంలో ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో బంగారం 25 శాతం పెరుగగా, %వీజ౩, జూవీజు౩% మార్కెట్లలో సరికొత్త గరిష్ట స్థాయిలను చేరుకుంది. అదే సమయంలో వెండి కూడా లో 15 శాతం లాభాన్ని సాధించింది. ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ప్రమాదాలు, అమెరికా, చైనా మధ్య వ్యాపార ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షితమైన గోల్డ్ పెట్టుబడులపై ఆసక్తి చూపించారు. దీంతో పసిడి రేట్లు పైపైకి చేరాయి.టెక్నికల్ స్థాయిల ప్రకారం, %వీజ౩%లో బంగారం ధర రూ. 91,000 (10 గ్రాముల కోసం) ఉండగా, రూ. 99,000 వద్ద ప్రతిఘటన స్థాయిలు ఉన్నాయని మోతీలాల్ ఓస్వాల్ పేర్కొంది. %జూవీజు౩%లో ముఖ్యమైన స్థాయిలు %ఖుణ 3,100, ఖుణ% 3,400 ఉండగా, ఈ స్థాయిలు సాధారణ స్థితిలో ఉండే అవకాశమున్నట్లు తెలిపారు. బంగారం పెరుగుదలకు ప్రధాన కారణం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వ్యాపార ఉద్రిక్తతలు, మదుపరుల అవసరాలు, కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు కూడా ఓ కారణమని నిపుణులు చెబుతున్నారు.

రక్షణ కోసం బంగారం..ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు, మాంద్యం భయాందోళన కొనసాగుతున్న నేపథ్యంలో అనేక మంది ఇన్వెస్టర్లు బంగారాన్ని మంచి పెట్టుబడిగా భావిస్తున్నారు. విభిన్న వ్యాపార సవాళ్లు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అనిశ్చితమైన రాజకీయ పరిస్థితుల మధ్య, బంగారం ధరలు పైపైకి చేరుతున్నాయి. ఇదే సమయంలో కేంద్ర బ్యాంకులు తమ రిజర్వులను పెంచుతుండగా, పెట్టుబడిదారులు సురక్షిత వనరుల కోసం బంగారాన్ని ఎంచుకుంటున్నారు.

## రూ.10 కోట్లు, 50 కోట్లు.. దర్జాగా బతికేందుకు ఎంత డబ్బు కావాలి?



**న్యూఢిల్లీ–నవభూమి:**'నా దగ్గర రూ.10 కోట్లు ఉంటే నా లైఫ్ సెట్ రా' అనే మాట మీరు చాలా సార్లు వినే ఉంటారు. లేదా మీరు కూడా కొన్నిసార్లు అనే ఉంటారు. కానీ, ఫైనాన్షియల్ ఫ్రీడమ్ సాధించేందుకు రూ.10 కోట్లు, రూ.50 కోట్లు కచ్చితంగా సరిపోతాయా? అంటే కచ్చితంగా చెప్పలేం. ఈ విషయంపై దశాబ్దాలుగా చర్చ కొనసాగుతూనే ఉంది. ఒక వ్యక్తి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో జీవించేందుకు ఎంత డబ్బు కావాలి? మీరు 50 ఏళ్ల వయసులోనే రిటైర్మెంట్ అయి ఆ తర్వాత 75 ఏళ్ల వరకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ఎంత అవసరమో ఈ రూల్ ద్వారా తెలుసుకుందాం.

**స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ముఖ్యం..**

ఇప్పుడు మీరు డబ్బు పొదుపు చేస్తున్నాం కదా అని అనుకుంటే పొరపడినట్లే.. సమయం గడిచిన కొద్ది డబ్బు విలువ తగ్గిపోతుంటుంది. అందుకు ప్రధాన కారణం ఇన్‌ఫ్లేషన్. గత 20 ఏళ్ల డేటా పరిశీలిస్తే ద్రవ్యోల్బణం సగటున 5–6 శాతంగా ఉంది. అంటే రూ.1 లక్ష విలువ 10–15 ఏళ్ల తర్వాత ఆ స్థాయిలో తగ్గిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో ద్రవ్యోల్బణాన్ని మించిన రాబడులు అందించే మార్గాల్లో పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు, ఈక్విటీ పెట్టుబడులు ఏదైనా 6–7 శాతానికి మించి రాబడులు అందించాలి.

**ఆర్థిక స్వతంత్రతకు ఎంత డబ్బు కావాలి?**

ఈ ప్రశ్నకు ఆర్థిక నిపుణులు పలు సూచనలు చేశారు. ' ఫైనాన్షియల్ ఫ్రీడమ్ అనేది కేవలం మీ వద్ద ఎంత ఉంది అనేదాని గురించి కాదు.. మీ జీవితాన్ని ప్రశాంతంగా గడిపేందుకు ఎంత అవసరం అనేది ముఖ్యం. మనలో చాలా మంది ఆర్థిక స్వతంత్రత అంటే పెద్ద మొత్తంలో డబ్బులు ఉంటే సరిపోతాయని అనుకుంటారు. రూ.10 కోట్లు రూ.50 కోట్లు ఆపైన ఉండాలనుకుంటారు. అయితే అది ఆ అమౌంట్‌తో ఆగదు. మరి ఎంత కావాలి?'

**4 శాతం రూల్..**

మీ ఫైనాన్షియల్ ఫ్రీడమ్ నంబర్ = మీ ఖర్చులు 25. ఈ ఫార్ములా ప్రధానంగా 4 శాతం రూల్‌పై ఆధారపడి ఉంటుంది. మీ వద్ద ఉన్న డబ్బులను తెలివిగా పెట్టుబడి పెడితే ప్రతి ఏడాది 4 శాతం విత్ డ్రా చేసుకుంటునే మీ మూలధనం తగ్గకుండా చూసుకోగలగడం. ఒక ఉదాహరణ ద్వారా అర్థం చేసుకుందాం. మీకు నెలకు రూ.1 లక్ష అవసరం అవుతాయనుకుంటే ఏడాదికి రూ.12 లక్షలు కావాలి. అప్పుడు మీ ఫైనాన్షియల్ ఫ్రీడమ్ నంబర్ = రూ.12 లక్షలు %ఇ 25=% రూ.3 కోట్లు అవుతుంది. అంటే మీరు రూ.3 కోట్లను తెలివిగా పెట్టుబడి పెడితే అప్పుడు మీరు ప్రతి ఏడాది రూ.12 లక్షలు విత్ డ్రా చేసుకోవచ్చు. దాంతో మీరు అనుకున్న జీవితాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవచ్చు.మరి రూ.10 కోట్లు ఎందుకు కావాలి?

పెద్ద మొత్తంలో డబ్బులు కావాలనుకోవడం మంచిదే. మీ ఖర్చులు ఎక్కువగా ఉండడం, లగ్జరీ లైఫ్ స్టైల్ కావాలనుకుంటో మీ ఫైనాన్షియల్ ఫ్రీడమ్ నంబర్ రూ.10 కోట్లు, రూ.20 కోట్లు, రూ.50 కోట్లు అవుతుంది. అయితే, అది వ్యక్తులను బట్టి మారుతుంటుంది. అందుకు తగిన విధంగా పెట్టుబడి ప్లాన్ చేయాలి.

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లాభంలో 7% వృద్ధి

**హైదరాబాద్–నవభూమి:**గడచిన ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో హెచ్‌డీఎఫ‌సీ బ్యాంక్ ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. ఈ కాలానికి గాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.18,835 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023–24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 7 శాతం ఎక్కువ. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన ఈ కాలంలో రూ.17,616 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా సమీక్షా త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన మొత్తం ఆదాయం మాత్రం రూ.80,639 కోట్ల నుంచి రూ.89,488 కోట్లకు తగ్గింది. స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 1.24 శాతం నుంచి 1.33 శాతానికి పెరగా నికర ఎన్‌పీఏలు కూడా 0.33 శాతం నుంచి 0.43 శాతానికి పెరిగాయి. కాగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.22 చొప్పున (2,200 శాతం) డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

## అప్పుల భారం తగ్గించుకోండి..

**హైదరాబాద్–నవభూమి:**చలన (ఫ్లోటింగ్) వడ్డీ రేటుతో గృహ రుణాలు తీసుకున్న వారికి ఆర్‌బీఐ ఇటీవల మరోసారి శుభవార్త చెప్పింది. బ్యాంకులకు తాను ఇచ్చే స్వల్పకాలిక రుణాపై వసూలు చేసే రెపో రేటును మరో పావు (0.25) శాతం కుదించింది. దీంతో దాదాపు...

**అప్పుల భారం తగ్గించుకోండి..**

**వడ్డీ రేట్లు దిగొస్తున్నాయ్..**

దేశంలో వడ్డీ రేట్లు దిగొస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇటీవల రెపో రేటు మరో పావు శాతం తగ్గించి ఆరు శాతానికి కుదించింది. పరిస్థితులు అనుకూలిస్తే ఈ ఏడాది చివరికల్లా రెపో రేటు మరో అర శాతం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ అవకాశాన్ని గృహ రుణ భారం తగ్గించుకునేందుకు ఎలా ఉపయోగించుకోవచ్చో చూద్దాం...చలన (ఫ్లోటింగ్) వడ్డీ రేటుతో గృహ రుణాలు తీసుకున్న వారికి ఆర్‌బీఐ ఇటీవల మరోసారి శుభవార్త చెప్పింది. బ్యాంకులకు తాను ఇచ్చే స్వల్పకాలిక రుణాపై వసూలు చేసే రెపో రేటును మరో పావు (0.25) శాతం కుదించింది. దీంతో దాదాపు అన్ని బ్యాంకులు తమ రెపో ఆధారిత లేదా ఏదైనా ఇతర ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆ?ధారిత గృహ రుణాల వడ్డీ రేట్లనూ కుదిస్తున్నాయి. దాంతో ఈ రుణాల నెలవారీ వాయిదాలు (ఈఎంఐ) దిగి వస్తున్నాయి. దీన్ని అప్పుల భారం తగ్గించుకునేందుకు ఎలా ఉపయోగించుకోవచ్చో తెలుసుకుందాం.

**పాక్షిక చెల్లింపు**

ఒకవేళ చేతిలో మిగులు నిధులు ఉంటే మీ గృహ రుణంలో కొంత మొత్తాన్ని ముందే పాక్షికంగా చెల్లించడం మంచిది. కాకపోతే ఈ చెల్లింపు మీ నెలవారీ బడ్జెట్‌ను దెబ్బతీయకుండా చూసుకోవాలి. దీనివల్ల ఈఎంఐ భారం తగ్గడంతో పాటు రుణ చెల్లింపు కాల పరిమితి త్వరగా పూర్తవుతుంది.

# పాత పన్ను విధానంలోనూ.. రూ.20 లక్షల వరకు నో ట్యాక్స్.. సూపర్ ఛాన్స్?!



**న్యూఢిల్లీ–నవభూమి:**పరిమితికి మించి ఆదాయం ఉన్నప్పుడు ప్రభుత్వానికి ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానం అని రెండు రకాల పన్ను విధానాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్త పన్ను విధానంలో కీలక మార్పులు చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో పన్ను చెల్లింపుదారులకు భారీ ఉపశమనం కల్పించింది. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపులు కల్పించింది. మరోవైపు పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. పన్ను మినహాయింపు పరిమితి రూ.5 లక్షల వరకే ఉంటుంది. దీంతో ఇప్పటికే 70 శాతం మంది పన్ను చెల్లింపుదారులు కొత్త పన్ను విధానంలోకి మారిపోతున్నారు. స్టాండర్డ్ డిడక్షన్ ద్వారా కొత్త పన్ను విధానంలో రూ.12.75 లక్షల వరకు ఏ ట్యాక్స్ కట్టక్కర్లేదు.దీంతో పన్ను ఆదా పెట్టుబడులు పెట్టిన వారు, హోమ్ లోన్ తీసుకున్న వారు పాత పన్ను విధానంలో కొనసాగాలా? లేదా కొత్త విధానంలోకి మారిపోవాలా? అనే సందిగ్ధంలో ఉన్నారు. అలాంటి వారందరికీ అదిరే న్యూస్ ఇది. ఎందుకంటే మీరు పాత పన్ను విధానంలో కొనసాగుతూనే ఎలాంటి ట్యాక్స్ చెల్లించక్కర్లేదు. రూ.20 లక్షల వరకు వేతనం ఉన్నా మీరు ట్యాక్స్ కట్టకుండా ఉండొచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయంపై సీఏ చిరాగ్ చౌహాన్ సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. మీ శాలరీ రూ.20 లక్షలు ఉన్నా పాత పన్ను విధానంలోనూ ఈ ఆర్థిక సంవత్సరం 2025–26లో 70 రకాల మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవచ్చని చెబుతున్నారు. అందుకు ఒక స్మార్ట్ ప్లాన్ అవసరమని చెబుతున్నారు. మరి అది ఎలాగో తెలుసుకుందాం.

ప్రస్తుతం ఏప్రిల్ నెల చివరి వారానికి వచ్చాం. ఈ క్రమంలో వేతన జీవులు తమ టేక్ హోమ్ శాలరీ పెంచుకోవడం, ట్యాక్స్ మినహాయింపులు గరిష్ఠంగా ఎలా క్లెయిమ్ చేసుకోవాలో చెబుతూ ఓ షార్ట్ వీడియోను పోస్ట్ చేశారు సీఏ చిరాగ్ చౌహాన్. మీ సీటీసీ రూ.20 లక్షలు ఉందనుకుంటే అప్పుడు మీరు పాత పన్ను విధానంలో ఉంటూనే జీరో ట్యాక్స్ పే చేయవచ్చన్నారు. అందుకు మీ శాలరీ విధానంలో కీలక మార్పులు చేసుకోవాలని సూచించారు. ఒక ఉదాహరణ ద్వారా వివరించారు.

మీ సీటీసీ రూ.20 లక్షలను పలు విభాగాలుగా విభజించాలి. నెలకు మీ శాలరీ రూ.1.66 లక్షలు అవుతుంది. అందులే మీ బేసిక్ పే రూ.80 వేలు ఉండేలా చూసుకోవాలి. అలాగే హెచ్‌ఆర్‌ఏ రూ.40 వేలు ఉండాలి. మిగిలిన శాలరీ ఫ్లెక్సీ పేగా ఎంపిక చేసుకోవాలి. ఇందుకోసం మీ కంపెనీ హెచ్‌ఆర్‌తో సంప్రదించాలి. మీ శాలరీని పైన చెప్పిన విధంగా ఉండేలా ఫ్లెక్సీ పే ఎంచుకోవాలి. ఇలా చేసిన తర్వాత మీరు పన్ను మినహాయింపుల కోసం లీవ్ ట్రావెల్ అలవెన్స్ ఏడాదికి రూ.60 వేలు, ట్రావెల్, ఫ్యూయల్ రియంబర్స్‌మెంట్ రూ.96 వేలు, డ్రైవర్ శాలరీ రూ.1.92లక్షలు, మూవెబుల్ అసెట్స్ రూ.60 వేలు, ఇంటర్నెట్ అండ్ ఫోన్ రూ.14 వేలు, న్యూస్ పేపర్ అండ్ పీరియాడికల్స్ రూ.12000, మీల్స్ కూపన్స్, రూ. 5400 వంటివి చూడవచ్చు. వీటి ద్వారా మీకు ప్రతి ఏటా రూ.5 లక్ష వరకు మినహాయింపులు వస్తాయి.ఆ తర్వాత హౌస్ రెంట్ అలవెన్స్ ఏడాదికి రూ.4.80 లక్షలు, సెక్షన్ 80సీ ద్వారా రూ.1.50 లక్షలు, సెక్షన్ 80డీ ద్వారా రూ.70 వేలు, నేషనల్ పెన్షన్ సిస్టమ్ పెట్టుబడి ద్వారా రూ. 50 వేలు, స్టాండర్డ్ డిడక్షన్ ద్వారా రూ.50 వేలు, హౌసింగ్ లోన్ వడ్డీ రూ.50 వేలు ఇలా మొత్తంగా రూ.10 లక్షల వరకు మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. అప్పుడు పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.5 లక్షలే అవుతుంది. మీకు సెక్షన్ 87ఏ రిబేట్ రూ.12,500 వస్తాయి. అంటే రూ.5 లక్షలపైనా ఎలాంటి ట్యాక్స్ పడదు. మొత్తంగా మీ శాలరీ రూ.20 లక్షలు ఉన్నా మీకు జీరో ట్యాక్స్ పడుతుంది. మీరు ఫ్లెక్సీ పే ఉపయోగించడం ద్వారా ఇలా చేయవచ్చని చిరాగ్ చౌహాన్ తెలిపారు. అయితే, ఆయన వీడియోపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# కాగితాలకే పరిమితం




**హైదరాబాద్–నవభూమి:**పరిశ్రమల కోసం భూములను లీజుకి ఇచ్చే విధానం కాగితాలు దాటి కార్యరూపం దాల్చడంలేదు. పరిశ్రమ ఏర్పాటు చేసుకునేవారికి భూములను విక్రయించడమే కాకుండా కావాల్సినవారికి లీజుకు కూడా ఇచ్చే విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, ఇది జరిగి ఆరు నెలలు దాటినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో భూముల ధరలు భారీగా పెరగడంతో పరిశ్రమ పెట్టాలనుకునేవారికి భూముల కొనుగోలు తలకు మించిన భారంగా మారింది.దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో ఆవిష్కరించిన ఎంఎస్ఎంఈ–2024 పాలసీలో లీజు విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. పరిశ్రమల కోసం భూములను విక్రయించడమే కాకుండా అవసరమైనవారికి 30 ఏండ్లపాటు లీజుకు ఇవ్వాలని, ఇంకా కావాలంటే లీజు గడువును పొడగించే వెసులుబాటు కూడా కల్పిస్తామని ఆ పాలసీలో పేర్కొన్నారు. అంతేకాదు, చిన్నతరహా పరిశ్రమల కోసం షెడ్లు నిర్మించి లీజుకి ఇస్తామని, పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అభివృద్ధిచేసి వాటిలో 20 శాతం ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తామని ప్రకటించారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వంలో భేష్**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిశ్రమల కోసం చౌక ధరలకే భూములను కేటాయించడంతోపాటు 90 రోజుల్లోగా డబ్బు చెల్లించే వెసులుబాటుని కల్పిస్తూ టీఎస్ ఐపాస్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీంతో చాలామంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సులభంగా బ్యాంకుల నుంచి రుణాలు పొంది వ్యాపారాలు ప్రారంభించేవారు. కాగా, కొంతకాలంగా రాష్ట్ర సర్కారు కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ పేరుతో గందరగోళ వాతావరణాన్ని సృష్టించడంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. భూములు కొనుగోలు చేయకుండా ప్రభుత్వం వద్ద లీజుకు తీసుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అయితే దీనిపై ప్రభుత్వం కొత్త నిర్ణయాన్ని ప్రకటిస్తుందో, లీజు విధానం ఎప్పటి

# పాలసీ సరే.. మార్గదర్శకాలేవి!




**హైదరాబాద్–నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు) పాలసీని తేవడంలో చూపిన శ్రద్ధ.. దాన్ని అమలు చేయడంలో మాత్రం చూపడం లేదు. ఎంఎస్ఎంఈ–2024 విధానాన్ని ప్రవేశపెట్టి 6 నెలలు దాటినా దాని మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. దాదాపు ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ వస్తున్నదని రేవంత్ సర్కారు ప్రచారం చేయడంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దీని కోసం నెలల తరబడి ఎదురుచూశారు.అయితే పాలసీని తెచ్చి ఆరు నెలలు దాటినా ఇంతవరకు మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. మార్గదర్శకాలు వచ్చేదాకా దరఖాస్తుల ప్రాసెసింగ్ కాకపోవడం వల్ల దరఖాస్తుదారులు వేచిచూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం ఎంఎస్ఎంఈ–2024ను విడుదల చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ ఐపాస్ చట్టంలోని అంశాలనే స్వల్ప మార్పులతో కొత్త ఎంఎస్ఎంఈ పాలసీని రూపొందించినా.. దాని అమలులో జాప్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో వివిధ వర్గాలకు కల్పిస్తున్న సబ్సిడీలను పెంచడంతోపాటు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను బ్యాంకు రుణాలకు గ్యారంటీ కింద చూపే వెసులుబాటు కల్పిస్తామని, ఈ మేరకు బ్యాంకర్లను ఒప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

రాయితీల పెంపు విషయం పక్కనపెడితే, అసలు ఇంతవరకు ఆ రాయితీలకు సంబంధించిన బకాయిలనే ప్రభుత్వం విడుదల చేయకపోవడం గమనార్హం. అంతేకాదు సరసమైన ధరలకు భూములను సమకూర్చడమేగాక, ప్రభుత్వం అభివృద్ధి చేసే పారిశ్రామిక పార్కుల్లో 20 శాతం ప్లాట్లు ఎంఎస్ఎంఈలకు రిజర్వు చేస్తామని కూడా ప్రభుత్వం పేర్కొన్నది. అయితే ప్రభుత్వం విడుదల చేస్తున్న వరుస భూసేకరణ నోటిఫికేషన్లకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీంతో ఇండస్ట్రీ పార్కుల వ్యవహారం ఇప్పట్లో ఓ కొలిక్కి వస్తుందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

**ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలకు స్థలాలెక్కడ?**

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేసి అందులో 20 శాతం ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. అలాగే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున చిన్నతరహా ఫ్లాట్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేయనున్నట్టు, వీటిలో స్వయం సహాయక సంఘాలు చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహిస్తామని చెప్పారు. అయితే వీటి కోసం భూసేకరణకుగానీ, నిర్మాణాలకుగానీ ప్రభుత్వం వద్ద నిధులు లేవని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల కోసం సేకరించిన భూములనే కొత్త పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ కోసం పది జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేసింది. రానున్న రోజుల్లో వీటినే కొత్త పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దే వీలుందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. దీంతో నిధుల కొరత కారణంగా మిగిలిన హామీల మాదిరిగానే ఎంఎస్ఎంఈ పాలసీ కూడా తయారవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎంఎస్ఎంఈ పాలసీకి సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేస్తే కొంత స్పష్టత వచ్చే వీలుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**సబ్సిడీల పెంపూ.. ఒట్టి మాటేనా?**

కొత్త పాలసీలో టీ–ఐడియా పథకం కింద తయారీ సంస్థలకు ఇస్తున్న క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచి.. గరిష్ఠ రాయితీ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు సవరిస్తున్నారు. అలాగే టీ–ప్రైడ్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రాయితీలు 35 శాతం నుంచి 50 శాతానికి పెంచుతూ.. గరిష్ఠ రాయితీ పరిమితిని రూ.75 లక్షల నుంచి కోటి రూపాయలకు పెంచనున్నట్టు చెప్తున్నారు.

## ఏడాదిలో 25 శాతం పెరిగిన గోల్డ్ రేటు..

### రూ. లక్షను తాకుతుందా? కుప్పకూలుతుందా?



**హైదరాబాద్–నవభూమి:** ప్రస్తుతం బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సుంకాల వల్ల ఏర్పడిన ఆర్థిక అనిశ్చితి, అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనం చెందుతుందనే భయాలు దీనికి కారణం. ఈ ఏడాది ఇప్పటివరకు %వీజ౩% బంగారం ధర దాదాపు 25 శాతం పెరిగింది. గత ఐదేళ్లలోనే (ఏప్రిల్ 17, 2020 నుంచి ఏప్రిల్ 17, 2025 వరకు) రూ. 44,906 నుంచి రూ. 95,239కి చేరుకుని 110 శాతం కంటే ఎక్కువ లాభాన్ని నమోదు చేసింది. అయితే, స్వల్పకాలంలో గణనీయమైన లాభాలు వచ్చినప్పుడు, లాభాల స్వీకరణ జరిగే ప్రమాదం కూడా పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ తిరిగి పుంజుకుంటున్న నేపథ్యంలో బులియన్ మార్కెట్‌లో లాభాల స్వీకరణ జరుగుతుందా లేదా రెండు ఆస్తులు ఒకే ధోరణిని కొనసాగిస్తాయా అని ఇన్వెస్టర్లు ఎదురు చూస్తున్నారు.

**బంగారం ధరలు ఎందుకు పెరుగుతున్నాయి?**

స్వల్పకాలంలో బంగారం ధరలను ప్రభావితం చేసే అంశాలపై %ఎణఖీజ% సెక్యూరిటీస్‌లోని కమోడిటీ %డ% కరెన్సీ హెడ్ అనుజ్ గుప్తా మాట్లాడుతూ, "ట్రేడ్ వార్ తీవ్రతరం కావడం, ట్రంప్ సుంకాల వల్ల ఏర్పడిన ఆర్థిక అనిశ్చితి కారణంగా బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. యూఎస్ ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్‌తో సహా చాలా మంది ఆర్థికవేత్తలు చెప్పినట్లుగా, ఒక శాతం సుంకాల పెరుగుదల %ఖూ% ఆర్థిక వృద్ధిని దాదాపు 0.10 శాతం తగ్గిస్తుందిబీ %ఖూ% మాంద్యం వస్తుందని మార్కెట్ భయపడుతోంది. ఈ కారణాల వల్ల సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారం డిమాండ్ పెరిగింది, ఇది ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధరలు దాదాపు 25 శాతం, గత ఐదేళ్లలో 110% కంటే ఎక్కువ పెరగడానికి దారితీసింది."

**బంగారం ధరల్లో భారీ పతనం ఉంటుందా?**

స్టాక్ మార్కెట్ ర్యాలీ నేపథ్యంలో బంగారం ధరల దృక్పథం గురించి అనుజ్ గుప్తా మాట్లాడుతూ, "బంగారం ధరలను పెంచిన కారణాలు ఇంకా కొనసాగుతున్నాయి, కాబట్టి భారీ పతనం వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. గ్లోబల్ బ్రోకరేజ్ గోల్డ్‌మన్ సాచ్స్ తన బంగారం ధర లక్ష్యాన్ని ఔన్సుకు 3,300 డాలర్ల నుంచి 3,700 డాలర్లకు పెంచింది. అధిక–రిస్క్ సందర్భాల్లో, బంగారం ధర ఔన్సుకు 4,500 డాలర్లను తాకొచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. కాబట్టి, బంగారం ధరల్లో పెరుగుదల ధోరణి కొనసాగుతుందని భావిస్తున్నారు. బంగారం ధరల్లో ఏదైనా తగ్గుదల.. కొనుగోలు అవకాశంగా చూడాలి."

**బంగారం ధర రూ. లక్ష మార్క్ తాకుతుందా?**

స్వల్పకాలంలో బంగారం ధరలు రూ. 1 లక్షను తాకుతుందా అనే ప్రశ్నకు మోతీలాల్ ఓస్వాల్‌లో కమోడిటీ కరెన్సీ రీసెర్చ్ హెడ్ నవనీత్ దమాని మాట్లాడుతూ, "బంగారం ధరల దృక్పథం సానుకూలంగా ఉంది. కొనసాగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, సెంట్రల్ బ్యాంకుల బంగారం కొనుగోళ్లు ధరలకు మద్దతునిస్తూనే ఉంటాయి. సాంకేతిక స్థాయిలు ఎంసీఎక్స్‌పై రూ. 91,000 వద్ద బలమైన మద్దతును, రూ. 99,000 వద్ద నిరోధాన్ని సూచిస్తున్నాయి.

# మే 1 నుంచి ఏటీఎం ఛార్జీల మోత..




**హైదరాబాద్–నవభూమి:** బ్యాంక్ ఖాతాదారులకు బిగ్ అలర్ట్. దేశీయ దిగ్గజ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన కోటక్ మహీంద్రా బ్యాంక్ తమ ఖాతాదారులకు బిగ్ షాకిచ్చింది. మే 1వ తేదీ నుంచి ఏటీఎం ఛార్జీలను పెంచుతున్నట్లు తెలిపింది. బ్యాలెన్స్ చెక్ చేసినా, మినీ స్టేట్మెంట్ తీసుకున్నా ఛార్జీలు పడతాయి. మరి కొత్త ఛార్జీల పూర్తి వివరాలు ఇప్పుడే తెలుసుకుందాం.

ప్రైవేట్ రంగంలోని దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన కోటక్ మహీంద్రా బ్యాంక్ తన ఖాతాదారులకు షాకిచ్చింది. (ఆటోమేటెడ్ టెలర్ మెషిన్) ట్రాన్సాక్షన్ల ఛార్జీలు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఏటీఎం లావాదేవీల ఛార్జీలను సవరించినట్లు స్పష్టం చేసింది. మే 1, 2025 నుంచి బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన ప్రతి లావాదేవీకి రూ. 23 ఫీజు వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఛార్జీలు రూ. 21 గా ఉన్నాయి. ఏటీఎం ఛార్జీలు పెంచిన విషయాన్ని తమ కస్టమర్లకు ఈ–మెయిల్ ద్వారా తెలియజేసినట్లు బ్యాంకు తెలిపింది.మే 1, 2025 నుంచే సవరించిన ఈ కొత్త రూల్స్ అమలులోకి వస్తాయి. ఏటీఎం నుంచి డబ్బులు విత్ డ్రా, నిధుల బదిలీ వంటి లావాదేవీలకు ఇకపై ఒక్కో ట్రాన్సాక్షన్‌కు రూ. 23 ఫీజు వసూలు చేస్తామని బ్యాంక్ తెలిపింది. అయితే బ్యాలెన్స్ చెకింగ్, మినీ స్టేట్ మెంట్ వంటి ఇతర ట్రాన్సాక్షన్లకు రూ. 10 ఛార్జీలు వర్తిస్తాయి. ప్రస్తుతం ఇవి రూ. 21, రూ. 8.50 గా ఉన్నాయి. అయితే ఈ బ్యాంకు తమ కస్టమర్లకు ప్రతి నెల ఏటీఎం ద్వారా ఉచితంగా 5 లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ పరిమితి దాటితే ఛార్జీలు వర్తిస్తాయి.బ్యాంకు ఖాతాను బట్టి ఒక రోజులో గరిష్ఠ ఉప సంహరణ పరిమితి వేరు వేరుగా ఉంటుంది. కోటక్ ఎడ్జ్, ప్రో, ఎస్ అకౌంట్లలో రూ. 1,00,000 వరకు ఒక రోజులో విత్ డ్రా చేసుకోవచ్చు. అదే ఈజీ పే ఖాతా అయితే రూ. 25,000 వరకే ఉపసంహరించుకోవచ్చు. కార్డు లేదా అకౌంట్ రకాన్ని బట్టి ఈ లిమిట్ అనేది మారుతుంది. కొన్ని కార్డులకు రూ. 50 వేల వరకు లిమిట్ ఉంటుంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఐటీఎం ఛార్జీలను పెంచుతున్నట్లు గత మార్చి నెలాఖరులోనే ప్రకటించింది. కార్యకలాపాల ఖర్చులు, ఏటీఎంల నిర్వహణ భారం పెరిగినందువల్లే ఈ మేరకు ఛార్జీల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అంతకు ముందు 2021 మార్చి నెలలో ఏటీఎం ఛార్జీలు పెంచింది. ఇప్పుడు మరోసారి సవరించింది. మే 1, 2025 నుంచే ఈ కొత్త ఛార్జీలు అమలవుతాయని ఆర్‌బీఐ కొద్ది రోజులుగా చెబుతోంది. ఈ నేపథ్యంలో కోటక్ మహీంద్రా బ్యాంకు ఏటీఎం ఛార్జీల పెంపును అమలులోకి తీసుకొస్తుండడం గమనార్హం.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్
సోమవారం
21 । ఏప్రిల్ । 2025



# నా బూడిదను డ్రైనేజీలో కలపండి.. భార్య వేధింపులు తాళలేక టెకీ ఆత్మహత్య




**న్యూఢిల్లీ-నవభూమి:** భార్య వేధింపులు తాళలేక మరో టెకీ ఆత్మహత్య కు పాల్పడ్డాడు. బెంగళూరుకు చెందిన అతుల్ సుభాష్ ఆత్మహత్య ఘటన మరవకముందే ఉత్తరప్రదేశ్ లో టెకీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన భార్య, ఆమె కుటుంబం తనను మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తోందని ఆరోపిస్తూ ఆత్మహత్య చేసుకున్నాడు. తన మరణం తర్వాత కూడా న్యాయం జరగకపోతే తన బూడిదను డ్రైనేజీలో కలుపాలని చెబుతూ ఒక సెల్ఫీ వీడియో తీసి దగ్గరి బంధువుకు షేర్ చేశాడు.వివరాల్లోకి వెళ్తే.. మోహిత్ యాదవ్ అనే వ్యక్తి ప్రియ అనే యువతిని ఏడేళ్లుగా ప్రేమించాడు. పెద్దలను ఒప్పించి రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఒక సిమెంట్ కంపెనీలో ఫీల్డ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే దంపతుల మధ్య గొడవలు తలెత్తాయి. భార్య తరపు కుటుంబం తనను వేధింపులకు గురిచేస్తోందని, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ మోహిత్ ఒక వీడియో రికార్డు చేశాడు. ఆ తర్వాత ఆ వీడియోను దగ్గరి బంధువుకు షేర్ చేసి ఒక హోటల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.'రెండు నెలల క్రితం నా భార్య ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా ఉద్యోగంలో చేరింది. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమెకు మా అత్తయ్య అబార్షన్ చేయించింది. ఆమెపై ఉన్న బంగారు ఆభరణాలను బలవంతంగా దగ్గర పెట్టుకుంది. మా పెళ్లి సమయంలో వారి నుంచి నేను ఒక రూపాయి కట్నం కూడా తీసుకోలేదు. కానీ నాపై తప్పుడు కేసులు పెట్టారు.

# జైన దేవాలయం కూల్చివేతపై జైనులు నిరసన.. అధికారి బదిలీ





**ముంబై-నవభూమి:**జైన దేవాలయం కూల్చివేతపై జైనులు నిరసన తెలిపారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ తమ ఆలయాన్ని కూల్చివేశారని మండిపడ్డారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. విలే పార్లే ఈస్ట్‌లోని నేమినాథ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న అక్రమ జైన దేవాలయాన్ని ఏప్రిల్ 15న బీఎంసీ అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారు. దీనిపై జైన సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం జైనులు ఎత్తున నిరసన తెలిపారు. బీఎంసీ చర్యను వ్యతిరేకించారు.కాగా, వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు రామకృష్ణ హోటల్ యజమానుల సూచన మేరకు జైన ఆలయాన్ని కూల్చివేశారని జైనులు ఆరోపించారు. కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ బీఎంసీ అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. దీనిపై కోర్టులో పోరాడుతామని అన్నారు. ఆలయాన్ని కూల్చివేసిన చోట టెంట్లు వేసి విగ్రహాలను అక్కడ ఉంచారు. ప్రార్థనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. శ్రీ 1008 దిగంబర్ జైన్ మందిర్ ట్రస్ట్ నిర్వహణలో ఉన్న ఈ ఆలయాన్ని 1962లో అభివృద్ధి చేశారు.మరోవైపు జైన మందిరం కూల్చివేత నేపథ్యంలో మహారాష్ట్రతో పాటు బీఎంసీలో అధికారంలో ఉన్న బీజేపీపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కూల్చివేతను పర్యవేక్షించిన వార్డ్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ నవనాథ్ ఘడ్గే పాటిల్‌ను బదిలీ చేశారు. అయితే కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాను పని చేసినట్లు ఆయన తెలిపారు. చట్టపరమైన అన్ని విధానాలను అనుసరించినట్లు వెల్లడించారు.

# ఐబ్రోస్ కోసం బ్యూటీపార్లర్‌కు వెళ్లిన భార్య.. ఆమె జడ కత్తిరించిన భర్త




**లక్నో-నవభూమి:** ఒక మహిళ కనుబొమ్మలు చేయించుకునేందుకు బ్యూటీపార్లర్ కు వెళ్లింది. ఇది తెలిసి ఆమె భర్త అక్కడకు చేరుకున్నాడు. భార్యపై ఆగ్రహంతో ఆమె జడను కత్తిరించాడు. అయితే అదనపు కట్నం కోసం తన కుమార్తెను భర్త, అత్తమామలు వేధిస్తున్నారని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో అతడ్ని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఏడాది కిందట రామ్‌ప్రతాప్‌కు ఒక మహిళతో పెళ్లి జరిగింది. వారం కిందట భార్య పుట్టింటికి చేరింది.కాగా, శనివారం ఆ మహిళ బ్యూటీపార్లర్‌కు వెళ్లింది. కనుబొమ్మలు చేయించుకున్నది. ఈ విషయం తెలిసి రామ్‌ప్రతాప్ అక్కడకు చేరుకున్నాడు. భార్య బ్యూటీపార్లర్‌కు వెళ్లడంపై అతడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆమె జడను కత్తిరించాడు.మరోవైపు ఆ మహిళ తండ్రి రాధాకృష్ణకు ఈ విషయం తెలిసింది. దీంతో అల్లుడైన రామ్‌ప్రతాప్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వరకట్నం కోసం నిరంతరం తన కుమార్తెను వేధిస్తున్నాడని ఆరోపించాడు. రిఫ్రిజిరేటర్, కూలర్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, అందుకే రామ్‌ప్రతాప్ తన కూతురి జడ కత్తిరించి వేధించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# లేచింది పురుష ప్రపంచం




**న్యూఢిల్లీ-నవభూమి:**ఇప్పటికి ఏడున్నర పదుల క్రితం ఒక పాత తెలుగు పాటను పింగళి నాగేంద్రరావు అనే మహా కవి రచించారు. లేచింది మహిళా లోకం అంటూ. ఆ తర్వాత మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకున్నాయి. వారి హక్కులను కాపాడేందుకు ప్రత్యేక మహిళా కమిషన్ ని జాతీయ స్థాయిలో రాష్ట్రాల స్థాయిలో రాజ్యాంగ బద్ధంగా ఏర్పటు చేశారు. దాంతో అబలలకు ఎంతో మందికి న్యాయం దక్కింది. అయితే రాను రాను వికసిస్తున్న చైతన్యంతో లోకం కొత్త పుంతలు పోతోంది. లింగ వివక్ష కోణానికి అతీతంగా బాధితులు ఎవరైనా ఉండొచ్చు అన్నది కూడా బాగా తెలిసి వచ్చింది. మోసపోయేవారు ఫలానా జెండర్ కి చెందిన వారే అన్న గుడ్డి భ్రమలకు కాలం చెల్లుతున్న వేళ బలవంతుడు అని సమాజం దృష్టిలో గట్టి ముద్ర ఉన్న పురుషుడు కూడా డీలా పడుతున్నారు. చాలా సందర్భాలలో మోసపోతూ మౌనంగా తన జీవితాన్ని చాలిస్తున్నాడు. ఒకప్పుడు భర్త బాధితులు అయిన మహిళలు ఎక్కువగా కనిపించేవారు ఇపుడు కూడా ఉన్నారు. అయితే మహిళలలో వచ్చిన చైతన్యం వల్ల కావచ్చు లేదా చట్టాల భయం వల్ల కావచ్చు కొంత అదుపులో ఉన్నాయని అంటున్నారు. అదే సమయంలో పురుషులకు ఏ చట్టపరమైన రక్షణ లేకపోవడం వల్ల వారి విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. అంతే కాదు తప్పుడు కేసులు పెడుతున్న చాలా కేసులలో వారు అమాయకులుగా మారి ఉసురు తీసుకుంటున్నారు. ఇటీవల కాలంలో భార్యా బాధితులు ఎక్కువ అయ్యారు. హాస్యానికి అన్నట్లుగ ఇప్పటికి నాలుగు దశాబ్దాల క్రితం దివంగత ప్రముఖ జంధ్యాల రాజేంద్ర ప్రసాద్ ని హీరోగా పెట్టి వివాహ భోజనంబు సినిమా తీశారు. అందులో భార్యా బాధితులు అని ఒక సంఘం ఏర్పాటు చేసి చూపించారు. కానీ అదే ఇపుడు నిజం అవుతోంది. భార్యా బాధితులు అంతా సంఘంగా ఏర్పడుతున్నారు. 3 నెలల్లో రెండోసారి వీధుల్లోకి ప్రజలు జాతీయ స్థాయిలో వారు అంతా ఒక్కటిగా నిలిచి తమకూ ఒక చట్టబద్ధమైన రక్షణ కావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద భారీ ఎత్తున పురుష సత్యాగ్రహం పేరుతో తాజాగా నిర్వహించిన ఆందోళనా కార్యక్రమంలో ప్రత్యేక కమిషన్ డిమాండ్ మారు మోగింది. సేవ్ ఫ్యామిలీ అన్న సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పురుషులు పాల్గొన్నారు. ఇక భర్తల హక్కుల కోసం పోరాడుతున్న దేశంలోని నలభైకి పైగా ఎన్జీవోల నుంచి ప్రతినిధులు వేయి మందికి పైగా ఈ పురుష సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వందమందికి పైగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొన్నారు. భార్యల వేధింపులకు బలి అయిన భర్తలకు చెందిన కుటుంబ సభ్యులుగా వీరు హాజరయ్యారు.

# కుల్‌భూషణ్ జాదవ్‌కు అప్పీల్ చేసే హక్కు లేదు.. సుప్రీంకోర్టులో పాక్ ప్రభుత్వం వాదన



**న్యూఢిల్లీ-నవభూమి:**గూఢచర్యం ఆరోపణలతో భారత నేవీ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను అరెస్ట్ చేసిన పాకిస్థాన్.. ఆయనకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం భారత్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ఆయనకు అప్పీల్ చేసే హక్కును పాక్ నిరాకరించినట్టు ఆ దేశానికి చెందిన పత్రిక డాన్ కథనం నివేదించింది. కేవలం కాన్సులర్ యాక్సెస్ విషయంలో మాత్రమే తీర్పు ఇచ్చినట్టు సుప్రీంకోర్టులో పేర్కొన్నారని ఆ నివేదిక పేర్కొంది. జాదవ్ కేసులో జూన్ 2019లో భారత్ వేసిన పిటిషన్‌పై అనుకూలంగా తీర్పు ఇచ్చిన దౌత్య ప్రాప్యత హక్కు ఉందని స్పష్టం చేసింది. అంతేకాదు ఆయనకు విధించిన శిక్షను పునఃసమీక్షించి, పునరాలోచించాలని పాక్‌ను ఆదేశించింది.ఏప్రిల్ 17న పాకిస్థాన్ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందుకు మే 9, 2023లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు తర్వాత దేశంలో జరిగిన అల్లర్ల ఘటనల్లో సైనిక కోర్టులు శిక్షవిధించిన పాక్ పౌరుల కేసు విచారణకు వచ్చింది. ఈ క్రమంలో ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ తరపున లాయర్ ఖ్వాజా హారిస్ అహ్మద్ వాదనలు వినిపిస్తూ.. జాదవ్ కేసును ప్రస్తావించారు. హారిస్ అహ్మద్ మాట్లాడుతూ.. 'కుల్‌భూషణ్ జాదవ్‌కు అప్పీల్‌కు హక్కు కల్పించినప్పటికీ, మే 9 అల్లర్లలో శిక్షపడిన పాకిస్థాన్ పౌరులకు ఆ హక్కు ఇవ్వలేదు' అని పేర్కొన్నారు.అయితే, పాక్ అటార్నీ జనరల్ మంసూర్ ఉస్మాన్ అవాన్ వాదనలు వినిపిస్తూ.. ఈ అంశంపై పైకోర్టుల ముందు అప్పీల్ హక్కు కల్పించాలా? వద్దా అనే అంశంపై చర్చిస్తున్నామని, దీనిపై నిర్ణయానికి రెండు రోజులు అవసరమని తెలియజేశారు. కాగా, భారత నేవీ మాజీ అధికారి జాదవ్‌ను 2016లో బలూచిస్థాన్‌లో అరెస్ట్ చేశామనీ, ఆయనపై గూఢచారి, ఉగ్రవాదం ఆరోపణలు ఉన్నాయని పాక్ చెబుతోంది. కుల్‌భూషణ్ జాదవ్‌కు అప్పీల్ చేసే హక్కు లేదు.. సుప్రీంకోర్టులో పాక్ ప్రభుత్వం వాదనకానీ, భారత్ మాత్రం ఈ ఆరోపణలను తిరస్కరించింది. నౌకాదళంలో పదవీ విరమణ చేసిన తర్వాత ఇరాన్‌లోని చాబహార్ పోర్టులో వ్యాపారం చేసుకుంటోన్న జాదవ్‌ను పాక్ సైనికులు అపహరించారని తెలిపింది. దీనిపై ఐసీజేకు అప్పీలు చేయగా.. భారత్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. జాదవ్ ఉరిశిక్షను నిలిపివేసి.. తీర్పుపై రివ్యూ పిటిషన్‌కు అనుమతించాలని జులై 2020లో పాకిస్థాన్‌ను ఆదేశించింది.అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు వచ్చి ఏళ్లు గడిచినప్పటికీ, దీనిని పాకిస్థాన్ అమలు చేయలేదని భారత్ ఆరోపించింది. ఆయనకు దౌత్యపరమైన ప్రాపత్యకు అనుమతించకుండా వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని కూడా కేంద్ర ప్రభుత్వం మండిపడింది. రెండో కాన్సులర్ యాక్సెస్ తరువాత అంతర్జాతీయ ట్రైబ్యునల్ తీర్పును పాకిస్థాన్ ఉల్లంఘించిందని భారత్ ఆరోపించింది.

# భారత్‌కు వాన్స్, ఉషా చిలుకూరి



**అమెరికా-నవభూమి:**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి, అగ్రరాజ్యం సెకెండ్ లేడీ, తెలుగమ్మాయి ఉషా చిలుకూరి వాన్స్ సోమవారం (ఏప్రిల్ 21) భారత్‌కు రానున్నారు. అయితే, అమెరికా సెకెండ్ లేడీ హోదాలో ఉషా తన సొంతగడ్డపై తొలిసారి అడుగుపెట్టబోతుండటం విశేషం. భర్త వాన్స్, వారి ముగ్గురు పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబెల్‌లతో కలిసి నాలుగు రోజుల పాటు భారత్‌లో పలు ప్రదేశాలను సందర్శించనున్నారు. సోమవారం సాయంత్రం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీరికి విందు ఏర్పాటు చేయనున్నారు. విందుకు ముందు వారు ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. ఈ చర్చల్లో వాణిజ్యం, సుంకాలు, ఇతర కీలక అంశాలు చర్చకు రానున్నాయని సమాచారం.జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా చిలుకూరి , వారి పిల్లలు సోమవారం ఉదయం 10 గంటలకు పాలం ఎయిర్‌బేస్‌కు చేరుకోనున్నారు. నాలుగు రోజుల భారత్ పర్యటనలో భాగంగా ఢిల్లీ, జైపూర్, ఆగ్రాలకు వెళ్తారు. వారికి ఓ కేంద్ర మంత్రి స్వాగతం పలికే అవకాశం ఉంది. సోమవారం ఉదయం ఢిల్లీకి చేరుకుని.. ఐటీసీ మౌర్య షెరటాన్‌లో బసచేస్తారు. మొదటి రోజే స్వామినారాయణ అక్షరధామ్ మందిరాన్ని సందర్శించనున్నారు. అలాగే భారతీయ సంప్రదాయ హస్తకళ ఉత్పత్తులు అమ్మే షాపింగ్ కాంప్లెక్స్‌కి వెళ్లే అవకాశముంది.సోమవారం సాయంత్రం 6:30 గంటలకు ప్రధాని మోదీతో వాన్స్ సమావేశమవుతారు. ఈ సమావేశంలో భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై త్వరిత నిర్ణయం తీసుకోవడం, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చ జరుగుతుంది. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ, అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా తదితరులు పాల్గొననున్నారు. చర్చల అనంతరం మోదీ, వాన్స్ కుటుంబానికి, అమెరికా అధికారులకు విందు ఏర్పాటు చేస్తారు.విందు ముగిసిన తర్వాత సోమవారం రాత్రే వాన్స్ కుటుంబం జైపూర్‌కి వెళ్లనుంది. ఏప్రిల్ 22న జైపూర్‌లోని అంబర్ ప్యాలెస్ వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించనున్నారు. మధ్యాహ్నం జైపూర్‌లోని రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓ సభలో జేడీ వాన్స్ ప్రసంగించనున్నారు. ఇందులో నిపుణులు, ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు పాల్గొంటారు.ఏప్రిల్ 23న ఆగ్రా వెళ్లి తాజ్ మహల్, శిల్పగ్రామ్ వంటి ప్రదేశాలను సందర్శిస్తారు. ఆ తర్వాత అదే రోజు జైపూర్‌కి తిరిగి వస్తారు. ఏప్రిల్ 24న జైపూర్ నుంచి అమెరికాకు బయలుదేరనున్నారు. జైపూర్‌లో రాయల గెస్ట్‌హౌస్‌గా గుర్తింపు పొందిన ప్రముఖ రాంబాగ్ ప్యాలెస్‌లో విడిది చేయనున్నట్టు సమాచారం. ఇది పూర్తిగా ప్రయివేట్ పర్యటన అయినప్పటికీ ప్రధానితో కలిసి పలు అంశాలపై చర్చించనున్నారు.

# ప్రజారోగ్యానికి ఇదో ప్రమాదకర హెచ్చరిక



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇప్పుడు ఎక్కడ చూసినా.. ఎవరిని చూసినా అంతా జబ్బుల మయమే.. పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు అందరినీ ఆస్పత్రుల పాలు చేస్తున్నాయి. కొవ్వు, కాలేయం, మధుమేహం, సంబంధిత ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. దీనికి పెరుగుతున్న ఊబకాయం , అధిక రక్త చక్కెర స్థాయిలు ముఖ్య కారణాలని నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర రెడ్డి ఊబకాయం, అధిక రక్త చక్కెర స్థాయిల పెరుగుదల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు పెరుగుతున్న కొవ్వు కాలేయం, మధుమేహం , ఇతర సంబంధిత ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి.. తిప్పికొట్టడానికి సహజమైన జీవనశైలి మార్పుల ప్రాముఖ్యతను డాక్టర్ నాగేశ్వరరెడ్డి నొక్కి చెప్పారు. సరైన ఆహారం తీసుకోవడం, తగినంత నిద్ర పోవడం , క్రమం తప్పకుండా యోగా చేయడం వంటి వాటి ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని ఆయన సూచించారు. మిస్ కాకుండా చదవాల్సిందే అయితే ఇటీవల బరువు తగ్గించేందుకు అందుబాటులోకి వస్తున్న ఇంజెక్షన్ల వినియోగంపై డాక్టర్ నాగేశ్వరరెడ్డి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఇంజెక్షన్లలో సాధారణంగా ఉండే GLP-1 (గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1) గురించి ఆయన వివరించారు. GLP-1 అనేది సహజంగా మన శరీరంలో ఉత్పత్తి అయ్యే ఒక గట్ హార్మోన్. ఇది ఆకలిని నియంత్రించడంలో.. రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరం సహజంగా ఉత్పత్తి చేసినప్పుడు ఇది ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, కృత్రిమంగా ఇంజెక్ట్ చేయడం అనేక ప్రమాదాలకు దారితీస్తుందని డాక్టర్ రెడ్డి హెచ్చరించారు. తాజా పరిశోధనలో దిగ్భ్రాంతికర విషయాలు కృత్రిమంగా GLP-1ను ఇంజెక్ట్ చేయడం వల్ల శరీరానికి అందే మోతాదు నియంత్రణలో ఉండదని, దీని కారణంగా అనేక దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వైద్య పర్యవేక్షణ లేకుండా తరచుగా ఈ ఇంజెక్షన్లను ఉపయోగించడం వల్ల చర్మం పొడిబారడం.. "ఒజెంపిక్ ఫేస్" వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. "ఒజెంపిక్ ఫేస్" అంటే ముఖంలోని కొవ్వు తగ్గిపోవడం వల్ల ముఖం వృద్ధాప్య ఛాయలతో కళావిహీనంగా మారే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ప్రజలు తక్షణ ఫలితాలనిచ్చే కృత్రిమ పద్ధతులపై ఆధారపడకుండా, దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని సాధించడానికి సహజమైన , స్థిరమైన జీవనశైలి మార్పులను అనుసరించాలని డాక్టర్ నాగేశ్వర రెడ్డి సూచించారు. సరైన ఆహారం, తగినంత నిద్ర , వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా ఊబకాయం , సంబంధిత ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. వైద్యుల సరైన సలహా.. పర్యవేక్షణ లేకుండా బరువు తగ్గించే ఇంజెక్షన్ల వంటి వాటిని ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరమని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ఈ హెచ్చరిక ప్రజారోగ్యానికి సంబంధించిన ఒక ముఖ్యమైన సందేశాన్నిస్తుంది. శీఘ్ర ఫలితాల కోసం ఆరాటపడేవారు, వాటి వెనుక దాగి ఉన్న ప్రమాదాలను కూడా గుర్తెరగాలి. డాక్టర్ నాగేశ్వర రెడ్డి సూచించినట్లుగా.. సహజమైన మార్గాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే సురక్షితమైన.. దీర్ఘకాలిక పరిష్కారం.

# సుప్రీం చట్టాలు చేస్తే పార్లమెంట్ ఎందుకు?

## బీజేపీ ఎంపీలు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:**సుప్రీంకోర్టుపై ఉప-రాష్ట్రపతి జగదీప్ ధన?డ్ చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. క్రమంగా రాజుకుంటోంది. తాజాగా, బీజేపీ ఎంపీలు మరో అడుగు ముందుకేసి.. సర్వోన్నత న్యాయస్థానంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సుప్రీంకోర్టు తన పరిధికి మించి వ్యవహరిస్తోందని, దేశంలో మత పోరాటాలకు ప్రేరణకు బాధ్యత వహించాలంటూ ఝూరండ్‌లోని గోడ్డా ఎంపీ నిశికాంత్ దూబె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. సుప్రీం కోర్టును బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ విమర్శించింది.
రెండు రోజుల కిందట జగదీప్ ధన?డ్ మాట్లాడుతూ.. "సుప్రీంకోర్టు ఒక సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తోంది.., వారికి ఎలాంటి జవాబుదారీతనం లేదు.. రాష్ట్రపతికి ఆదే. రాజ్యాంగంలోని 142వ ఆర్టికల్ సుప్రీంకోర్టుకు సంపూర్ణ అధికారాలు ఇచ్చింది.. దాని ద్వారా ఏ అంశంలోనైనా న్యాయం జరిగేలా ఆదేశాలు ఇవ్వవచ్చు.. ఇది 24/7 అందుబాటులో ఉండే అణుక్షిపణిలాంటిది.. ఓ కేసులో రాష్ట్రపతికే ఆదేశాలు ఇచ్చారని, ఇది ఆందోళన కలిగిస్తోందని' అని తమిళనాడు గవర్నర్ కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునుద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీ మరో అడుగుముందుకేశారు."మిమ్మల్ని నియమించే అధికారికి మీరు ఎలా ఆదేశాలు ఇవ్వగలరు? భారత ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతి నియమిస్తారు.. ఈ దేశానికి చట్టాలు రూపొందించేది పార్లమెంటే. మీరు పార్లమెంటుకే ఆదేశాలిస్తారా?... మీరు ఎలా కొత్త చట్టం తయారు చేశారు? ఏ చట్టంలో ఉంది? రాష్ట్రపతి మూడునెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందా? దీని అర్థం మీరు దేశాన్ని విధ్వంసం వైపు నడిపించాలనుకుంటున్నారా?. పార్లమెంటు సమావేశమైన తర్వాత దీనిపై సమగ్ర చర్చ జరుగుతుంది..." అని తీవ్రమైన పదజాలం వాడారు.అంతేకాదు, "దేశంలో మతపోరాటాలకు ప్రేరణ ఇవ్వడానికి సుప్రీం కోర్టే బాధ్యత వహించాలి. సుప్రీం కోర్టు తన పరిమితులను మించి వ్యవహరిస్తోంది. ప్రతీ విషయంలోనూ సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వస్తే, పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలను మూసేయాల్సిందే...' అని వ్యాఖ్యానించారు.ఈ వివాదంపై మరో బీజేపీ నేత దినేష్ శర్మ కూడా స్పందిస్తూ, 'భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ, రాజ్యసభలకు ఎవరూ ఆదేశాలు ఇవ్వలేరు. రాష్ట్రపతి ఇప్పటికే ఆమోదమిచ్చారు. రాష్ట్రపతిని ఎవరూ సవాల్ చేయలేరు.. ఆయన అత్యున్నత స్థాయిలో ఉన్నారు' అని అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యలపై బీజేపీ అధిష్ఠానం తమకేలాంటి సంబంధం లేదని చెప్పడం గమనార్హం. అది వారి వ్యక్తిగతమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పష్టం చేశారు."న్యాయవ్యవస్థపై బీజేపీ ఎంపీలు నిశికాంత్ దుబే, దినేష్ శర్మ చేసిన వ్యాఖ్యలకు బీజేపీకి సంబంధం లేదు. ఇవి వారి వ్యక్తిగత అభిప్రాయాలు. బీజేపీ ఇలాంటి వ్యాఖ్యలతో ఏకీభవించదు, మద్దతు ఇవ్వదు. బీజేపీ ఈ వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తుంది.. మేము న్యాయవ్యవస్థను గౌరవిస్తాం. సుప్రీం కోర్టు సహా అన్ని న్యాయస్థానాలు రాజ్యాంగ పరిరక్షణకు బలమైన స్థంభాలుగా ఉన్నాయని మేం నమ్ముతున్నాం. నేను వారిద్దరికీ, అలాగే ఇతరులకు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని సూచించాను' అని చెప్పారు.వక్ఫ్ (సవరణ) చట్టం 2025పై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతున్న సందర్భంలో ఈ వ్యాఖ్యలు చేయడం మరింత ప్రాధాన్యత ఏర్పడింది. వక్ఫ్ చట్టం విషయంలో వివాదాస్పదమైన నిబంధనల అమలుపై స్టే విధించిన విషయం తెలిసిందే.బీజేపీ నాయకుల వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. 'సుప్రీం కోర్టుపై దాడి జరుగుతోంది. దానిని బలహీనపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వేర్వేరు వ్యక్తుల నుంచి ఉద్దేశపూర్వకంగా ఈ విధమైన వ్యాఖ్యలు వస్తున్నాయి. ఎన్నికల బాండ్లు, వక్ఫ్ వ్యవహారం, ఎన్నికల సంఘం వ్యవహారం తదితర అంశాల నేపథ్యంలో కోర్టు వారికి టార్గెట్‌గా మారింది' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ అన్నారు.కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఈ వ్యాఖ్యలను 'అసహ్యకరమైన చర్య'గా అభివర్ణించారు. సుప్రీం కోర్టు మీద దాడిని మేము అంగీకరించబోమని, కోర్టు బయట మాట్లాడినందున న్యాయమూర్తులు దీన్ని గమనించాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ.. 'ఇలాంటి వ్యాఖ్యలు దురదృష్టకరం. ఇది తొలిసారి కాదు.. పూర్తి మెజారిటీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పులు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి.. ఈ అసహనం అర్థం కావడం లేదు' మండిపడ్డారు.

# పొడవాటి కత్తితో బస్సుపై దాడి..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఒక యవకుడు రెచ్చిపోయాడు. రోడ్డుపైకి వచ్చి హంగామా చేశాడు. పొడవాటి కత్తితో బస్సుపై దాడి చేశాడు. బస్సు డ్రైవర్‌ను అసభ్యకరంగా తిట్టడంతోపాటు బెదిరించాడు. బస్సుతోపాటు ఆటో మరో వాహనం అద్దాలు ధ్వంసం చేశాడు. చివరకు పోలీసులు ఆ యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. భాండూప్ ప్రాంతంలో నివసించే 16 ఏళ్ల యువకుడు దొంగతం చేశాడన్న ఆరోపణలతో అతడి బంధువు తిట్టాడు. దీంతో అతడు ఆగ్రహంతో ఊగిపోయాడు. శనివారం మధ్యాహ్నం రోడ్డుపైకి వచ్చి గట్టిగా అరుస్తూ హంగామా చేశాడు. చేతిలోని పొడవైన కత్తితో బెస్ట్ బస్సు అద్దలు పగులగొట్టాడు.

# మహా రాజకీయాల్లో భారీ ట్విస్ట్.. రెండు దశాబ్దాల తర్వాత ఒక్కటవుతోన్న ఠాక్రేలు!

**న్యూఢిల్లీ-నవభూమి:**జాతీయ విద్యావిధానం 2020 అమలులో భాగంగా మహారాష్ట్రలో ఒకటితి నుంచి ఐదో తరగతి వరకూ హిందీ. మరాఠీ మీడియం విద్యార్థులకు తప్పనిసరిగా హిందీ బోధించాలని ఫడ్నవీస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై మరాఠావాదులు భగ్గుమంటున్నారు. ఈ క్రమంలోనే మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పులు సంభవించబోతున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రెండు దశాబ్దాల కిందట విడిపోయిన ఠాక్రే కుటుంబం మళ్లీ కలసే అవకాశాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బాబాయి బాల్ ఠాక్రేతో విబేధించి 2005లో శివసేనను వీడిన రాజ్ ఠాక్రే.. సొంతంగా మహారాష్ట్ర నవనిర్మాణ సేన పేరుతో పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే.. రాజ్ ఠాక్రేల మధ్య రాజకీయ విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోదరులు ఇద్దరూ మళ్లీ కలుస్తున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా మరాఠీ సంస్కృతి, గుర్తింపుపై పెరుగుతున్న బెదిరింపుల నేపథ్యంలో దాయాదులు కలిసి పనిచేయాలనే నిర్ణయాన్ని పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.రాజ్ ఠాక్రే మాట్లాడుతూ.. 'ఉద్ధవ్‌కు, నాకు మధ్య ఉన్న విభేదాలు స్వల్పమే. దీని కంటే మహారాష్ట్ర అస్థిత్వం ప్రమాదంలో ఉంది. మా విభేదాలు మహారాష్ట్ర ప్రయోజనాలు, మరాఠీ ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయి. కలవడం కష్టం కాదు ఇది మనసుకు సంబంధించింది.. ఇది నా స్వార్థం గురించి కాదు.. రాష్ట్ర ప్రయోజనాల కోసం తన స్వార్థం, అహంభావం పక్కన పెట్టేందుకు నేను సిద్ధం' అని వెల్లడించారు. ఇదే జరిగితే గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీకి సంపూర్ణ మద్దతుకు వ్యతిరేకంగా ఉంటుంది.అటు, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, 'నేను చిన్న చిన్న విబేధాలును పక్కన పెట్టేందుకు సిద్ధం. కానీ ఒక షరతు ఉంది.. మనం ఒక రోజు మద్దతు ఇచ్చి, మరో రోజు వ్యతిరేకంగా నిలబడి, మళ్లీ ఒప్పందాలు చేసుకుంటూ ఉండలేం.. మహారాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేసే ఎవరినీ నేను ఆహ్వానించను. ఇది స్పష్టంగా చెప్పాలి' అని అన్నారు.ఉద్ధవ్ వర్గం నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ కూడా ఈ విషయంపై స్పందించారు. ఇద్దరు ఠాక్రేలు కలిసి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. అయితే, ఉద్ధవ్ పెట్టిన షరతు అంటే రాజ్ ఠాక్రే మహారాష్ట్ర, శివసేన శత్రువులకు మద్దతివ్వకూడదన్నది మాత్రం స్పష్టం చేశారు.
రాజకీయ పార్టీలు ఎలా స్పందించాయి?
బీజేపీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ.. "వారు కలిసి వస్తే మాకు ఆనందమే... ఇది మంచిదే. కానీ బృహన్ ముంబయి కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీయే ఓడించలేరు' అన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవన్కులే మాట్లాడుతూ.. రాజ్ ఠాక్రే తన భవిష్యత్తు నిర్ణయించుకోవచ్చు. మేము అభ్యంతరం చెప్పమని అన్నారు.
కాంగ్రెస్: మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సాప్కాల్ మాట్లాడుతూ.. మరాఠీ భాష, సంస్కృతికి బీజేపీ ముప్పు తెస్తోందనే అభిప్రాయాన్ని రాజ్ ఠాక్రే అంగీకరిస్తున్నట్లు కనపడుతోంది' అన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | సోమవారం | 21 । ఏప్రిల్ । 2025

## అలాంటి వాడితోనే తాళి కట్టించుకుంటా!



త్రిష ప్రస్తుతం 'థగ్ లైఫ్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఆమె ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో వివాహం గురించి ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. వివాహబంధంపై మీ అభిప్రాయ మేంటి? అనే ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. 'జరుగుతున్న పరిణామాలు, చూస్తున్న నిదర్శనాలను బట్టి ప్రస్తుతానికైతే పెళ్లిపై నాకంత సదభిప్రాయం లేదు. నిజం చెప్పాలంటే మూడుముళ్ల బంధంపై నాకు నమ్మకం పోయింది. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు.కొందరైతే విడాకులు తీసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి నాకు రాకూడదని కోరుకుంటున్నా' అన్నారు త్రిష. ఇంకా చెబుతూ 'పెళ్లి ఎందుకు చేసుకోలేదు? అనడిగితే నాదగ్గర సమాధానం లేదు. ఎప్పుడు చేసుకుంటారు? అంటే నాకు తెలియదు. అసలు నాకు పెళ్లి యోగం ఉందో లేదో తెలియదు. పెళ్లి జరిగినా ఓకే.. జరక్కపోయినా ఓకే. నాకైతే బాధ లేదు. మనిషి ఆశాజీవి కాబట్టి ఒక్కటి మాత్రం చెబుతా.. పెళ్లంటూ చేసుకుంటే నచ్చినవాడ్నే చేసుకుంటా. వాడు జీవితాంతం నాకు తోడుంటాడని నమ్మితేనే తాళికట్టించుకుంటా. ఇదిమాత్రం పక్కా' అని చెప్పుకొచ్చారు త్రిష. ఈ సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ సైతం షాకయ్యారు.



## ఎల్లే కవర్‌పై చిల్లింగ్ పూజా



తమిళ స్టార్ హీరో సూర్య సరసన రెట్రో చిత్రంలో నటించింది పూజా హెగ్డే. కొంత గ్యాప్ తర్వాత ఈ భామ సౌత్ లోకి తిరిగి ఎంట్రీ ఇస్తోంది. రెట్రో మే 1న థియేటర్లలోకి విడుదల కానుంది. తదుపరి దళపతి విజయ్ సరసన జననాయగన్ అనే చిత్రంలోను పూజా నటించనుంది. ఇలాంటి సమయంలో పూజా తన అభిమానులను అస్సలు విస్మరించడం లేదు. వారికి కావాల్సిన ట్రీట్ ని ఇస్తూ పండగ వాతావరణం తెస్తోంది. లేటెస్ట్ ఎల్లే కవర్ షూట్ లో పూజా రకరకాల డిజైనర్ దుస్తుల్లో ఇంటర్నెట్ లో దుమ్ము దులిపేస్తోంది. డబ్బా రోల్ అంటూ సహనటిపై సిమ్రన్ పంచ్ కవర్ పేజీ కోసం పూజా చెలరేగి గ్లామర్ ని ప్రదర్శించింది. ఎంపిక చేసుకున్న డిజైనర్ దుస్తుల్లో ట్రెడిషన్ మిస్ కాకుండానే, అందంగా తనలోని పాజిటివ్ ఎలిమెంట్స్‌ని మరింత స్టైల్ గా ప్రదర్శించింది. అది రాజస్తానీ కళంకార్ డిజైన్ అయినా లేదా జైపూర్ సాంప్రదాయ డిజైన్ అయినా.. పూజా టోన్డ్ లుక్‌ని థై సొగసుల్ని ఎలివేట్ చేస్తూ, రూపొందించిన ఈ డిజైనర్ లుక్ ఇప్పుడు ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోంది. పూజా ఎంపిక చేసుకున్న రకరకాల డిజైనర్ దుస్తుల్లో బ్లాక్ కలర్ డిజైనర్ ఫ్రాక్ ఎంతో స్పెషల్‌గా ఆకట్టుకుంది. ఓవరాల్‌గా ఎల్లే ఫోటోషూట్ ఇంటర్నెట్‌లో జోరుగా వైరల్ అవుతోంది. మారణహోమానికి ముందు కూల్‌గా ఎన్టీఆర్ టాలీవుడ్‌లో అల వైకుంఠపురములో లాంటి క్లాసిక్ హిట్ చిత్రంలో నటించిన పూజా హెగ్డే చరణ్ సరసన ఆచార్య మూవీలో నటించింది. ఆ తర్వాత పరిశ్రమకు దూరమైంది. మహేష్, చరణ్ లాంటి స్టార్ల సరసన మళ్లీ నటిస్తుందని భావించినా కానీ ఎందుకనో ఈ బ్యూటీకి అవకాశాలు కనుమరుగయ్యాయి. పూజా మళ్లీ ఎప్పటికి రీఎంట్రీ ఇస్తుందో వేచి చూడాలి.

## అమ్మని గుర్తు చేసుకున్న మహేష్ బాబు



మహేష్ బాబు తాజాగా తన తల్లి ఇందిరమ్మను గుర్తు చేసుకున్నారు. మూడేళ్ల క్రితం మహేష్ బాబు తల్లి కన్నుమూసిన సంగతి తెలిసిందే. అయితే ఏప్రిల్ 20న ఇందిరమ్మ జయంతి సందర్భంగా మహేష్ బాబు, మంజుల ఘట్టమనేని, ప్రియదర్శిని తల్లిని గుర్తు చేసుకుని ఎమోషనల్ పోస్ట్ వేశారు. మిస్ యూ అమ్మ అంటూ మహేష్ బాబు వేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. 2022 సెప్టెంబర్‌లో ఇందిరమ్మ మరణించిన సంగతి తెలిసిందే.సూపర్ స్టార్ మహేష్ బాబు తాజాగా తన తల్లి ఇందిరా దేవిని గుర్తు చేసుకున్నారు. మహేష్ బాబు తల్లి ఇందిరమ్మ గత మూడేళ్ల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా మహేష్ బాబు తన మాతృమూర్తి జయంతి సందర్భంగా పోస్ట్ వేశారు. హ్యాపీ బర్త్ డే అమ్మ.. మిస్ యూ అమ్మ అంటూ పోస్ట్ వేశారు. ఇక మంజుల ఘట్టమనేని, ప్రియదర్శిని కూడా అమ్మని గుర్తు చేసుకుంటూ పోస్టులు వేశారు. మిస్ యూ అమ్మ అంటూ వీరంతా వేసిన పోస్టుకు అభిమానులు స్పందిస్తున్నారు. బీ స్ట్రాంగ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.మహేష్ బాబు ఇంట్లో 2022లో వరుసగా విషాదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. అన్న రమేష్ బాబు, నాన్న కృష్ణ, తల్లి ఇందిరమ్మ ఇలా అందరూ వరుసగా మరణించిడంతో మహేష్ బాబు మరింత కుంగిపోయాడు. ఇక మహేష్ బాబు ప్రస్తుతం తన సినిమా పనుల్లో బిజీగా ఉంటున్నాడు. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాజమౌళి మహేష్ బాబు సినిమా పనులు చకచకా జరిగిపోతోన్నాయి.హ్యాపీ బర్త్ డే అమ్మ.. నిన్ను ప్రతీ రోజూ మిస్ అవుతూనే ఉంటాం.. ముఖ్యంగా ఈ రోజు మాత్రం ఎక్కువ మిస్ అవుతుంటాం.. మా గుండెల్లో నువ్వు ఇప్పటికీ, ఎప్పటికీ ఉంటావ్.. నీతో గడిపిన ఆ క్షణాలు ఎప్పటికీ అలానే ఉంటాయి అని ప్రియదర్శిని ఎమోషనల్ అయింది. హ్యాపీ బర్త్ డే అమ్మా.. నీ ప్రేమ, నీ స్పిరిటి, నువ్వు మాతో ఉన్న ఆక్షణాలు ఎప్పటికీ అలానే నిలిచిపోయి ఉంటాయి అని పోస్ట్ వేసింది మంజుల ఘట్టమనేని.ఇక ఇందిరమ్మ మీద సితార, గౌతమ్, నమ్రత కూడా పోస్ట్ వేసేలా ఉన్నారు. నాయనమ్మ అంటూ సితార, గౌతమ్ పోస్టులు వేస్తుంటారు. మరి ఈ సారి సితార ఎలాంటి ఫోటోతో నాయనమ్మని గుర్తు చేసుకుంటుందో చూడాలి. ఇక మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి ప్రాజెక్టుతో బిజీగా ఉన్నాడు. మధ్యలో కాస్త గ్యాప్ తీసుకుని ఆ పాస్ పోర్టుని లాక్కుని సితారను తీసుకుని ఫారిన్ టూర్‌కు మహేష్ బాబు వెళ్లిన సంగతి తెలిసిందే. తన సినిమా షూటింగ్ ముగిసే వరకు రాజమౌళి ఆ పాస్ పోర్టుని మహేష్ బాబుకి ఇవ్వరని అంతా అనుకున్నారు. కానీ మహేష్ బాబు ఎలాగోలా ఆ పాస్ పోర్టుని దక్కించుకున్నాడు. మెల్లిగా తన కూతురు సితారను తీసుకుని జారుకున్నాడు.

## ఎన్టీఆర్-నీల్ కోసం బయల్దేరిన మ్యాన్ ఆఫ్ మాసెస్..



ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఓ సినిమాను చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకి ప్రస్తుతం ఎన్టీఆర్ నీల్ అని వర్కింగ్ టైటిల్‌ను పెట్టుకున్నారు. ఇక ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్టులో ఎన్టీఆర్ అడుగు పెట్టబోతోన్నాడు. ఏప్రిల్ 22న ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్టులోకి మ్యాన్ ఆఫ్ మాసెస్ అడుగు పెడతారని ఇది వరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఎన్టీఆర్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం బయల్దేరాడు. చూస్తుంటే ఈ మూవీ షెడ్యూల్ కోసమే ఎన్టీఆర్ మరింత స్లిమ్ అయినట్టుగా కనిపిస్తోంది. ప్రశాంత్ నీల్ స్క్రిప్టుకి తగ్గట్టుగానే ఎన్టీఆర్ మారినట్టుగా తెలుస్తోంది. ఎన్టీఆర్ ఇన్ని రోజులు కాస్త రెస్ట్ మోడ్‌లోనే ఉండిపోయాడు. అంతకు ముందు వార్ 2 షూటింగ్ అంటూ బిజీగా గడిపాడు. ఈ వార్ 2 ఆగస్టులో ఆడియెన్స్ ముందుకు రానుంది. ఇప్పటికే షూటింగ్ అంతా పూర్తయినట్టుగా సమాచారం. ఒక సాంగ్ షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉందని టాక్. ఇక ఈ పాటలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి డ్యాన్స్ చేయబోతోన్నారు. ఈ పాట కోసం హృతిక్ రోషన్ చాలా వెయిట్ చేస్తున్నాడట.అయితే హృతిక్‌కి గాయం అవ్వడంతో ఆ పాట షూటింగ్‌ను వాయిదా వేశారు. అంత లోపు ఎన్టీఆర్ ఈ నీల్ ప్రాజెక్ట్‌లోని ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుని వచ్చేలా ఉన్నాడు. ఈ ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్ట్ తరువాత నెల్సన్‌తో ఓ మూవీ ఉండేలా కనిపిస్తోంది. రీసెంట్‌గానే మ్యాడ్ సక్సెస్ ఈవెంట్లో నిర్మాత నాగవంశీతో ఓ సినిమా ఉంటుందని ఎన్టీఆర్ చెప్పాడు. నాగవంశీ అయితే అంతకు ముందు నెల్సన్ చెప్పిన కథ నచ్చిందని, హీరో కోసం ట్రై చేస్తున్నామని అన్నాడు.కానీ ఎన్టీఆర్ మాటలతో అది నెల్సన్ ప్రాజెక్ట్ అని అర్థమైంది. ఈ కమిట్మెంట్లను పూర్తి చేసుకున్న తరువాత కొరటాల శివతో దేవర 2 పూర్తి చేయాల్సి ఉంటుంది. దేవర 2 ఉండదని ఒకప్పుడు అంతా అనుకున్నారు. కానీ మ్యాడ్ 2 సక్సెస్ ఈవెంట్లో మాట్లాడుతూ.. కచ్చితంగా దేవర 2 ఉంటుందని కుండ బద్దలు కొట్టేశాడు ఎన్టీఆర్. దేవర అనుకున్నంతగా సక్సెస్ కాలేదని, విమర్శలు వచ్చాయన్న సంగతి తెలిసిందే.ఇక ఇప్పుడు ఎన్టీఆర్ ఎయిర్ పోర్టులో కనిపించాడు. ఎన్టీఆర్‌తో పాటుగా మైత్రి నిర్మాతలు కూడా ఉన్నారు. అగ్ని పర్వతం బద్దలు అంటూ ఓ ఎమోజీని షేర్ చేశారు. వేట ఆరంభంటూ సినిమా షూటింగ్ సెట్‌లోకి ఎన్టీఆర్ అడుగు పెట్టబోతోన్నాడని మేకర్లు సోషల్ మీడియాలో ట్వీట్లు వేశారు.

## కంటిన్యూగా బ్లీడింగ్.. భరించలేని నొప్పి.. హాస్పిటల్‌లో రష్మీ గౌతమ్



రష్మీ గౌతమ్ ప్రస్తుతం హాస్పిటల్లో ఉంది. విపరీతంగా రక్త స్రావం అవ్వడం, ఒళ్లు నొప్పులు, సడెన్‌గా హిమోగ్లోబిన్ స్థాయి 9కి పడిపోవడంతో వెంటనే హాస్పిటల్లో జాయిన్ అయిందట. గత కొన్ని నెలలుగా ఏదో సమస్య ఉందని అర్థం అవుతోందట. తన కమిట్మెంట్లను పూర్తి చేసుకుని ఇప్పుడు ఇలా హాస్పిటల్‌లో జాయిన్ అయినట్టుగా పేర్కొంది. ఇంకొన్ని రోజులు ఇలానే రెస్ట్ మోడ్‌లో ఉంటానని రష్మీ చెబుతోంది.రష్మీ గౌతమ్ తాజాగా తన ఆరోగ్య పరిస్థితి గురించి వివరించింది. గత కొన్ని రోజులుగా తన హెల్త్ ఏమీ బాగుండటం లేదని చెప్పింది. ఏదో తేడా కొడుతోందన్న అనుమానం కూడా వచ్చిందట. అందుకే త్వరగా తన కమిట్మెంట్లను పూర్తి చేసుకుందట. విపరీతంగా రక్త స్రావం, ఒళ్లు నొప్పులు ఎక్కువ అయ్యాయట. చివరకు తన హీమోగ్లోబిన్ స్థాయి 9కి పడిపోయిందని చెప్పుకొచ్చింది. ఏం జరుగుతోందో అర్థం కాక ఇలా హాస్పిటల్‌లో చేరానంటూ రష్మీ గౌతమ్ పోస్ట్ వేసింది. ఈ ఐదు రోజులు నాకు తోడుగా ఉన్న ఫ్యామిలీ, ఫ్రెండ్స్, హాస్పిటల్ టీంకు థాంక్స్ అంటూ రష్మీ గౌతమ్ పోస్ట్ వేసింది. సడెన్‌గా హీమోగ్లోబిన్ స్థాయి 9కి పడిపోయిందని రష్మీ తెలిపింది. జనవరి నుంచి కంటిన్యూగా రక్తస్రావం అవుతూనే ఉందట. భుజాలు కూడా చాలా నొప్పి పుట్టించేవట. ఆ బాధను భరించలేకపోయిందట. అసలు ఈ సమస్య గురించి ఏ డాక్టర్‌ను కన్సల్ట్ అవ్వాలో కూడా అర్థం కాలేదట.
ఎలాగోలా మార్చి 29 వరకు మ్యానేజ్ చేసిందట. అంత వరకు తన కమిట్మెంట్లను కష్టంగానే పూర్తి చేసిందట. ఏప్రిల్ 18న ఆపరేషన్ అయిందని, ఇప్పుడు క్షేమంగానే ఉన్నానని రష్మీ చెప్పుకొచ్చింది. కానీ అసలు తనకు వచ్చిన సమస్య ఏంటన్నది మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. ఇంకా కొన్ని రోజులు ఇలానే రెస్ట్ మోడ్‌లో ఉంటానని మాత్రం చెప్పింది. అంతా సెట్ అయ్యాక మళ్లీ కమ్ బ్యాక్ ఇస్తానని చెప్పుకొచ్చింది. ఇంకో మూడు వారాలు మాత్రం రెస్ట్ మోడ్‌లోనే రష్మీ ఉంటుందట.
వాచ్‌సీయూ భూవివాదం మీద రష్మీ గౌతమ్ స్పందిస్తూ వీడియో రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. హెచ్‌సీయూ భూముల్ని ఆక్రమించొద్దని, అడవిని నరికివేయొద్దని, మూగ జీవాలకు ఇళ్లు లేకుండా చేయొద్దని, వాటి గోడు వినమని ప్రభుత్వాన్ని రష్మీ గౌతమ్ కోరింది. ఇక రష్మీ గౌతమ్ అయితే జయం సినిమాలో హీరోయిన్‌గా నటించే ఛాన్స్ మిస్ అయిందట. ఈ విషయాన్ని ఈ మధ్య నితిన్ బయటపెట్టేశాడు. జయం మూవీ రిహార్సల్స్ అన్నీ కూడా రష్మీ గౌతమ్‌తోనే చేశాడట.
కానీ చివర్లో రష్మీ గౌతమ్ ప్లేస్‌లో సదాని తీసుకున్నారట. కానీ రొమాంటిక్ సీన్లన్నీ కూడా రష్మీ గౌతమ్‌తోనే ప్రాక్టీస్ చేశానని నితిన్ చెప్పాడు. ఇక రష్మీ ప్రస్తుతం వెండితెరకు దూరంగా.. బుల్లితెరకు దగ్గరగా ఉంటోంది. ఆమె చేసిన ప్రతీ సినిమా సిల్వర్ స్క్రీన్ వద్ద బోల్తా కొడుతూనే వస్తోంది. దీంతో ఆమె ఫోకస్ అంతా బుల్లితెరపైనే పెట్టేసింది.

## ధనుష్ 'కుబేర' నుంచి ఫస్ట్ సింగిల్ 'పోయి రా మావా' రిలీజ్

తమిళ నటుడు ధనుష్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'కుబేర'. ఆనంద్, గోదావరి, హ్యాపీడేస్, ఫిదా, వంటి క్లాసిక్ సినిమాలు తీసిన శేఖర్ కమ్ముల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా.. టాలీవుడ్ అగ్ర నటుడు అక్కినేని నాగార్జున కీలక పాత్రలో ఈ సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాను జూన్ 20న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ స్టార్ట్ చేసింది చిత్రయూనిట్. ఇప్పటికే మూవీ నుంచి వరుస అప్‌డేట్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఫస్ట్ సింగిల్‌ను పంచుకుంది.ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ 'పోయి రా మావా' అంటూ సాగే ఈ పాటను ధనుష్ పాడగా.. భాస్కర్ భట్ల లిరిక్స్ రాశారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ప్రస్తుతం వైరలవుతున్న ఈ పాటను మీరు కూడా చూసేయండి. ముంబై బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుంది. ధనుష్ ఇందులో బిచ్చగాడి పాత్రల్లో కనిపించనుండగా.. నాగార్జున బిజినెస్ టైకున్ పాత్రలో మెరవబోతున్నాడు. ఏషియన్ సినిమాస్ అధినేత సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్‌రావుతో కలిసి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాడు.




## అక్కినేని కోడలు బంగారు నెమలి అవతారం



అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ ఫ్యాషన్ సెన్స్ అన్నివేళలా యువతరంలో హాట్ టాపిక్. శోభిత పోటీ నాయికల కంటే ఎంపికల పరంగా అడ్వాన్స్‌డ్ గా ఉంటుంది. ప్రతిసారీ ఏదో ఒక కొత్తదనం నిండిన డిజైనర్ లుక్ తో వేదికలపై మ్యాజిక్ చేస్తోంది. ఈసారి కూడా ఈ భామ కొత్త లుక్ స్టన్నర్ గా నిలిచింది. ఎంపిక చేసుకున్న డిజైనర్ ఫ్రాక్ అణువణువునా బంగారు మిరుమిట్లు కళ్లు జిగేల్మనిపిస్తున్నాయి. అదే సమయంలో ఈ థై స్లిట్ ఫ్రాక్ నెమలి పించాల డిజైన్ తో శోభిత అందాన్ని పదింతలు పెంచింది. శోభిత నడిచి వెళుతుంటే, నెమలి నడకను తలపిస్తోంది. బంగారు నెమలి దారి తప్పి వచ్చిందా? అన్నంత అందంగా కనిపిస్తోంది ఈ కొత్త లుక్. దీనికి శోభిత అందమైన క్యాప్షన్ ఇచ్చింది. గోల్డెన్ అవర్ .. కానీ దానిని కోచర్‌గా చేసుకోండి..అని దీనికి అందమైన శీర్షికను ఇచ్చింది. నిజానికి డిజైనర్లు ఎక్కువగా ప్రకృతి నుంచి, సముద్ర జీవుల నుంచి, పక్షులు జంతుజాలం నుంచి క్రిమి కీటకాల నుంచి కూడా స్ఫూర్తి పొంది.. దుస్తుల్ని డిజైన్ చేసామని చెబుతుంటారు. ఇప్పుడు శోభిత ఎంపిక చేసుకున్న ఈ డిజైనర్ ఫ్రాక్ కి అందమైన నెమలి లేదా ఫెదర్ తో కళకళలాడ ఏదైనా పెద్ద పక్షి స్ఫూర్తి అని భావించాలి. అక్కినేని నాగచైతన్యను పెళ్లాడిన తర్వాత శోభిత కెరీర్ పరంగా స్పీడ్ తగ్గించింది. మంకీ మ్యాన్, జిగ్రా తర్వాత సినిమాలేవీ లేవు. శోభిత ప్రస్తుతం ఫ్యామిలీ లైఫ్ పై సీరియస్ గా దృష్టి సారించిందని అర్థమవుతోంది. మరోవైపు చైతన్య వరుస విజయాలతో కెరీర్ పరంగా స్పీడ్ పెంచాడు.

## లక్నోదే లక్.. అవేశ్‌ఖాన్ అద్భుత ప్రదర్శనతో రాయల్స్‌కు షాక్




**జైపూర్-నవభూమి:** ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను ఊపేసింది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ 2 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. ఆఖరి ఓవర్‌లో విజయానికి 9 పరుగులు అవసరమైన దశలో లక్నో పేసర్ అవేశ్‌ఖాన్ అద్భుతం చేశాడు. హెట్‌మైర్(12)ను ఔట్ చేసిన అవేశ్ 6 పరుగులే ఇచ్చుకుని లక్నోకు అదిరిపోయే విజయాన్ని అందించాడు. దీంతో 181 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 178/5 కు పరిమితమైంది. యశస్వీ జైస్వాల్ (52 బంతుల్లో 74, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ ఫామ్‌ను కొనసాగించగా కెప్టెన్ రియాన్ పరాగ్ (39) మెరిశాడు. ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన 14 ఏండ్ల చిన్నోడు వైభవ్ సూర్యవంశీ (20 బంతుల్లో 34, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) ఐపీఎల్‌లో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. నిర్ణీత ఓవర్లలో 180/5 పరుగులు చేసింది. మార్క్మ్ (45 బంతుల్లో 66, 5 ఫోర్లు, 3 సిక్సర్లు), అయుశ్ బదోని (34 బంతుల్లో 50, 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

**జైస్వాల్ జోరు**

ఛేదనను రాజస్థాన్ ధాటిగా ఆరంభించింది. జైస్వాల్‌తో పాటు క్రీజులోకి వచ్చిన పాలబుగ్గల పసివాడు వైభవ్.. ఈ లీగ్‌లో తాను ఆడిన మొదటి బంతినే భారీ సిక్సర్ కొట్టాడు. శార్దూల్ వేసిన గుడ్ లెంగ్త్ బంతిని కవర్స్ దిశగా సిక్స్ బాదాడు. అవేశ్ బౌలింగ్‌లోనూ సిక్స్ కొట్టిన వైభవ్.. జైస్వాల్‌తో కలిసి తొలి వికెట్‌కు 8.4 ఓవర్లలో 85 పరుగులు జోడించి ఆ జట్టుకు శుభారంభాన్ని అందించాడు. శార్దూల్ 3వ ఓవర్లో 4 ,6తో బాదుడు మొదలుపెట్టిన జైస్వాల్.. మార్క్మ్ ఓవర్లోనూ రెండు సిక్సర్లతో అలరించాడు.

## 203 ఉఫ్ .. ఢిల్లీపై గుజరాత్ అలవోక విజయం




**అహ్మదాబాద్ -నవభూమి:** ఈ సీజన్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్ (జీటీ).. సొంతగడ్డపై మరో భారీ విజయాన్ని నమోదుచేసింది. శనివారం అహ్మదాబాద్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థిని 7 వికెట్ల తేడాతో ఓడించింది. జోస్ బట్లర్ (54 బంతుల్లో 97 నాటౌట్, 11 ఫోర్లు, 4 సిక్సర్లు), షెర్ఫేన్ రూథర్‌ఫర్ట్ (34 బంతుల్లో 43, 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించడంతో ఢిల్లీ నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని టైటాన్స్.. మరో 4 బంతులు మిగిలుండగానే ఊదేసింది. మొదట బ్యాటింగ్ చేసిన క్యాపిటల్స్‌కు బ్యాటర్లు సమిష్టిగా రాణించినా ఒక్కరూ అర్ధ సెంచరీ మార్కును దాటలేకపోయారు. కెప్టెన్ అక్షర్ పటేల్ (32 బంతుల్లో 39, 1 ఫోర్, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా అశుతోశ్ (19 బంతుల్లో 37, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), కరుణ్ నాయర్ (31), స్టబ్స్ (31) రాణించారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ (4/41) నాలుగు కీలక వికెట్లు పడగొట్టాడు. బట్లర్‌కే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

## డోపింగ్ ప్రకంపనలు.. ఏడుగురు అథ్లెట్లు, ముగ్గురు కోచ్‌లపై బ్యాన్



**న్యూఢిల్లీ-నవభూమి:** డోపింగ్ ఆరోపణలతో ఏడుగురు అథ్లెట్లు, ముగ్గురు కోచ్‌లపై నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) సస్పెన్షన్ వేటు వేసింది. జూనియర్ జాతీయ జట్టు చీఫ్ కోచ్ రమేష్ నాగ్‌పురితోపాటు ఇద్దరు అదనపు కోచ్‌లు కరంవీర్ సింగ్, రాకేష్‌లకు జరిమానా విధించింది నాడా. సస్పెన్షన్‌కు గురైన క్రీడాకారుల్లో పరాస్ సింఘాల్, పూజా రాణి, నలుబోతు షణ్ముగ శ్రీనివాసులు, చెలిమి ప్రతుష, శుభం మహారా, కిరణ్, జ్యోతి ఉన్నారు.

**యాంటీ డోపింగ్ సెల్ ఏర్పాటు**

డోపింగ్ పరీక్షలకు సహకరించలేదనే ఆరోపణలతో ఈ ఏడుగురు క్రీడాకారులను నాడా సస్పెండ్ చేసింది. డోపింగ్ ఆరోపణలపై భారత అథ్లెటిక్స్ సమాఖ్య వేగంగా స్పందించింది. డోపింగ్ ఆరోపణలపై కోచ్‌లు వివరణ ఇవ్వాలని లేని పక్షంలో వారిపై నిషేధం విధిస్తామని హెచ్చరించింది. డోపింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న శిక్షణా కేంద్రాలను పర్యవేక్షించడానికి యాంటీ డోపింగ్ సెల్‌ను కూడా ఏర్పాటు చేసింది నాడా.
బ్యాగ్రౌండ్ ఇదే..నాడా సస్పెండ్ చేసిన ఏడు మంది అథ్లెట్లు వాళ్ల కేటగిరీల్లో బాగా సక్సెస్ అయినవారే. 19 ఏళ్ల సింఘాల్ ఖేలో ఇండియా యూత్ ఒలింపిక్స్-2024 గేమ్స్‌లో మెడల్ కొట్టాడు. పురుషుల 2000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో హరియాణా తరపున బరిలోకి దిగి విజేతగా నిలిచాడు. శ్రీనివాస్ అనే మరో ఆటగాడు ఫెడరేషన్ కప్‌లో 200 మీటర్ల ఫైట్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**